ప్రకటనల కోసం సంప్రదించండి
98483 28698



తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక

Estd : 2002

# జనంసాక్షి

www.janamsakshi.org

సోమవారం 04.08.2025 | సంపుటి : 12 సంచిక : 16 | పేజీలు : 12 వెల : రూ. 4/-

RNI NO.TELTEL / 2013 /50370



సామాన్యుని స్వరం
జనంసాక్షి tv
JANAMSAKSHI TV



తెలంగాణ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్




శృతిమించిన రాగం..



# కవితపై వేటుకు రంగం సిద్ధం!

## బహిష్కరించకపోతే పార్టీకి మరింత నష్టమని అధిష్టానం నిర్ణయం

## బీజేపీలోకి బీఆర్ఎస్ విలీనం వ్యాఖ్యల్ని తీవ్రంగా పరిగణించిన కేసీఆర్

### వేటేస్తేనే పార్టీకి మనుగడ..!

బీజేపీలో పార్టీని విలీనం చేసేందుకు ప్రయత్నిస్తున్నారనే కవిత వ్యాఖ్యలను బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ తీవ్రంగా పరిగణించినట్టు సమాచారం. తరచూ పార్టీపై, నేతలపై విమర్శలు చేయడం వల్ల ముున్ముందు తీవ్ర నష్టం వాటిల్లే అవకాశాలున్నట్టు కొందరు నేతలు కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లారు. ఆమె వ్యవహారం కూడా అందుకనుగుణంగా ఉండటంతో కేసీఆర్ ప్రత్యేక దృష్టిపెట్టినట్టు తెలుస్తోంది. స్థానిక సంస్థల ఎన్నికలకు ముందు ఆమె వైఖరి ఇలాగే ఉంటే చీలికలు ఏర్పడతాయని కొందరు భావిస్తున్నారు. తనపై కొంతమంది వ్యాఖ్యల వెనుక బీఆర్ఎస్ పెద్ద నేత హస్తం ఉన్నట్టు కవిత ఆరోపిస్తుండటాన్ని సైతం అధిష్టానం తీవ్రంగానే తీసుకున్నట్టు తెలిసింది. ఈ పరిణామాలన్నింటిని దృష్ట్యా ఆమె విషయంలో చర్యలు చేపట్టకపోతే పార్టీ మనుగడకే ప్రమాదమనే వాదనలు బలంగా వినిపిస్తున్నాయి. ఇప్పటికే కేటీఆర్ ఓ సమావేశంలో పరోక్షంగా హెచ్చరించగా.. జగదీశ్‌లాంటి నేతలు కూడా ఆమెను తప్పుబట్టారు. కాబట్టి పార్టీ భవిష్యత్ దృష్ట్యా ఎమ్మెల్సీ కవిత మీద వేటు వేసేందుకు బీఆర్ఎస్ అధిష్టానం నుంచి రంగం సిద్ధమైనట్టు సమాచారం.

రెండున్నర దశాబ్దాల ఉద్యమ ప్రస్థానం.. లక్షలాది మంది కార్యకర్తలు గల బలమైన సైన్యం.. రెండు పర్యాయాలు రాష్ట్రాన్ని పాలించిన పటుత్వ నాయకత్వం.. కానీ తాజా పరిణామాలు ఆ పార్టీని ఆత్మరక్షణలోకి నెడుతున్నాయనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. 'ఇంటి దొంగను ఈశ్వరుడెరుగడు' అన్న చందంగా ఇంట్లో నుంచే పార్టీ ఉనికిని ప్రశ్నార్థకం చేసిన ఓ ప్రచారాన్ని శ్రేణులు జీర్ణించుకోలేకపోతున్నాయి. చెట్టు మొదలు నరికివేసేందుకు సిద్ధమైన ఓ నేత.. లక్షలాది మంది కార్యకర్తల ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీసేలా వ్యవహరించడం పార్టీకి చేటు చేస్తుందనే వాదన శరవేగంగా వ్యాప్తిస్తోంది. అనుబంధాలు వేరు.. రాజకీయాలు వేరని సొంతింట్లోనే వైరం ముదిరిందనే సంకేతాలివ్వకనే ఇచ్చేయడం మరింత సంక్షోభానికి కారణంగా మారింది. ఈ మొత్తం వ్యవహారం స్థానిక ఎన్నికలకు ముందు పార్టీకి నష్టం చేకూరుస్తుందనే విశ్లేషణలు వెలువడుతుండగా.. సుదీర్ఘకాల మనుగడను సుస్థిరంగా ఉంచుకోవాలంటే 'గీత దాటిన సదరు నేత'పై వేటు తప్పదని తెలుస్తోంది.

- ఉపేక్షిస్తే పార్టీ మనుగడకే ప్రమాదమనే అభిప్రాయాలు
- ఇప్పటికే లక్షలాది కార్యకర్తల ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీసిన ఎమ్మెల్సీ
- ప్రతి జిల్లాలో ఆమెకు దూరంగానే ఉంటున్న పలువురు కీలక నేతలు

*స్పెషల్ కరస్పాండెంట్ (జనంసాక్షి) :*

బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత వైఖరి గత కొంతకాలంగా చర్చనీయాంశంగా మారుతున్న తరుణంలో కేసీఆర్‌కు ఆమె రాసిన లేఖ బహిర్గతం కావడం హాట్ టాపిక్‌గా నిలిచింది. పార్టీని బీజేపీలో విలీనం చేయాలనుకుంటున్నారని తీవ్ర స్థాయిలో ఆమె వ్యాఖ్యలు చేయడం సంచలనమైంది. ఈ నేపథ్యంలో బీఆర్ఎస్‌లో అంతర్గత సంక్షోభం ముదిరిందా అనే విశ్లేషణలు వచ్చాయి. అధికార, ప్రతిపక్షాలు కూడా ఈ వ్యవహారంపై పలువిధాలుగా స్పందించి బీఆర్ఎస్‌ను టార్గెట్ చేశాయి. అయితే ఎమ్మెల్సీ కవిత ప్రవర్తన వల్ల తన సోదరుడు కేటీఆర్‌తో విభేదాలున్నట్టు తెలుస్తోంది. కేవలం కేసీఆర్ నాయకత్వంలోనే తామంతా పనిచేస్తామని, బీఆర్ఎస్‌లో ఇతరుల నాయకత్వాన్ని సమర్థించబోమని కవిత ప్రకటించడం గమనార్హం. రాబోయే రాఖీ పండుగ నేపథ్యంలో 'మా అన్నతో అనుబంధం వేరు.. రాజకీయాలు వేరు' అంటూ కవిత తాజాగా చెప్పడం కూడా కేటీఆర్‌తో తనకు దూరం పెరిగిందనే అంశాన్ని తెలియజేస్తోంది. పదేపదే బీఆర్ఎస్‌లో ఉన్న కీలక నేతలనుద్దేశించి ఆమె విమర్శలు గుప్పించడం, ఏకపక్షంగా ముందుకెళ్లడం, సొంత నిర్ణయాలు తీసుకోవడం పట్ల కేసీఆర్, కేటీఆర్ సీరియస్ అయినట్టు తెలిసింది. ఇకపై ఎట్టి పరిస్థితుల్లోనూ ఆమె వ్యాఖ్యలను సహించేది లేదనే స్పష్టతకొచ్చినట్టు సమాచారం.

### కవితతో అందరూ దూరం.. దూరం

ఢిల్లీ లిక్కర్ స్కాంలో అరెస్టు, అనంతరం జైలు నుంచి వచ్చిన తర్వాత కవితకు పార్టీలో సరైన మద్దతు లభించలేదు. ఈ విషయం కేసీఆర్‌కు ఆమె రాసిన లేఖలోనూ వెల్లడైంది. కారణాలేమైనప్పటికీ.. పార్టీ నేతలపై విమర్శలు చేస్తూనే జిల్లాలవారీగా సొంతంగానే పలు కార్యక్రమాలు చేపడుతున్న కవితకు స్థానిక నేతల నుంచి ఎలాంటి మద్దతూ లభించడం లేదు. ఇటీవల ఆమెపై తీన్మార్ మల్లన్న వ్యాఖ్యల సందర్భంగానూ బీఆర్ ఎస్ నేతలుగానీ, ఎమ్మెల్యేలుగానీ ఎవరూ ఆమె పట్ల సానుభూతి తెలపలేదు. కీలక నేతలు కూడా ఆమెకు దూరంగానే ఉంటున్నారు. మిగతా 2లో..

## నల్గొండ జిల్లాలో లిల్లీపుట్ జగదీశ్వర్‌రెడ్డి

ఇంటి ఆడబిడ్డపై వ్యాఖ్యలు చేస్తే భారాస సోదరులు మాట్లాడలేదు ..
- ఎమ్మెల్సీ కవిత విమర్శలు



హైదరాబాద్(జనంసాక్షి):ఇంటి ఆడబిడ్డపై వ్యాఖ్యలు చేస్తే భారత రాష్ట్ర సమితి సోదరులు మాట్లాడలేదని ఎమ్మెల్సీ కవిత అన్నారు. తనపై కుట్ర చేస్తోంది పెద్ద నాయకుడు అని ఆరోపించారు. "నల్గొండ జిల్లాలో పార్టీ ఓటమికి కారణమైన లిల్లీపుట్ నేత నా గురించి మాట్లాడుతారా? కేసీఆర్ లేకుంటే ఆ లిల్లీపుట్ ఎవరు? మా నాన్న కేసీఆర్‌కు రాసిన మిగతా 2లో..

## కేసీఆర్ వ్యతిరేకుల గొంతుకగా కవిత

నల్గొండలో పార్టీ గత విజయాలకు నేనే కారణమైతే.. ఇప్పుడు ఓటమికీ నేనే కారణం: మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి



హైదరాబాద్‌జనంసాక్షి): మాజీ సీఎం కేసీఆర్ శత్రువులు చేసే వ్యాఖ్యలను ఎమ్మెల్సీ కవిత మరోసారి వల్లెవేశారని మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఉదయం కవిత చేసిన వ్యాఖ్యలపై ఆయన స్పందించారు. " నా ఉద్యమ ప్రస్థానంపై కవితమ్మకు ఉన్న జ్ఞానానికి నా జోహార్లు. ఆమె చేసిన ప్రయత్నానికి నా సానుభూతి తెలియజేస్తున్నా. కేసీఆర్‌తో మాట్లాడిన విషయాలే మీడియాతో చెప్పాను. మిగతా 2లో..



## బనకచర్లపై వెనక్కు తగ్గేదేలేదు

### ప్రాజెక్టును రద్దు చేసేవరకు మా పోరు కొనసాగిస్తాం

- గోదావరి జలాలను సంపూర్ణంగా వినియోగించుకుంటాం
- 968 టీఎంసీల నీటి వాటా వాడుకునేలా ప్రాజెక్టుల నిర్మాణం
- తుమ్మిడిహట్టి, , ఇచ్చంపల్లి వద్ద బ్యారేజీ పూర్తిచేసి తీరుతాం

- పత్తిపాక రిజర్వాయర్ డిపిఆర్ తయారీకి రూ.కోటి 10 లక్షల మంజూరు
- రామగుండంలో ప్రత్యేక పారిశ్రామిక వార్డు ఏర్పాటుకు కృషి..
- రామగుండం ఎత్తిపోతల పథకాన్ని ప్రారంభించిన మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి
- పాల్గొన్న మంత్రులు తుమ్మల, శ్రీధర్‌బాబు

గోదావరిఖని,కరీంనగర్ బ్యూరో(జనంసాక్షి): గోదావరిలోరాష్ట్రానికి ఉన్న 968 టీఎంసీల నీటి వాటా సంపూర్ణంగా వినియోగించు కునేలా ప్రాజెక్టుల నిర్మాణం చేస్తామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. ఆదివారం అంతర్గాం మండలంలోని గోలివాడ వద్ద రామగుండం ఎత్తిపోతల పథకాన్ని మంత్రులు తుమ్మల నాగేశ్వర రావు, శ్రీధర్ బాబులతో కలిసి ప్రారంభించారు. అనంతరం నిర్వహించిన బహిరంగ సభలో మంత్రి ఉత్తమ్ మాట్లాడుతూ స్థానిక శాసన సభ్యుల కృషి మే రకు రామగుం డం ఎత్తిపోతల పథకాన్ని ప్రభు త్వం పూర్తి చేసిం దని అన్నారు. పత్తిపాక రిజర్వా యర్ నిర్మాణానికి మిగతా 2లో..

### సన్నబియ్యం అందిస్తున్నది తెలంగాణ మాత్రమే..
11లో

## ఒక్క చుక్క నీటినీ వదులుకోబోం




- బనకచర్ల ప్రాజెక్టు పాపం ముమ్మాటికి బీఆర్ఎస్‌దే
- రాజకీయాల కంటే రాష్ట్ర ప్రయోజనాలే మాకు ముఖ్యం
- ఏపీ ప్రభుత్వ కుట్రలు, కుతంత్రాలను అడ్డుకుని తీరుతాం
- పదేళ్లలో చేసిందేం లేదు... తప్పులను సరిదిద్దుతున్నాం
- రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క

ఖమ్మంప్రతినిధి(జనంసాక్షి):తెలంగాణకు న్యాయంగా దక్కాల్సిన సాగునీటి వాటాలో ఒక్క చుక్క నీటిని కూడా వదులుకోబోమని, తమకు రాజకీయాల కంటే రాష్ట్ర ప్రయోజనాలే ముఖ్యమని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. బనకచర్ల పాపం బీఆర్ఎస్ దేనని, ఏపీ మిగతా 2లో..

జూబ్లిహిల్స్ ఉపఎన్నిక ఎప్పుడొచ్చినా

## భారాస సిద్ధం

- పార్టీ శ్రేణులకు సూచించిన కేటీఆర్

హైదరాబాద్(జనంసాక్షి):జూబ్లీహిల్స్ ఉప ఎన్నికను అంత ఈజీగా తీసుకోవద్దని భారత రాష్ట్ర సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ పార్టీ శ్రేణులకు సూచించారు. " మాగంటి గోపీనాథ్ అకాల మరణం చాలా బాధాకరం. అనుకోకుండా వచ్చిన ఉప ఎన్నికలో పార్టీ అభ్యర్థిని గెలిపించుకోవాలి. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో క్లాస్, మాస్ అందరూ ఉంటారు. హైదరాబాద్‌లో లక్ష మంది పేదలకు జీవో 58, 59 కింద పట్టాలు ఇచ్చింది కేసీఆర్ ప్రభుత్వం.అసెంబ్లీ ఎన్నికల్లో హైదరాబాద్‌లో కాంగ్రెస్ ఒక్క సీటు కూడా గెలవలేదు. పేద వారికి మాత్రమే హైడ్రా నిబంధనలు వర్తిస్తాయా? సన్న బియ్యంతో విద్యార్థులకు అన్నం పెట్టింది.. మిగతా 2లో..




కేసీఆర్ మాటలతోనే

## తెరపైకి బనకచర్ల

- తెలంగాణను వదిలేసి రాయలసీమను రతనాల సీమ చేస్తానని అన్నారు
- ఆయన వ్యాఖ్యలతోనే ప్రాజెక్టు నిర్మాణం దిశగా ఏపీ అడుగులు వేసింది
- జనహిత పాదయాత్రలో మహేశ్‌కుమార్ గౌడ్



నిజామాబాద్‌బ్యూరో(జనంసాక్షి):మాజీ సీఎం కేసీఆర్ మాటలతోనే ఏపీ ప్రభుత్వం బనకచర్ల ప్రాజెక్టును చేపట్టిందని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ అన్నారు. గోదావరిలో 3 వేల టీఎంసీల మిగులు జలాలు ఉన్నాయని, వాటిని ఏపీ వాడుకోవచ్చని గతంలో కేసీఆర్ అన్నారని..అందుకే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆ దిశగా అడుగులు వేసిందని చెప్పారు. తెలంగాణను వదిలేసి రాయలసీమను రతనాల సీమ చేస్తానని కేసీఆర్ వ్యాఖ్యా నించారని గుర్తుచేశారు. ఇప్పుడు సామాజిక మాధ్య మాల్లో తెలంగాణ ప్రభుత్వంపై దుష్ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. నిజామా బాద్ జిల్లాలో కొనసాగు తున్న జనహిత పాదయాత్ర సందర్భంగా జక్రాన్‌పల్లి మండలం అర్గుల్‌లో నిర్వ హించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు."ఎమ్మెల్సీ కవిత ప్రస్తుతం ఏ పార్టీలో ఉన్నారో నాకు తెలియదు. కులగణన కోసం దేశవ్యాప్తంగా రాహుల్ గాంధీ పోరాటం చేశారు. ఆయన కోరిక మేరకు సీఎం రేవంత్‌రెడ్డి తెలంగాణలో కులగణన చేపట్టారు. అలాంటిది ఇప్పుడు బీసీలపై కవిత ప్రేమ ఒలకబోస్తున్నారు." అని మహేశ్‌కుమార్ గౌడ్ విమర్శించారు. ఈ సమావేశంలో రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జ్ మీనాక్షి నటరాజన్, మంత్రి సీతక్కతో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.



ఇండియా కూటమి నేతల

## కీలక భేటీ

రాహుల్ నివాసంలో నేతల సమావేశం

న్యూఢిల్లీ(జనంసాక్షి):గత ఎన్నికల్లో 70 నుంచి 80 లోక్‌సభ స్థానాల్లో రిగ్గింగ్ జరిగిందని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ ఆరోపణలు చేసిన మరుసటి రోజే (ఆదివారం) మరో విషయం వెలుగులోకి వచ్చింది. లోక్‌సభ విపక్ష నేత రాహుల్‌గాంధీ తన నివాసంలో ఆగస్టు 7న రాత్రి విపక్ష ఇండియా కూటమి నేతలకు డిన్నర్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిసింది. ఈ సందర్భంగా పలు ముఖ్య మిగతా 2లో..

### రష్యాను వణికించిన మరో భూకంపం..

రిక్టర్‌స్కేల్‌పై తీవ్రత 7.0గా నమోదు
బద్ధలైన అగ్నిపర్వతం
సునామీ హెచ్చరికలు జారీ

### ప్రయాగ్‌రాజ్‌లో వరద బీభత్సం



### మళ్లీ బయటపడ్డ పాక్ బండారం

పీవోకేలో పహల్గాం ఉగ్రవాది అంత్యక్రియలు..!

వార్త 2లో

## కవితపై వేటుకు
# రంగం సిద్ధం!

కొందరు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కూడా కవిత వ్యాఖ్యల పట్ల బహిరంగంగానే విమర్శలు చేస్తున్నారు. ఈ పరిణామాల వల్ల తన ఉనికిని కోల్పోతున్నానని భావించారో ఏమోగానీ 25 ఏండ్ల ఉద్యమ ప్రస్థానమున్న పార్టీ మొదలును నరికేందుకు సిద్ధమయ్యారామె..! బీజేపీలోని బీఆర్ఎస్‌ను విలీనం చేయకుండా కాపాడటమే తన కర్తవ్యంగా ప్రకటించుకోవడంతో యావత్ క్యాడర్‌లో అయోమయం నెలకొంది. దీంతో లక్షలాది మంది కార్యకర్తలు కూడా గందరగోళానికి గురయ్యారు. ఇది రాబోయే రోజుల్లో రాజకీయంగా పార్టీకి నష్టం చేయనుందనే భావనతో పాటు.. సరిగ్గా స్థానిక ఎన్నికల ముందు ఆమె వ్యాఖ్యలూ, వ్యవహారం పార్టీని పలుచన చేస్తుందనే ఆందోళన శ్రేణుల్లో వ్యక్తమవుతోంది. మరోవైపు జాగృతి సంస్థ పేరిట 42శాతం రిజర్వేషన్ ఉత్సవం చేయడం, సొంత బలం పెంచుకునేందుకు పలు కార్యక్రమాలు ప్రకటించడం వల్ల పార్టీలో చీలిక రానుందనే వాదనలు వస్తున్నాయి. ఉద్యమ కాలం నుంచి జాగృతి పనిచేస్తుందని ఆమె చెప్తునప్పటికీ ఆనాటి ఉద్యమం వేరు.. ఇప్పటి పరిస్థితి వేరు.

## నల్గొండ జిల్లాలో
## లిల్లీపుట్ జగదీశ్వర్‌రెడ్డి

లేఖ బయటకు లీక్ చేసింది ఎవరు? భాజపా ఎంపీ సీఎం రమేశ్ ఎందుకు మాట్లాడారో నాకు తెలియదు. ఆయన నాకు తెలుసు కానీ, గత ఆరు నెలల్లో ఎప్పుడూ మాట్లాడలేదు. ప్రభుత్వం, కోర్టు అనుమతి లేకుంటే ఇంటి నుంచే బీసీ రిజర్వేషన్ల కోసం దీక్ష చేస్తా. మ్యాచ్ ఫిక్సింగ్ చేసే వారే.. నా వెనుక ప్రభుత్వం ఉందంటే ఎలా" అని కవిత అన్నారు.

## కేసీఆర్ వ్యతిరేకుల
## గొంతుకగా కవిత

ఆయనతో భేటీలో కవిత అంశం ప్రస్తావించలేదు. బనకచర్ల, కాళేశ్వరం, ఎరువుల అంశాలపై మాత్రమే మాట్లాడాను. నల్గొండలో పార్టీ గత విజయాలకు నేనే కారణమైతే.. ఇప్పుడు ఓటమికీ నేనే కారణం. భారత రాష్ట్ర సమితికి క్రమశిక్షణ కలిగిన సైనికుడిని"అని జగదీశ్‌రెడ్డి అన్నారు.

## ఒక్క చుక్క నీటిని వదులుకోబోం...

ప్రభుత్వం పన్నుతున్న కుట్రలు, కుతంత్రాలను అడ్డుకుని తీరుతామన్నారు. ఖమ్మం జిల్లా ముదిగొండ మండలం కమలాపురం గ్రామంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ ఆధ్వర్యంలో రూ.10 కోట్లతో నిర్మించ తలపెట్టిన 10వేల మెట్రిక్ టన్నుల గోదాముల నిర్మాణ పనులకు ఆయన ఆదివారం భూమి పూజ చేశారు. 'గతంలో 5.91 లక్షల మెట్రిక్ టన్నుల సామర్థ్యమున్న గోదాంలు రైతులకు అందుబాటులో ఉండేవి. మేం అధికారంలోకొచ్చిన ఏడాదిన్నర వ్యవధిలోనే కొత్తగా 10.75 లక్షల మెట్రిక్ టన్నుల సామర్థ్యమున్న గోదాంలను నిర్మించాం. అన్నదాతల సంక్షేమం, వ్యవసాయాభివృద్ధికి మా ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోంది. అందుకే... దేశంలోనే వరిని అత్యధికంగా పండించే రాష్ట్రంగా తెలంగాణ నిలిచింది' అని ఈ సందర్భంగా ఆయన వివరించారు. 'ఉమ్మడి ఏపీలో సాగునీటి రంగంలో తెలంగాణకు తీవ్ర అన్యాయం జరిగింది. అందుకే.. సబ్బండ వర్గాలు కొట్లాడి ప్రత్యేక రాష్ట్రాన్ని తెచ్చుకున్నాం. ఇప్పుడు కూడా మన రాష్ట్రంపై అవే కుట్రలు జరుగుతున్నాయి. ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండి... వాటిని సమర్థవంతంగా తిప్పి కొట్టాలి. మన పొరుగు రాష్ట్రం ఏపీ... మన పంట పొలాలు ఎండిపోయేలా అక్రమ ప్రాజెక్టుల నిర్మాణానికి శ్రీకారం చుడుతోంది. సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఢిల్లీకి వెళ్లి సమర్థవంతంగా వాదనలు వినిపించడం వల్లే బనకచర్ల ప్రాజెక్టుకు బ్రేక్ పడింది' అని చెప్పారు. 'సాగునీటి రంగ అభివృద్ధికి పదేళ్లలో బీఆర్ఎస్ చేసింది శూన్యం. కృష్ణా, గోదావరిపై గతంలో కాంగ్రెస్ ప్రభుత్వాలు నిర్మించిన ప్రాజెక్టులే మన పంట పొలాలకు నీళ్లందిస్తున్నాయి. వాళ్ల హయాంలో ఒక్కటంటే ఒక్కటి పనికొచ్చే ప్రాజెక్టును కట్టలేదు. రూ.లక్ష కోట్లు వెచ్చించి నిర్మించిన కాళేశ్వరం వల్ల ఒక్క ఎకరాకు కూడా నీళ్లందడం లేదు. ఇప్పటికైనా బీఆర్ఎస్ నాయకులు మాపై విమర్శలు చేయడం మాని, అసలు విషయాలను తెలుసుకోవాలి' అని సూచించారు. 'అప్పుడు పోలవరం కడుతుంటే చోద్యం చూశారు. బనకచర్ల నిర్మాణానికి శ్రీకారం చుడుతుంటే పట్టించుకోలేదు. నీళ్లు సముద్రం పాలవుతున్నా పట్టనట్లుగా వ్యవహరించారు. పైగా... అప్పటి ఏపీ పాలకులకు రెడ్ కార్పెట్ తో స్వాగతం పలికి రాష్ట్ర ప్రయోజనాలు తాకట్టు పెట్టారు. విభజన చట్టంలో లేకపోయినా ఆర్డినెన్స్ ద్వారా 7 మండలాలను ఏపీలో కలుపుతుంటే స్పందించలేదు' అని విమర్శించారు. 'తెలంగాణకు పట్టిన శాపం బీఆర్ ఎస్. గత పదేళ్లలో జరిగిన తప్పులను ఒక్కొక్కటిగా సరిదిద్దుతున్నాం. కృష్ణా, గోదావరి నీటిని సద్వినియోగం చేసుకుని రాష్ట్రంలోని ప్రతి ఎకరాకు నీళ్లందించేలా పకడ్బందీ కార్యాచరణతో ముందుకెళ్తున్నాం. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని చక్క దిద్దుతూనే... సంక్షేమ పథకాలు, అభివృద్ధి ప్రాజెక్టులను సమర్థవంతంగా అమలు చేస్తున్నాం' అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కార్పోరేషన్ల ఛైర్మన్లు రాయల నాగేశ్వరరావు, నాయుడు సత్యానారాయణ, కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తదితరులు పాల్గొన్నారు.

## గంటల వ్యవధిలో.. రాష్ట్రపతితో
## మోదీ, అమిత్ షా భేటీ

**ప్రాధాన్యం సంతరించుకున్న సమావేశాలు**



న్యూఢిల్లీ(జనంసాక్షి):రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ముతో కేంద్ర హోంమంత్రి అమిత్ షా భేటీ అయ్యారు. ఆదివారం సాయంత్రం రాష్ట్రపతి భవన్‌కు వెళ్లిన ఆయన ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ విషయాన్ని రాష్ట్రపతి కార్యాలయ వర్గాలు వెల్లడించాయి. మధ్యాహ్న సమయంలో ప్రధాని మోదీ కూడా రాష్ట్రపతితో భేటీ అయిన విషయం తెలిసిందే. వీరి వరుస భేటీల వెనక కారణాలు తెలియనప్పటికీ గంటల వ్యవధిలోనే ఇరువురు కీలక నేతలు రాష్ట్రపతితో సమావేశం కావడం ప్రాధాన్యత సంతరించుకుంది. ప్రస్తుతం పార్లమెంటు వర్షాకాల సమావేశాలు కొనసాగుతున్నాయి. జులై 21న మొదలైన సమావేశాలు ఆగస్టు 12 వరకు జరగనున్నాయి. ఇటీవలే ఆపరేషన్ సిందూర్‌పై ఉభయ సభల్లో చర్చ జరిగిన సంగతి తెలిసిందే.

### జూబ్లిహిల్స్ ఉపఎన్నిక ఎప్పుడొచ్చినా భారాస సిద్ధం

కేసీఆర్ ప్రభుత్వమే. తెలంగాణలో మతం పేరుతో కేసీఆర్ రాజకీయం చేయలేదు. 20 నెలల కాంగ్రెస్ పాలనలో ఒక్క మంచి పని కూడా చేయలేదు. నూరు రోజుల్లో ఆరు గ్యారెంటీలు అమలు చేస్తామని ప్రజలను మోసం చేశారు" అని కేటీఆర్ విమర్శించారు.

# బనకచర్లపై వెనక్కుతగ్గేదేలేదు







డీటెయిల్ ప్రాజెక్ట్ రిపోర్ట్ తయారు చేసేందుకు కోటీ పది లక్షల రూపాయిలు మంజూరు చేశామని అన్నారు. రామగుండం ఎత్తిపోతల పథకం ద్వారా 75 కోట్లు ఖర్చు చేసి అంతర్గాం, ముర్మురు, బ్రాహ్మణ పల్లి ,ఎల్లంపల్లి సోమనపల్లి, మద్దిరాల , తొట్యాల పురం మొదలగు గ్రామాలకు, 17 ఎల్ ద్వారా కుక్కల గూడూరు, నిట్టూరు గ్రామాలకు మొత్తం 13 వేల పైగా ఎకరాలకు నీరు చేరుతుందని అన్నారు. ఆర్టీసీ బస్సులలో మహిళలు ఉచితంగా ప్రయాణం చేయడంలో రవాణాశాఖ మంత్రి పూర్ణం ప్రభాకర్ కృషి ఎంతగానో ఉందని అన్నారు. స్వతంత్ర భారత దేశంలో మొదటిసారి బీసీలకు 42 శాతం రిజర్వేషన్ చట్టబద్ధత సాధించడంలో మన ప్రభాకర్ కృషి చేశారని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వ పరిపాలనలో ముఖ్యమంత్రి సైతం శ్రీధర్ బాబు సలహాలు సూచనలు తీసుకుంటారని చెప్పారు. తెలంగాణ నీటి హక్కులను హరిస్తూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం బనకచర్ల ప్రాజెక్టు నిర్మించాలని చూస్తుందని, గోదావరి పేపర్ మేనేజ్మెంట్ బోర్డు నుంచి సి.డబ్ల్యూ.సి వరకు ఫిర్యాదు చేసి ఆ ప్రాజెక్టును అడ్డుకున్నామని మంత్రి తెలిపారు. ఏపీ పునర్విభజన చట్టం, నీటి హక్కులకు వ్యతిరేకంగా బనకచర్ల ప్రాజెక్టు నిర్మించాలని ఏపీ చూస్తుందని, దీనిని అన్ని వేదికలలో, న్యాయ పరంగా తెలంగాణ ప్రభుత్వం వ్యతిరేకిస్తుందని అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మించిన మంథని నియోజకవర్గం, పెద్దపల్లి జిల్లాకు ఒక ఎకరాకు నీరు ఆందించలేదని అన్నారు. సుప్రీంకోర్టు జస్టిస్ ఘోష్ అందించిన నివేదికను క్యాబినెట్ ముందు పెడ్తామని తెలిపారు. కాళేశ్వరం ప్రాజెక్టుతో గత ప్రభుత్వం లక్ష కోట్లు వృథా చేసిందని అన్నారు. తుమ్మడిహట్టి ప్రాజెక్టు 38 వేల కోట్లతో నిర్మించి ఉంటే నేడు గోదావరి పరివాహక ప్రాంతంలో కరువు ఉండేది కాదని అన్నారు. గత ప్రభుత్వం దోపిడి చేయడానికి కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మించిందని తెలిపారు. 3 బ్యారేజీలు ఫౌండేషన్ బలహీనంగా ఉందని, అక్కడ నీరు నిల్వ చేస్తే 44 ఊర్లు , భద్రాచలం కొట్టుకొని పోతాయని ఎన్.డి.ఎస్.ఎ రిపోర్ట్ అందించిందని అన్నారు. 3 బ్యారేజీల మరమ్మత్తు ప్రజా ప్రభుత్వం కృషి చేస్తుందని అన్నారు. వ్యవసాయ శాఖ, నీటీ పారుదల ప్రాజెక్టు సమన్వయంతో 3 బ్యారేజీలు నిరూపయోగంగా ఉండగా గత సంవత్సరం రికార్డు స్థాయిలో 2 కోట్ల 81 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం ఉత్పత్తి జరిగిందని అన్నారు. గోదావరి నది పై తెలంగాణ ప్రాంతానికి కేటాయించిన 968 టిఎంసీల నీరు పూర్తి స్థాయిలో వినియోగించుకునేలా ప్రాజెక్టుల నిర్మాణం చేస్తామని అన్నారు.గోదావరి నది పరివాహక ప్రాంతంలో మంథని రామగుండం, పెద్దపల్లి ఉన్నాయని, ఇక్కడ సాగు నీరు ఆందేలా చర్యలు తీసుకుంటామని అన్నారు. తుమ్మిడిహెట్టి దగ్గర బ్యారేజి నిర్మాణం పునః ప్రారంభం చేసి పూర్తి చేస్తామని అన్నారు. ఇచ్చంపల్లి వద్ద కూడా మరో ప్రాజెక్టు నిర్మిస్తామని అన్నారు. గత ప్రభుత్వం 10 వేల కోట్ల ఖర్చు పెట్టి రేషన్ ద్వారా 2.82 కోట్ల దోడ్డు బియ్యం సరఫరా చేసేదని, ఆ బియ్యం 80 శాతం అక్రమాలకు, రీసైక్లింగ్ కు ఉపయోగపడేదని అన్నారు. ప్రస్తుతం దేశంలో ఎక్కడా లేని విధంగా 3 కోట్ల 17 లక్షల మంది నిరుపేదలకు 13 వేల కోట్ల ఖర్చు చేసి నెలకు 6 కిలోల సన్న బియ్యం సరఫరా చేస్తున్నామని అన్నారు. ప్రస్తుతం అర్హులైన అందరికీ రేషన్ కార్డుల పంపిణీ చేస్తున్నామని అన్నారు. 8 లక్షల 60 వేల నూతన రేషన్ కార్డుల జారీ చేశామని , రామగుండం ప్రాంతంలో అదనంగా 6500 నూతన రేషన్ కార్డులు మంజూరు చేశామని అన్నారు.టెయిల్ ఎండ్ ప్రాంతాలకు సాగు నీరు స్థిరికరణ కోసం పత్తిపాక రిజర్వాయర్ ఎన్ని కోట్ల ఖర్చు చేసినా నిర్మిస్తామని, కోటిన్నర రూపాయల నిధులు మంజూరు చేసే సర్వే కు ఆదేశాలు జారీ చేశామని అన్నారు. పత్తిపాక రిజర్వాయర్ నిర్మాణం వల్ల 2 లక్షల 40 వేల ఎకరాల ఆయకట్టు స్థిరీకరణ,10 వేల ఎకరాల నూతన ఆయకట్టు సృష్టించేందుకు అవకాశం ఉంటుందని అన్నారు. ప్రస్తుతం రైతులు అధిక ఆదాయం సంపాదించాలనే లక్ష్యంతో ఆయిల్ పామ్ విస్తరణ ప్రభుత్వం ప్రోత్సహిస్తుందని అన్నారు. రైతు ఆదాయ వనరులు పెంచే కార్యక్రమాన్ని ముందుకు తీసుకుని రావాలని అన్నారు. రామగుండం ప్రాంతంలో ఎన్టిపిసి, సింగరేణి, ఆర్.ఎఫ్.సి.ఎల్ , కేశారాం సిమెంట్ వంటి పరిశ్రమలు ఉన్నాయని , ఇక్కడ ప్రైవేట్ పరిశ్రమల స్థాపన కోసం ప్రత్యేక పారిశ్రామిక వార్డు ఏర్పాటు చేస్తామని అన్నారు.ప్రస్తుతం స్థానికంగా అందుబాటులో ఉన్న సింగరేణి ప్రభుత్వ భూమి రెగ్యులరైజేషన్ చేసి ఇందిరమ్మ ఇండ్ల నిర్మిస్తామని అన్నారు. లారీ యాజమాన్యులకు ఉన్న సమస్యల పరిష్కారానికి రిపోర్ట్ అందించాలని మంత్రి కలెక్టరుకు సూచించారు. రామగుండం ప్రాంతంలో 800 మెగావాట్ల విద్యుత్ ప్లాంట్ నిర్మాణానికి కృషి చేస్తామని అన్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ గోదావరి జలాలు సముద్రంలో కలుస్తున్నాయని, ప్రతి నీటి చుక్కను ఉత్తర తెలంగాణ ప్రాంతాలు వాడుకునేలా ప్రణాళికలు చేయాలని అన్నారు. రామగుండం ఎత్తిపోతల పథకం ప్రారంభం సందర్భంగా రైతులకు శు భాకాంక్షలు తెలిపారు. రామగుండం ఎమ్మెల్యే కోరిక మేరకు స్థానిక బస్ స్టాండ్ అభివృద్ధికి చర్యలు తీసుకుంటామని అన్నారు.పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణా రావు మాట్లాడుతూ,లి గత ప్రభుత్వం 17ఎల్, 27 ఎల్ ఆయకట్టు రైతులకు సాగు నీరు అందించే ప్రాజెక్టు పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించిందని, ప్రజా ప్రభుత్వం అధికారంలోకి రాగానే యుద్ధ ప్రాతిపదికన పనులు పూర్తి చేశామని, ఈ ప్రాజెక్టు ద్వారా దాదాపు 20 వేల ఎకరాల ఆయకట్టు స్థిరీకరణ సాధ్యం అవుతుందని అన్నారు. రామగుండం ఎమ్మెల్యే మక్కన్ సింగ్ రాజ్ ఠాకూర్ మాట్లాడుతూ,లి ప్రజల చిరకాల వాంఛ రామగుండం ఎత్తిపోతల పథకం ప్రారంభం చాలా సంతోషంగా ఉందని అన్నారు. రామగుండం ప్రాంతంలో 800 మెగా వాట్ల విద్యుత్ ఉత్పత్తి ప్లాంట్ నిర్మించాలని కోరారు. స్థానికంగా ధాన్యం నిల్వ చేసేందుకు అదనపు గోడౌన్లు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రత్యేక పారిశ్రామిక వార్డు ఏర్పాటు చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎం.డి. సివిల్ సప్లై చౌహాన్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ నన్నయ్య గౌడ్, సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు , తదితరులు పాల్గొన్నారు.



**జూబ్లీహిల్స్ నివాసంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన ప్రముఖ సినీ నటుడు చిరంజీవి.**

### బనకచర్లపై ఎంతవరకైనా పోరాడతాం
### : మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

**ధర్మారం:** ఏపీ ప్రభుత్వం చేపడుతున్న బనకచర్ల ప్రాజెక్టును అడ్డుకునేందుకు ఎంతవరకైనా పోరాడతామని తెలంగాణ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు.రాష్ట్ర ప్రభుత్వ అభ్యంతరాల మేరకే బనకచర్ల అనుమతులను సీడబ్ల్యూసీ, గోదావరి నదీ యజమాన్య బోర్డు, పోలవరం ప్రాజెక్టు అథారిటీ తిరస్కరించాయన్నారు. రాష్ట్ర నీటిపారుదల శాఖ అభ్యంతరాలతో కేంద్రం పర్యావరణ అనుమతులు నిలిపివేసిం దన్నారు. పెద్దపల్లి జిల్లా ధర్మారంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, తుమ్మల నాగేశ్వరరావు, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌తో కలిసి రేషన్‌కార్డుల పంపిణీ కార్యక్రమంలో ఉత్తమ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఇటీవల దిల్లీలో జరిగిన రెండు రాష్ట్రాల ముఖ్యమంత్రుల సమావేశంలో బనకచర్లపై తమ వాదనలు గట్టిగా వినిపించామని మంత్రి చెప్పారు. ఈ ప్రాజెక్టు రాష్ట్ర విభజన చట్టం, 1980–గోదావరి నదీజలాల పంపిణీ ఒప్పందాలకు వ్యతిరేకంగా ఉందన్నారు.ఇవన్నీ తెలిసిన భారత రాష్ట్ర సమితి నేతలు బాధ్యతారహితంగా మాట్లాడుతున్నారని ఉత్తమ్ విమర్శిం చారు.రాష్ట్ర జనాభాలో 84 శాతం మందికి సన్నబియ్యం పంపిణీ చేస్తున్నామని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. గత ప్రభుత్వ హయాంలో 89 లక్షల రేషన్‌కార్డులు ఉండగా.. తమ ప్రభుత్వం వచ్చాక ఆ సంఖ్య 98.59లక్షలకు చేరిందని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం కొత్తగా 8.64లక్షల కొత్త కార్డులు జారీ చేసిందని తెలిపారు. గతంలో 2.81కోట్ల మందికి నాసిరకమైన దొడ్డు బియ్యం పంపిణీ చేశారని.. ఇప్పుడు 3.17కోట్ల మందికి నాణ్యమైన సన్న బియ్యం అందిస్తున్నామని మంత్రి వివరించారు.

## దైవదర్శనానికి వెళ్తూ
## మృత్యుఒడిలోకి..

**– యూపీ రోడ్డు ప్రమాదంలో 11 మంది మృతి**

**లక్నో(జనంసాక్షి):** ఉత్తరప్రదేశ్ లోని గోండాలో ఆదివారం ఘోర ప్రమాదం చోటు చేసుకొంది. పృథ్వీనాథ్ ఆలయానికి భక్తులను తీసుకెళ్తున్న బొలెరో వాహనం అదుపుతప్పి కాలువలో బోల్తాపడింది.ఈ ప్రమాదం పరాసరాయ్–ఆలవాల్ డియోర మార్గంలోని రేహారి గ్రామం సరయూ కాలువ వంతెన వద్ద చోటు చేసుకొంది. ఈ ఘటనలో 11 మంది ప్రాణాలు కోల్పోయారు. సరయూ నది నుంచి మృతదేహాలను వెలికి తీసినట్లు పోలీసులు వెల్లడించారు.ప్రమాదం జరిగిన సమయంలో వాహనంలో 15 మంది యాత్రికులు ఉన్నారు. నలుగురు వ్యక్తులను స్థానికులు కాపాడినట్లు పేర్కొన్నారు. వాహనంలోని వారంతా మోతీగంజ్ పోలీస్ స్టేషన్ పరిధిలోని సిహాగావ్ వాసులుగా అధికారులు గుర్తించారు. ప్రమాదంలో 11 మంది మృతిచెందిన విషయం తెలుసుకొని యూపీ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ సంతాపం వ్యక్తం చేశారు.

## తెల్లారిన బతుకులు

**గ్రానైట్ క్వారీలో బండరాళ్లు పడి**
**ఆరుగురి కార్మికులు మృతి**
**- బాపట్ల జిల్లాలో ఘోర ప్రమాదం..**

**బాపట్ల(జనంసాక్షి):** బాపట్ల జిల్లాలో ఆదివారం ఉదయం ఘోర ప్రమాదం జరిగింది. బల్లికురవ సమీపంలో సత్యక్రిష్ణ గ్రానైట్ క్వారీలో బండరాళ్లు పడి ఆరుగురు కార్మికులు మృతి చెందారు.బండరాళ్లు విరిగి పడటంతో ఆరుగురు కార్మికులు మృతి చెందారు. ఇప్పటి వరకు నాలుగు మృత దేహాలను వెలికి తీశారు. బండరాళ్ల కింద చిక్కుకున్న మరో ఇద్దరి మృత దేహాలను బయటకు తీసేందుకు సహాయకచర్యలు కొనసాగుతున్నాయి. ప్రమాదం జరిగిన సమయంలో క్వారీలో 16 మంది కార్మికులు పనిచేస్తున్నారు. తీవ్రంగా గాయపడిన మరో 10 మంది కార్మికులను మెరుగైన వైద్యం కోసం నరసరావుపేట ఆసుపత్రికి తరలించారు. వారిలో నలుగురి పరిస్థితి ఆందోళనకరంగా ఉందని వైద్యులు తెలిపారు. క్వారీ యాజమాన్యం భద్రతా చర్యలు చేపట్టలేదని అధికారులు ప్రాథమికంగా నిర్ధరించారు. ప్రమాద ఘటనపై బాపట్ల జిల్లా కలెక్టర్, ఎస్పీ స్థానిక అధికారులతో మాట్లాడి సహాయక చర్యలు వేగవంతం చేశారు. మృతులు ఒడిశా వాసులుగా ప్రాథమికంగా గుర్తించారు.క్వారీ ప్రమాదంపై ముఖ్యమంత్రి చంద్రబాబు స్పందించారు. ఘటనపై అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించారు. ప్రమాదానికి గల కారణాలపై విచారణ జరపాలని సూచించారు.



# రష్యాను వణికించిన మరో భూకంపం..

- **రిక్టర్‌స్కేల్‌పై తీవ్రత 7.0గా నమోదు**
- **బద్ధలైన అగ్నిపర్వతం**
- **సునామీ హెచ్చరికలు జారీ**

**మాస్కో(జనంసాక్షి):** రష్యాలో వరుస భూకంపాలు ప్రజలకు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. తాజాగా ఆదివారం కురిల్ దీవులలో మరోసారి భూమి కంపించింది. రిక్టర్ స్కేల్‌పై భూకంప తీవ్రత 7.0గా నమోదైనట్లు జపాన్ వాతావరణ శాఖ, యునైటెడ్ స్టేట్స్ జియోలాజికల్ వెల్లడించాయి.అలాగే, పలు ప్రాంతాల్లో సునామీ హెచ్చరికలు జారీ చేస్తూ రష్యా అత్యవసర సేవల మంత్రిత్వ శాఖ హెచ్చరించింది. ఇక, భూకంపానికి సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నాయి.వివరాల ప్రకారం.. రష్యాలోని కురిల్ దీవులలో ఆదివారం ఉదయం భూమి కంపించింది. భూకంపం ధాటికి పలు నగరాల్లోని భవనాలు ఊగిపోయాయని రష్యా మీడియా తెలిపింది. ప్రజలు భయభ్రాంతులకు గురై ఇళ్ల నుంచి పరుగులు తీసినట్లు పేర్కొంది. అయితే ఇప్పటి వరకు ప్రాణ, ఆస్తి నష్టానికి సంబంధించి ఎలాంటి సమాచారం తెలియలేదు. సునామీ హెచ్చరికలు జారీ చేయడంతో ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు.



మరోవైపు.. రష్యాలోని కమ్చట్కా ద్వీపకల్పంలోని క్రాషెన్నినికోవ్ అగ్నిపర్వతం శనివారం అర్ధరాత్రి బద్దలైనట్లు స్థానిక మీడియా వర్గాలు పేర్కొన్నాయి. ఇటీవల సంభవించిన భారీ భూకంపం వల్ల దాదాపు 600 ఏళ్ల తర్వాత మొదటిసారి ఈ అగ్నిపర్వతం బద్దలైనట్లు రష్యా అత్యవసర సేవల మంత్రిత్వ శాఖ తెలిపింది. దీంతో 6 వేల మీటర్ల ఎత్తుకు బూడిద ఎగసిపడినట్లు వెల్లడించింది. మరో ఘటనలో కమ్చట్కా ద్వీపకల్పంలోని అత్యంత చురుకైన అగ్నిపర్వతం క్ల్యూచెస్కీ బద్దలైంది.

**హెచ్చరికలు జారీ..**

ఇదిలా ఉండగా.. ఇటీవల రష్యా తీరంలో భారీ భూకంపం సంభవించిన విషయం తెలిసిందే. రిక్టర్ స్కేల్‌పై 8.8 తీవ్రతతో భూమి కంపించింది. ఈ భారీ భూ ప్రకంపనల ధాటికి రష్యా, జపాన్‌తో పాటు ఉత్తర పసిఫిక్‌లోని పలు తీర ప్రాంతాలను సునామీ తాకింది. పసిఫిక్ ప్రాంతంలో 2011 తర్వాత ఇదే అత్యంత భారీ భూకంపమని నిపుణులు పేర్కొన్నారు. దాని ప్రభావం తోనే తాజాగా భూకంపం వచ్చినట్లు అధికారులు పేర్కొన్నారు. మళ్లీ ప్రకంపనలు వచ్చే అవకాశం ఉన్నందున ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

**బద్దలైన అగ్నిపర్వతం..**

రష్యాలోని కమ్చట్కా ద్వీపకల్పంలోని క్రాషెన్నినికోవ్ అగ్నిపర్వతం శనివారం అర్ధరాత్రి బద్దలైనట్లు స్థానిక మీడియా వర్గాలు పేర్కొన్నాయి. ఇటీవల సంభవించిన భారీ భూకంపం వల్ల దాదాపు 600 ఏళ్ల తర్వాత మొదటిసారి ఈ అగ్నిపర్వతం బద్దలైనట్లు రష్యా అత్యవసర సేవల మంత్రిత్వ శాఖ తెలిపింది. దీంతో 6 వేల మీటర్ల ఎత్తుకు బూడిద ఎగసిపడినట్లు వెల్లడించింది. మరో ఘటనలో కమ్చట్కా ద్వీపకల్పంలోని అత్యంత చురుకైన అగ్నిపర్వతం క్ల్యూచెస్కీ బద్దలైంది.

## మళ్లీ బయటపడ్డ పాక్ బండారం

**– పీవోకేలో పహల్గాం ఉగ్రవాది అంత్యక్రియలు..!**

**శ్రీనగర్(జనంసాక్షి):** పహల్గాం ఉగ్రదాడిలో పాల్గొన్నది పాక్ ఉగ్రవాదులే అనడానికి మరో తిరుగులేని ఆధారం బయటపడింది. తాజాగా 'ఆపరేషన్ మహాదేవ్'లో హతమైన ముగ్గురు ఉగ్రవాదుల్లో ఒకడైన తాహిర్ హబీబ్‌కు పీవోకేలో జనాజా ఏ గైబ్ విధానంలో అంత్యక్రియలు నిర్వహించారు.చనిపోయిన వ్యక్తి మృతదేహం అందుబాటులో లేకపోతే ఈ విధానంలో అంతిమ సంస్కారాలు నిర్వహిస్తారు. రావల్‌కోట్ ఖైగలాలో పెద్దలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నట్లు ఉన్న వీడియోలు, చిత్రాలను ఓ టెలిగ్రామ్ ఛానెల్‌లో పోస్టు చేశారు. ఆ సమయంలో స్థానిక లష్కరే కమాండర్ రిజ్వాన్ హనీఫ్, ఇతర సభ్యులు కూడా దానిలో భాగం కావాలని ప్రయత్నించారు. కానీ, తాహిర్‌ను అతడి కుటుంబీకులు అంత్యక్రియలకు హాజరుకాకుండా అడ్డుకొన్నారు. కానీ, హనీఫ్ పట్టుబట్టడంతో.. ఘర్షణ చోటు చేసుకొంది. స్థానికులను ఉగ్రవాదులు తమ ఆయుధాలతో భయపెట్టారు. దీంతో వారు ఆందోళనకు దిగారు.తాహిర్ హబీబ్ తొలుత ఇస్లామిక్ జమాత్ తలాబా, స్టూడెంట్ లిబరేషన్ ఫ్రంట్‌లో పనిచేశాడు. అతడికి అఫ్గాని అనే నిక్‌నేమ్ ఉంది. ఇదే ఇంటెలిజెన్స్ రికార్డుల్లో కూడా నమోదైంది. పాక్ సైన్యంతో అతడికి సన్నిహిత సంబంధాలున్నాయి. అదే అతడిని ఉగ్రవాదిగా మార్చాయి. పహల్గాం ఉగ్రమూక శ్రీనగర్‌లోనే అత్యంత ఎత్తైన మహాదేవ్ పర్వత పరిసరాల్లో నక్కినట్లు సమాచారం అందింది. ఇది 13,000 అడుగుల ఎత్తుతో ఏడాది పొడవునా మంచుతో కప్పి ఉంటుంది. గత ఆదివారం అర్ధరాత్రి దాటాక చైనా తయారీ ఎన్‌క్రిప్టెడ్ కమ్యూనికేషన్ సెట్ 'టీ82' యాక్టివేట్ అయినట్లు భద్రతా దళాలు గుర్తించాయి. పహల్గాం ఉగ్రదాడిలో వీటిని వాడారు. దీంతో దళాలు అప్రమత్తమయ్యాయి. ఆ సెట్ లొకేషన్ డాచిగామ్ నేషనల్ పార్క్‌లో ఉన్నట్లు గుర్తించాయి. సైన్యం, సీఆర్పీఎఫ్, జమ్మూకశ్మీర్ పోలీస్ ఆపరేషన్‌కు సన్నాహాలు మొదలుపెట్టాయి. ఉదయం 11 గంటల సమయంలో ముగ్గురు ఉగ్రవాదులను గుర్తించి మట్టుబెట్టాయి.



## ప్రయాగ్‌రాజ్‌లో వరద బీభత్సం

లఖ్‌నవూ: భారీ వర్షాల నేపథ్యంలో ఉత్తరప్రదేశ్‌లోని పలు నగరాలను వరదలు ముంచెత్తుతున్నాయి. వారణాసి, ప్రయాగ్‌రాజ్‌లోని నివాస గృహాలను వరద నీరు చుట్టుముట్టింది. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రాజాపూర్, చోటా బఘాడా ప్రాంతాల్లో వరదలు బీభత్సం సృష్టించాయి.ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా ఉత్తరప్రదేశ్‌లోని అనేక నగరాలను వరదలు ముంచెత్తుతున్నాయి. వరద ప్రభావం వల్ల వారణాసి, ప్రయాగ్‌రాజ్‌లలోని ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రజల జీవన పరిస్థితులు దుర్భరంగా మారాయి. ఆ వీడియోలు సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నాయి. చోటా బఘాడా ప్రాంతానికి చెందిన దంపతులు అనారోగ్యంతో ఉన్న తమ నవజాత శిశువును ఆస్పత్రికి తరలించడానికి అవస్థలు పడుతున్న వీడియో వైరల్‌గా మారింది. పీకల్లోతు నిలిచి ఉన్న వరద నీటిలో దంపతులు తమ చిన్నారిని తీసుకువెళ్లారు. ఈ వీడియో వైరల్‌గా మారడంతో ప్రతిపక్షాలు యూపీ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేస్తున్నాయి. వరదల్లో చిక్కుకున్న ప్రజలను రక్షించడానికి యోగి ప్రభుత్వం ఎటువంటి చర్యలు తీసుకోవట్లేదని ఆప్ నేత సంజయ్ సింగ్ మండిపడ్డారు. ప్రభుత్వం సాయం చేయకపోవడంతో ఆ తల్లిదండ్రులు తమ చిన్నారిని కాపాడుకోవడానికి ఇక్కట్లు ఎదుర్కొన్నారని అన్నారు.

## మరో ముగ్గురు ఉగ్రవాదులు హతం

**కుల్గామ్(జనంసాక్షి):** ఆర్మీ, సీఆర్పీఎఫ్, జమ్మూ కశ్మరీ పోలీసులు సంయుక్తంగా చేపట్టిన ఆపరేషన్ అక్హాల్‌లో మరో ముగ్గురు ఉగ్రవాదులు హతమయ్యారు. జమ్మూ కశ్మీర్‌లోని కుల్గామ్ జిల్లాలోని ఫారెస్ట్ ఏరియా సమీపంలో ఆదివారం ఉదయం ముగ్గురు ఉగ్రవాదులు భద్రతా బలగాల చేతిలో హతమవ్వగా, ఒక సైనికుడు గాయపడ్డారు. నిన్న రాత్రి నుంచి భద్రతా బలగాలు, టెర్రరిస్టుల మధ్య కాల్పులు జరుగుతూనే ఉన్నాయి. ఈ క్రమంలోనే నేటి(ఆదివారం, ఆగస్టు 3) ఉదయం ముగ్గురు ఉగ్రవాదుల్ని మట్టుబెట్టినట్లు అధికారులు తెలిపారు. దాంతో శని, ఆదివారాల్లో హతమైన ఉగ్రవాదుల సంఖ్య ఆరుకు చేరినట్లుఉ పేర్కొన్నారు. శనివారం సైతం ముగ్గురు ఉగ్రవాదుల్ని హతమార్చారు. ఉగ్రవాదులు కుల్గామ్ పారెస్ట్ ఏరియాలో మకాం వేసినట్లు తమకు అందిన సమాచారం మేరకు ఆపరేషన్ అక్హాల్ చేపట్టామన్నారు. దీనిలో భాగంగా ఈ రెండు రోజుల్లో ఆరుగురు ఉగ్రవాదుల్ని హతమార్చినట్లుఉ పేర్కొన్నారు.

# బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల సాధనకు
# ఐక్యపోరాటాలకు సిద్ధం కావాలి

- రాష్ట్ర బిజెపి పార్లమెంటు సభ్యులు పార్లమెంటులో ఒత్తిడి చేయాలి
- 5న ఇందిరాపార్కు వద్ద ధర్నాను జయప్రదం చేయండి
- సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ

**హైదరాబాద్ (జనంసాక్షి) :** బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల సాధనకు ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ పిలుపునిచ్చారు.తెలంగాణ రాష్ట్రంలో కులగణన జరిపి దాని ఆధారంగా బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు జరపడానికి అసెంబ్లీలో బిల్లు ఆమోదించి కేంద్రానికి పంపిస్తే, కేంద్ర బీజేపీ ప్రభుత్వం బీసీల రిజర్వేషన్లలను అడ్డుకుంటున్నదని, ఆర్డినెన్స్ తీసుకొచ్చి గవర్నర్‌కు పంపిస్తే గవర్నర్ కూడా జాప్యం చేస్తున్నారని, దీనివల్ల స్థానిక సంస్థల ఎన్నికలు కాలయాపన జరుపుతూ, కేంద్రం నుండి గ్రామ పంచాయితీలకు రావాల్సిన నిధులు కూడా రాకుండా బీజేపీ ఆటంకం కలిగిస్తున్నదని, రాష్ట్ర అసెంబ్లీలో జరిగిన సమావేశంలో అన్ని పార్టీలు మద్ధతు ఇచ్చాయని, బీజేపీ మాత్రం బీసీల రిజర్వేషన్లలో ముస్లింలను తొలగించాలనే అక్రమ డిమాండ్‌ను తీసుకొస్తున్నదని, గుజరాత్, ఉత్తరప్రదేశ్, కర్నాటక, రాజస్థాన్ లాంటి బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ముస్లింలకు రిజర్వేషన్లు అమలు చేస్తూ, తెలంగాణ రాష్ట్రంలో మాత్రం అమలు చేయకూడదని చెప్పి అడ్డుపడుతున్నదని, ఈ అంశంపై సామాజిక న్యాయం కోరే శక్తులన్నీ దీన్ని ఆలోచించాలని విజ్ఞప్తి చేశారు. ముస్లింలలో దూదేకుల, అత్తర్‌సాహెబ్‌లు, రాళ్ళు కొట్టుకుని బతికేవాళ్ళు, పకీర్లు లాంటి చిన్నచిన్న వృత్తులవారు, కూలి చేసుకుంటున్న వారికి బీసీ రిజర్వేషన్లు అమలు జరుగుతున్నాయని, డబ్బున్న ధనిక వర్గాలకు కాదు. హిందూ, బీసీలకు రిజర్వేషన్లు అమలు చేసి, ఇస్లాం స్వీకరించిన బీసీలకు రిజర్వేషన్లు ఉండకూడదన్నది ఎట్లాంటి న్యాయం? ఇదెట్లా సామాజిక న్యాయం అవుతుంది? రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమైనదని, ప్రభుత్వరంగాన్ని ప్రయివేటుపరం చేస్తూ, మొత్తం రిజర్వేషన్లను నిర్లక్ష్యంచేస్తూ, రాజ్యాంగాన్ని నిరుపయోగంగా చేస్తున్నది. అందులో భాగంగానే బీసీల రిజర్వేషన్లకు బీజేపీ వ్యతిరేకంగా వ్యవహరిస్తున్నది. బీసీలకు అనుకూలంగా ఉంటామని, రిజర్వేషన్లను బీజేపీ నాయకులైన బండి సంజయ్, కిషన్‌రెడ్డి, రాష్ట్ర అధ్యక్షులు రాంచందర్‌రావు వ్యతిరేకిస్తున్నారని తెలిపారు. రాష్ట్రంలో ఎనిమిది 8 మంది పార్లమెంట్ సభ్యులు ఉన్నారని, 42 శాతం బీసీలకు రిజర్వేషన్లు అమలు జరపడానికి కేంద్రం మీద ఒత్తిడి తీసుకువచ్చేందుకు చర్యలు తీసుకోవాలి కదా? అలా కాకుండా ఈ రిజర్వేషన్లకు అడ్డుపడే చర్యలకు బీజేపీ పాల్పడుతున్నదని, రాష్ట్రంలో వున్న బిజెపి ఎంపిలు పార్లమెంటులో రిజర్వేషన్లకు అనుకూలంగా వ్యవహరించకపోతే వారి రాజీనామాకు ఒత్తిడి చేస్తూ ఆందోళనా కార్యక్రమాలకు పూనుకోవాల్సి వస్తోందని తెలిపారు. సిపిఎం ఆధ్వర్యంలో 42 శాతం రిజర్వేషన్లను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఆందోళనా కార్యక్రమాలను నిర్వహిస్తున్నదని, పార్లమెంటులో బిల్లును ఆమోదించాలని, చట్టం చేయాలని ఆగస్టు 5వ తేదీన ఇందిరాపార్కు దగ్గర మహాధర్నాను నిర్వహిస్తున్నామని, సామాజికన్యాయం కోరే శక్తులు, ప్రజానీకం అట్లాగే బిజెపి, బిసి రిజర్వేషన్ల వ్యతిరేక విషయాలన్నింటినీ కూడా ప్రచారం చేయడానికి, ప్రభుత్వం మీద ఒత్తిడి తేవడానికి ఈ ధర్నాకు అత్యధిక సంఖ్యలోపాల్గొని జయప్రదం చేయాలని ప్రజానీకాన్ని విజ్ఞప్తి చేశారు. అట్లాగే రాష్ట్ర ముఖ్యమంత్రి కూడా ఏకపక్షంగా వ్యవహరించకుండా అందరినీ కలుపుకొని బిజెపి మీద ఒత్తిడి తీసుకొచ్చి అమలు చేయడానికి ఐక్య పోరాటాన్ని కొనసాగించాలని కోరారు.

# జనహిత పాదయాత్రకు జన నీరాజనం

- ఖానాపూర్ నియోజకవర్గంలో కదంతొక్కిన పార్టీ శ్రేణులు
- అందరినీ ఆప్యాయంగా పలకరించిన మీనాక్షి నటరాజన్



**ఖానాపూర్ (జనంసాక్షి) :** ఏఐసీసీ తెలంగాణ వ్యవహారాల ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్ ఆదివారం నిర్మల్ జిల్లాలో చేపట్టిన జనహిత పాదయాత్రకు అడుగడుగునా నీరాజనం పలికారు. ఖానాపూర్ నియోజకవర్గం సూర్జాపూర్ గ్రామం వద్ద గజమాలతో ఘనస్వాగతం పలికారు. పాదయాత్రలో భాగంగా మీనాక్షి నటరాజన్ వెంట టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇంచార్జ్ మంత్రి జూపల్లి కృష్ణారావు, ఉమ్మడి నిజామాబాద్ జిల్లా ఇంచార్జ్ మంత్రి అనసూయ సీతక్క, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు, పార్టీ శ్రేణులు, ప్రజలు నడిచారు. సూర్జాపూర్ గ్రామ శివారు నుంచి కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, అభిమానులు, స్థానికులు జనహిత పాదయాత్రకు తరలిరావడంతో రహదారులు కిటకిటలాడాయి. మహిళలు, యువకులు, ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి, వేణుగోపాల చారి, శ్రీహరి రావు, విఠల్ రెడ్డి, ఆత్రం సక్కు, సోయం బాపురావు, రేఖశ్యామ్ నాయక్ , నారాయణరావు పటేల్, ఆత్రం సుగుణ, ఆడే గజేందర్, కంది శ్రీనివాస్ రెడ్డి, ఎంబడి రాజేశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ హిస్టరీకల్ 10కె రన్‌లో పాల్గొన్న ఉప్పల





**హైదరాబాద్ (జనంసాక్షి) :** నాగోల్ బండ్లగూడ డీఆర్‌ఎఫ్ ట్రైనింగ్ సెంటర్‌లో కేఎన్ఆర్ సైక్లింగ్ నాగరాజు ఆధ్వర్యంలో ఇందు ఇంటర్నేషనల్ స్కూల్ సంయుక్తంగా తెలంగాణ హిస్టారికల్స్ 10 కె రన్, రైడ్ 3వ ఎడిషన్‌లోటీపీసీసీ ప్రధాన కార్యదర్శి అంతర్జాతీయ ఆర్యవైశ్య ఫెడరేషన్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్, రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్ గుప్తముఖ్య అతిథిగా హాజరై జెండా ఊపి ప్రారంభించారు. ఈ రన్‌లో అన్ని విభాగాల నుండి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉప్పల శ్రీనివాస్ గుప్త మాట్లాడుతూ మన భాష మన హక్కు, మన వనరుల సంపద మన ముందుబాట అనిమన కవులు మన చరిత్ర మన చారిత్రాత్మక కళా ఖండాలు, కట్టడాలు మనవి. మన తెలంగాణ వి అని ఆయన అన్నారు.మన పాలన మన సంస్కృతి మన ఆత్మ గౌరవం మన తెలంగాణ అనిఎందరో మహానుభావుల త్యాగనిరతికి స్ఫూర్తి అని ఆయన అన్నారు. ఈ 10కె రన్ 200 మంది పాల్గొన్నారు. విజేతలకు ఉప్పల శ్రీనివాస్ గుప్త సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో హిందు ఇంటర్నేషనల్ స్కూల్ యాజమాన్యం క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

# అంబులెన్స్ వెళ్లలేని దారిలో కాలినడకన 108 సిబ్బంది

**అంబులెన్స్‌లో సుఖ ప్రసవం**

**తల్లీబిడ్డలు క్షేమం**

**108 సిబ్బందికి పలువురి ప్రశంసలు**



**ఏటూరునాగారం, ఆగస్టు 03(జనంసాక్షి) :** అంబులెన్స్ వెళ్లలేని దారిలో బురదమయంగా ఉన్నటువంటి కిలోమీటర్ దారిలో కాలినడకన నడిచి వెళ్లి గర్భిణీ స్త్రీకి వైద్య సేవలు అందించి అంబులెన్స్ లో సుఖ ప్రసవం చేసి, 108 సిబ్బంది ఆపద్బాంధవులయ్యారు. వివరాల్లోకి వెళ్తే ఏటూరునాగారం మండలం గుండెంగవాయి గ్రామానికి చెందిన అవులం సునీత 30 సంవత్సరాలు పురిటి నొప్పులతో బాధ పడుతూ స్థానికుల సహాయం తో 108 కి సమాచారం అందించారు. విషయం తెలుసుకున్న అంబులెన్స్ సిబ్బంది పైలట్ కోటి, ఈఎంటి శివలింగంప్రసాద్ హుటాహుటిన ఘటన స్థలానికి వెళ్తున్న క్రమంలో బురద మయంగా ఉన్న రోడ్డు అంబులెన్స్ వెళ్ళని పరిస్థితి, ఎలాగైనా వైద్య సేవలు అందించాలనే సాహసంతో, కాలి నడక మార్గాన మైలు దూరం నడిచి గర్భిణీ స్త్రీనీ అంబులెన్స్ వద్దకు తీసుకొచ్చి పరీక్షించి, ఏటూరునాగారం ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తున్న క్రమంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్దకు రాగానే పురిటి నొప్పులు అధికం అవడంతో తక్షణమే స్పదించిన ఈఎంటి శివలింగంప్రసాద్ ఈఆర్సిపి డాక్టర్ మౌనిక సూచనలతో సుఖ ప్రసవం చెయ్యగా పండంటి ఆడ బిడ్డకు జన్మనిచ్చింది. ప్రసవం తర్వాత తల్లి బిడ్డలకు కావాల్సిన చికిత్స అందించి తల్లి, బిడ్డలు క్షేమంగా ఉండగా మెరుగైన వైద్య చికిత్స కోసం ఏటూరునాగారం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ సందర్భంగా అంబులెన్స్ సిబ్బంది ఈఎంటి శివలింగంప్రసాద్, పైలట్ కోటి, 108 సిబ్బందిని పలువురు ప్రశంసించారు.

# కలం స్నేహితుల హృదయ సమ్మేళనం



**హైదరాబాద్ (జనంసాక్షి) :** ఇంటర్నెట్ లేని కాలంలో ఎక్కడెక్కడో ఉండి అప్పుడెప్పుడో 1990 కాలం నుండి ఉత్తరాల ద్వారా పరిచయం అయిన 20 మంది స్నేహితులు స్నేహితుల దినోత్సవం సందర్భంగా ఆదివారం హైదరాబాద్ ఉప్పల్ శిల్పారామం లో కలుసుకున్నారు. స్నేహితులందరూ... తమ తమ భావాలు పంచుకున్నారు. ఫ్రెండ్షిప్ బ్యాండ్స్ కట్టుకున్నారు. గిఫ్టులు ఇచ్చుకున్నారు. కరోనా సమయంలో దూరమైన మిత్రుడు బాబు సార్‌ను స్మరించుకున్నారు. వందర్ వరల్డ్, ఆంధ్రభూమి కలం స్నేహం శీర్షిక ద్వారా వివిధ రాష్ట్రాల నుండి పరిచయం అయిన వీరంతా ఇప్పటి వరకు స్నేహితులుగా కలిసి ఉన్నారు. అందరూ కలసి పెన్‌ఫోన్ ఫ్రెండ్స్ అసోసియేషన్‌ను ఏర్పాటు చేసుకున్నారు. ఈ సంస్థ ద్వారా ప్రతి సంవత్సరం ఫ్రెండ్షిప్ డే రోజున తప్పని సరిగా కలుసుకుంటారు.. ఈ కార్యక్రమం లో శరత్, షేక్ అస్లాం షరీఫ్, పుల్లా రెడ్డి, నాగరాజు, మల్లి, రాజు, నాగరాజు, స్వామి, జిలాని, రవి పాల్ రెడ్డి, రాజయ్య గౌడ్, వెంకటేశం, సత్య, మురళీ క్రిష్ణ, మహేష్,వీరేందర్, సతీష్,రాజేష్ పాల్గొన్నారు.

# చందా పేరుతో బలవంతపు వసూళ్లకు పాల్పడితే చర్యలు

**ఆదిలాబాద్ డిఎస్పీ ఎల్ జీవన్ రెడ్డి**

**ఆదిలాబాద్ ప్రతినిధి (జనంసాక్షి) :** చందా పేరుతో బలవంతపు వసూళ్లకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఆదిలాబాద్ డీఎస్పీ జీవన్ రెడ్డి అన్నారు. ఈ సంధర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న గణపతి నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ఆదిలాబాద్ సబ్ డివిజనల్ వ్యాప్తంగా యువత మరియు గణపతి కమిటీ సభ్యులు ప్రజల ఇష్టానికి వ్యతిరేకంగా బలవంతంగా చందారూపైన వసూళ్లకు పాల్పడితే బాధితుల ఫిర్యాదుల మేరకు వారిపై చట్టపకారం చర్యలు తీసుకోబడతాయని ఆదిలాబాద్ డిఎస్పి ఎల్ జీవన్ రెడ్డి తెలియజేశారు. గణపతి నవరాత్రి ఉత్సవాలను ప్రజలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని ప్రజలు ఇష్టప్రకారం ఇచ్చిన వాటిని మాత్రమే స్వీకరించాలని, బలవంతంగా డబ్బులను వస్తువులను వసూలు చేసిన ఎడల చర్యలు తప్పవని తెలిపారు. ఈనెల చివరి వారంలో రానున్న వినాయక చవితి సందర్భంగా ప్రజలు ప్రశాంత వాతావరణంలో ఉత్సవాల నిర్వహించుకోవడానికి పటిష్ట ఏర్పాటు చేయడం జరిగిందని. ప్రజల ఇష్టానికి వ్యతిరేకంగా ఎలాంటి సంఘాలు కమిటీ సభ్యులు బలవంతంగా వసూళ్లకు పాల్పడిన యెడల డయల్ 100 కు తెలియజేయాలని సూచించారు. వినాయక విగ్రహాల తయారీ దారులు విగ్రహాల రక్షణ కై 24 గంటల కాపలా ను నియమించుకోవాలి. విగ్రహాల రక్షణ చర్యలు తీసుకోవాలని అందరికీ నోటీసులిచ్చారు.

## సరస్వతి కాలువ ద్వారా దిగువకు
# నీటి విడుదలకు ఎమ్మెల్యే కృషి



**నిర్మల్ రూరల్, ఆగస్టు3 (జనం సాక్షి) :** శ్రీరామ్ సాగర్ జలాశయ సరస్వతి కెనాల్ పరివాహక ప్రాంత రైతుల విజ్ఞప్తి మేరకు రైతుల పంటలు మొక్కజొన్న,వరి పంటలకు నీరు లేక చాలా వరకు ఎండిపోతున్నాయని రైతులు వారి సమస్యను ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే స్పందించిన ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డి హైదరాబాదులోని ఇరిగేషన్ ఈఎన్ సి తో మాట్లాడి రైతుల సమస్యను తెలిపి నీటి విడుదల చేసి రైతులను ఆదుకోవాలని సూచించడంతో,నీటి విడుదలకు సంబంధించి సోమవారం లోగా నిర్ణయం తీసుకుంటామని అధికారులు హామీ ఇచ్చినట్లు ఎమ్మెల్యే తెలిపారు.నీటి విడుదల అనంతరం రైతులు సకాలంలో నీటిని సద్వినియోగం చేసుకొని లబ్ధి పొందాలని ఎమ్మెల్యే రైతులకు సూచించారు.

# రైతుల బాధలు అర్థం చేసుకున్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి

**చిల్పూర్ దేవస్థాన చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్ రావు**

**ఎమ్మెల్యే చిత్రపటానికి పాలాభిషేకం చేసిన రైతులు**



**స్టేషన్ ఘన్పూర్, ఆగస్టు 03 (జనం సాక్షి) :** వర్షాకాలం లో వర్షాలు సరిగాలేక పంటలు ఎండిపోతు న్నాయని మాజీ ఉప ముఖ్యమంత్రి, స్థానిక ఎమ్మెల్యే కడియం శ్రీహరి రైతుల బాధలు అర్థం చేసుకొని సాగు నీరు అందించడం ఎంతో సంతోషకరమని చిల్పూర్ దేవస్థాన చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్ రావు అన్నారు. శ్రీ బుగులు వెంకటేశ్వరస్వామి దేవస్థాన చైర్మన్ పోట్లపల్లి శ్రీధర్ రావు ఆధ్వర్యంలో పల్లగుట్టలో చింతలచెరువు నిండి పొంగి పొర్లిన సంతోషంలో ఎమ్మెల్యే కడియం శ్రీహరి చిత్రపటానికి పాలభిషేకం చేస్తూ ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా శ్రీధర్ రావు మాట్లాడు తూ గత కొన్ని రోజులగా వర్షాలు సరిగ్గా పడకపోవడం తో చెరువుల ఎండిపోయి రైతులు ఇబ్బందులు పడు తున్న నేపథ్యంలో ఎమ్మెల్యే కడియం శ్రీహరి దృష్టికి తీసుకెళ్లడం జరిగిందని అన్నారు.వారు వెంటనే స్థానిక అధికారులతో మాట్లాడి పైప్ లైన్, కాలువల ద్వారా ఫతేపూర్, కృష్ణాజి గూడెం, పల్లగుట్ట,చిల్పూర్ చెరువు లు,సోట కుంట, ఇప్పలకుంట పాత చెరువు, కొత్త చెరు వు, రాముల కుంట, పుట్టలకుంట, నాగుల కుంట, బర్రెం కుల,ఊర కుంట, బామన్ల కుంట,చింతల చెరువు లను నింపుకున్నారు. రైతుల బాధలను అర్థం చేసు కొని చెరువులు నింపడానికి తన వంతు కృషిచేసి రైతుల కన్నీరు తుడిచిన జననేత కడియం శ్రీహరికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్య క్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గడ్డమీది సురేష్, నాయకులు బొమ్మిశెట్టి బాలరాజు, మామిడా ల లింగారెడ్డి, రంజిత్ రెడ్డి, సమ్మయ్య, ఉమ్లా నాయక్, రూప్లా నాయక్, దేవస్థానం డైరెక్టర్లు, మండల నాయకులు, గ్రామ నాయ కులు, కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.

# అవయవదానంలో ఆల్‌ఇండియా టాపర్‌గా తెలంగాణ

**గతేడాది 188 మంది దోనర్ల నుంచి అవయవాల సేకరణ**

**725 మందికి అవయవ మార్పిడి**

**జీవన్‌దాన్‌కు అవార్డు అందజేసిన ఆరోగ్యశాఖ మంత్రి జేపీ నడ్డా**

**హర్షం వ్యక్తం చేసిన మంత్రి దామోదర్ రాజనర్సింహ**




**హైదరాబాద్ (జనంసాక్షి) :** అవయవదానంలో దేశంలోనే తెలంగాణ మొదటి స్థానంలో నిలిచింది. 2024లో ప్రతి పది లక్షల జనాభాకు దేశంలో సగటున 0.8 ఆర్గాన్ డొనేషన్స్ జరిగితే, తెలంగాణలో ప్రతి పది లక్షల జనాభాకు 4.88 డొనేషన్స్ జరిగాయని కేంద్ర ఆరోగ్యశాఖ వెల్లడించింది. అవయవదానంలో ప్రథమ స్థానంలో నిలిచినందుకుగానూ రాష్ట్రానికి నేషనల్ ఆర్గాన్ అండ్ టిష్యు ట్రాన్స్‌ప్లాంటేషన్ ఆర్గనైజేషన్ అవార్డు ప్రకటించింది. శనివారం, ఢిల్లీలో జరిగిన జాతీయ అవయవదాన దినోత్సవ వేడుకల కార్యక్రమంలో కేంద్ర ఆరోగ్యశాఖ మంత్రి జేపీ నడ్డా జీవన్‌దాన్ ప్రతినిధులకు ఈ అవార్డును అందజేశారు. అవయవదానంలో తెలంగాణ టాపర్‌గా నిలవడం పట్ల రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ హర్షం వ్యక్తం చేశారు. అవయవాలు పాడైపోయిన వ్యక్తుల ప్రాణాలు కాపాడే లక్ష్యంతో ఉమ్మడి రాష్ట్రంలో 2012లో జీవన్‌దాన్ ప్రారంభించామని ఈ సందర్భంగా మంత్రి గుర్తు చేశారు. పేద, ధనిక బేధం లేకుండా అవసరమైన వారందరికీ అవయవాలు అందేలా ఇటీవలే తోట యాక్ట్‌ను అడాప్ట్ చేసుకున్నామని మంత్రి తెలిపారు. బ్రెయిన్ డెత్ కేసులలో అవయవాలు వృథా పోకుండా, దానం చేయాలని ఈ సందర్భంగా ప్రజలకు మంత్రి విజ్ఞప్తి చేశారు. ఆరోగ్యశ్రీ కింద ఉచితంగా అవయవమార్పిడి చికిత్సను అందిస్తున్నామన్నారు. 2024లో 188 మంది బ్రెయిన్ డెత్ దోనర్ల నుంచి, 725 అవయవాలను ఇతరులకు అమర్చి, వారి ప్రాణాలు కాపాడగలిగామని మంత్రి వెల్లడించారు.


# ఇంటి తాళాలు పగులగొట్టి 16 తులాల బంగారం చోరీ

**హైదరాబాద్ (జనంసాక్షి) :** పెళ్లికి వెళ్లి తిరిగి వచ్చే లోపు దొంగలు తాళం పగులగొట్టి ఇంట్లోని బంంగారు అభరణాలను అపహరించుకుపోయారు. ఈ సంఘటన మొయినాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మొయినాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని పెద్దమంగళారం గ్రామానికి చెందిన సీహెచ్ అనిత కుటుంబ సభ్యులతో పాటు హైదరాబాద్‌లోని వనస్థలిపురంలోని తన బంధువుల ఇంట్లో పెళ్లికని ఈ నెల 2వ తేదీన మధ్యాహ్నం 12 గంటలకు ఇంటికి తాళం వేసి వెళ్లారు. తిరిగి వాళ్లు ఇంటికి ఆదివారం ఉదయం 11:30 గంటలకు ఇంటికి వచ్చే సరికి ఇంటి తాళం పగులగొట్టి కనిపించింది. ఇంట్లోకి వెళ్లి చూసే సరికి ఇంట్లో వస్తువులు చిందరవందరగా పడి ఉన్నాయి. బీరువా కూడ తెరిచి ఉంది. అందులో నుంచి 2 బంగారు నెక్లెస్‌లు, 2 జతల చెవి కమ్మలు, రెండు బ్రాస్‌లెట్‌లు, 4 బంగారు గాజులు మొత్తం 16 తులాల బంగారం అభరణాలను దొంగిలించారు. దొంగతనం జరగడంతో బాధితులు ఫిర్యాదు చేశారు. సంఘటన స్థలానికి చేరుకుని క్లూస్ టీంను రంగంలోనికి దింపి దొంగల వేలిముద్రలను సేకరించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

# అశోక్‌నగర్ ప్రాంతాల్లో పోలీసులు నిర్బంధం..

**హైదరాబాద్ (జనంసాక్షి) :**నిరుద్యోగులు ఎలాంటి ధర్నాలు, నిరసనలకు పిలుపునివ్వకపోయినా ఆదివారం చిక్కడపల్లి నగర కేంద్ర గ్రంథాలయం, అశోక్‌నగర్ తదితర ప్రాంతాల్లో పోలీసులు నిర్భంధించారు. పలువురు నిరుద్యోగులను అరెస్టు చేసి చిక్కడపల్లి పోలీస్ స్టేషేన్‌కు తరలించారు. నిరుద్యోగులు రవి రాథోడ్, విశాల్, నితీష్, నవీన్, అమర్‌ను అక్రమంగా అరెస్టు చేశారు. ఈ సందర్భంగా నిరుద్యోగ జేపీసీ నాయకుడు రవి రాథోడ్ మాట్లాడుతూ.. ఎలాంటి ధర్నాలకు, నిరసనలకు పిలుపునివ్వకపోయినా.. చిక్కడపల్లి ,అశోక్ నగర్ ప్రాంతాల్లో మమ్మల్ని అక్రమంగా అరెస్టు చేశారని తెలిపారు. జాబ్ క్యాలెండర్ విడుదల చేసి ఒక ససంవత్సరం కావడంతో శనివారం గాంధీగనర్‌లో పిండ ప్రదానం కార్యక్రమాన్ని చేశారు. దీంతో ప్రభుత్వం అక్కసుతో పోలీసుచేత నిరుద్యోలను అక్రమంగా అరెస్టు చేయించిందని మండిపడ్డారు. 2024 ఆగస్టు 2న అసెంబ్లీలో జాబ్ క్యాలెండర్ విడుదల చేశారని అదే రోజు అసెంబ్లీలో కనుమరుగైందని విమర్శించారు.

# మహిళకేది రక్షణ!




*రోజురోజుకు మహిళలపై అఘాయిత్యాలు పెరుగుతున్నాయి. మైనర్లను ప్రేమ, పెళ్లి ముసుగులో మోసం చేసే ఘటనలు అధికమయ్యాయి. గత రెండేళ్లతో పోలిస్తే అత్యాచారాలు 22%, దాడులు 15%, ఆత్మగౌరవ భంగం కేసులు 31% పెరిగాయి. 2025లో ఇవి మరింత పెరిగాయి. బిజెపి పాలిత రాష్ట్రాల్లో ఈ కేసులు అధికం, యూపీ 218 కేసులతో మొదటి స్థానంలో ఉంది. రోజూ 88 లైంగిక దాడులు నమోదవుతున్నాయి. స్నేహం, ఆన్‌లైన్ సంబంధాల పేరుతో మహిళలను మభ్యపెట్టి అత్యాచారాలకు పాల్పడుతున్నారు.*

రోజురోజుకు మహిళలపై అఘాయిత్యాలు పెరుగుతున్నాయి. మైనర్లను ప్రేమ పేరుతో ట్రాప్ చేసి మోసం చేస్తున్న ఘటనలు అధికమయ్యాయి. మహిళలపై గత రెండేళ్లతో పోలిస్తే ఈసారి మరికొంత పెరిగాయి. వరకట్నం కేసులతో పాటు వేధింపుల కేసులు రెట్టింపు అయ్యాయి. మహిళా పోలీస్ స్టేషన్లలో గత ఏడాది కంటే ఈసారి అధిక మొత్తంలో ఫిర్యాదులు పెరిగాయి. మహిళలపై అత్యాచారాలు, దాడులు ప్రతి సంవత్సరం పెరుగుతూనే ఉన్నాయి.2018 తో పోలిస్తే 2021 నాటికి అత్యాచారాలు 22%,దాడులు 15%,ఆత్మ గౌరవానికి భంగం కలిగించిన కేసులు 31% మేరా పెరిగాయి. 2025 లో ఇవి మరింతగా పెరిగాయి. ప్రతి రోజు ఎక్కడో ఒక దగ్గర అనేక సంఘటనలు మనకు కనిపిస్తున్నాయి.మరో ఒకపక్క దేశంలో రోజురోజుకు మహిళలపై అఘాయిత్యాలు పెరిగిపోతుంటే బిజెపి పాలిత రాష్ట్రాలు ఈ విషయంలో టాప్ లో ఉన్నాయి. అయితే వాస్తవాలను మరుగున పెట్టేందుకు కేంద్రంలో అధికారంలో ఉన్నటువంటి బిజెపి మాత్రం వాటిని అదుపు చేయలేక పోయింది. మహిళలపై జరిగిన లైంగిక దాడి హత్య నేరాలలో 2017 నుంచి 2021 మధ్య 218 కేసులతో యూపీ మొదటి స్థానాన్ని ఆక్రమించింది.దీని తర్వాత స్థానాల్లో అస్సాం 191,మధ్యప్రదేశ్ 166, మహారాష్ట్ర 133 ఉన్నాయి.ఈ నాలుగు రాష్ట్రాలు కూడా అప్పుడు ఇప్పుడు కూడా బిజెపి పాలనలో ఉన్నాయి. దేశంలో రోజూ 88 లైంగిక దాడులు జరుగుతున్నాయి.స్నేహం ముసుగులో,ఆన్లైన్ ఫ్రెండ్షిప్ పేరుతో, పెళ్లాడుతామని మరికొందరు ఇలా చాలా రకాలుగా మహిళలను మభ్యపెట్టి వారిపై అఘాయిత్యాలకు పాల్పడుతున్నారు. దేశంలో ప్రతిరోజు దాదాపు 88 మంది మహిళలు అత్యాచారానికి గురవడం ఆందోళన కలిగించే విషయం. అత్యధిక మంది మహిళలు తెలిసినవారు, అయినవారి చేతుల్లోనే లైంగిక దాడికి గురవుతున్నారు. కంటికి రెప్పలా కాపాల్సినటు వంటి వారే కాటేస్తుంటే బయటకు చెప్పుకుంటే పరువు పోతుందని నోళ్లు నొక్కేస్తున్నారు.ఇల్లు మొదలుకొని ఆఫీస్ వరకు మహిళలకు ఎక్కడ కూడా రక్షణ లేక పోతున్నది అనేది నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో నివేదిక వెల్లడించింది. దేశవ్యాప్తంగా 2022లో అత్యాచార కేసులు 96.6% నమోదయ్యాయి.18 నుంచి 30 సంవత్సరాల వారి పైన అత్యధికంగా 21,063 కేసులు నమోదు కావడం ఆందోళన కలిగిస్తున్న విషయం. 30 నుంచి 45 ఏండ్ల వయస్సు గల వారి పైన 8,644 లైంగిక దాడుల కేసులు నమోదయ్యాయి. మొత్తం 31,516 కేసుల్లో 31,982 మంది బాధితులు ఉన్నట్టు నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో తెలిపింది.ఎక్కువగా మహిళలపై జరుగుతున్నటువంటి దాడులలో సహోద్యోగులు,యజమానులు, తెలిసినవారు,కుటుంబ సభ్యులు, బంధువులే వారిని నమ్మించి వంచించినట్టు తెలుస్తుంది. 2,324 మంది కుటుంబ సభ్యుల చేతుల్లో లైంగిక దాడికి గురయ్యారు అంటే ఆవేదన కలగక మానదు. వారందరూ కూడా బయటికి వచ్చి ఫిర్యాదు చేసిన వారు. ఇంకా ఫిర్యాదు చేయని వారు కోకొల్లలుగా ఉన్నారు. దేశవ్యాప్తంగా గుర్తు తెలియని వ్యక్తుల చేతుల్లో ఒక వెయ్యి అరవై రెండు మంది లైంగిక దాడికి గురయ్యారు. 2022లో నమోదైనటువంటి అత్యాచారాల కేసుల్లో 14,582 కేసులు స్నేహం, ప్రేమ,పెళ్లి పేరిట ఉన్నవే. తెలంగాణ రాష్ట్రంలో 814 లైంగిక దాడి కేసులు నమోదు కాగా 523 మందిని అరెస్టు చేశారు. రాష్ట్రంలో నమోదైన మొత్తం కేసుల్లో 812 మంది తెలిసిన వారి చేతుల్లో అఘాయిత్యానికి గురయ్యారు. మిగతా రెండు కేసుల్లో నిందితులు గుర్తు తెలియని వారే.2022లో రాష్ట్రాలవారీగా నమోదైన లైంగిక దాడి కేసులను చూసినట్లయితే రాజస్థాన్ లో 5,399,ఉత్తరప్రదేశ్ లో 3,690, మధ్యప్రదేశ్ లో 3,029, మహారాష్ట్రలో 2,904, హర్యానాలో 1,787,ఒడిస్సాలో 1,464, జార[illegible]ండ్ లో 1,298,చత్తీస్గడ్ లో 1,246 లైంగిక దాడి కేసులు నమోదయ్యాయి.అత్యాచార బాధితులను గుర్తించేందుకుగాను వారిలో చైతన్యం కల్పించేందుకు తెలంగాణ పోలీసు ఉమెన్ సేఫ్టీ వింగ్ ను ఏర్పాటు చేసారు.మహిళల కోసమే షీ టీమ్స్, భరోసా సెంటర్లు,హ్యూమన్ ట్రాఫికింగ్,పని ప్రదేశాల్లో వేధింపులు అరికట్టేందుకు సాహస్ వంటి వ్యవస్థను విజయవంతంగా అమలు చేస్తా ఉన్నది. ఏది ఏమైనా మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలపై అందరూ చింతించాల్సిన అవసరం ఉంది. అలా అయిన వాళ్లే రాబందుల్లా పిక్క తింటున్నారు. దాన్ని అరికట్టేందుకు అందరూ కలిసి ముందుకు సాగాలి. సమాజంలో చైతన్యం రావాలి. తప్పు చేయాలంటే తప్పు చేసిన వ్యక్తికి కఠినంగా శిక్షించాలి. అప్పుడే ఇంకొక వ్యక్తి తప్పు చేయకుండా ఉంటారు. ఈ విధంగా మహిళలపై దాడులను అరికట్టవచ్చు.



డాక్టర్ మోటె చిరంజీవి
సామాజికవేత్త, విశ్లేషకులు
సెల్ : 9949194327


# బీసీ ఉద్యమాల నైతికతకు దక్కిన గౌరవం



బీసీ ఉద్యమాలకు సోషల్ యాక్సెప్టెన్సీ వచ్చింది. మార్క్సిస్టు కమ్యూనిస్టులు తప్పా అందరి నుండీ అన్ని సామాజిక వర్గాల నుండి బీసీ ఉద్యమానికి విశేషమైన మద్దతు వస్తున్నది. కల్వకుంట్ల కవిత బీసీ ఎజెండానే తన భవిష్యత్ రాజకీయ ఎజెండా అని ప్రకటించ డం, జీవన్ రెడ్డి మా వాటా కంటే మాకు ఎక్కువే దక్కుతున్నది ఇక బీసీల వంతే అని బాజాప్తా ప్రకటించడం బీసీ ఉద్యమాల నైతిక విజయం. అయితే,ఈ బలం సరిపోదు. బీసీ ఉద్యమానికి ఇప్పుడు అందరూ అవసరమే. అన్ని ఉద్యమాలకు మద్దతు ఇచ్చిన బీసీలు తమ ఉద్యమం కోసం అందరి మద్దతు తీసుకోవాల్సిందే. బీసీ ఉద్య మాల ఫలితంగా పెరిగిన బీసీ చైతన్యాన్ని మనం కళ్లారా చూస్తు న్నాం. అయితే ఈ ఉద్యమం ఈ లెవెల్ నుండి ఇంకో లెవెల్ కి వెళ్లాలంటే మాత్రం ఇది కొందరి ఉద్యమంలా కాకుండా అందరి ఉద్యమంగా ముందుకు కదలాలి. వాస్తవానికి ప్రతీ ఉద్యమాన్ని కొందరే ముందుండి నడిపిస్తారు. తర్వాత అది సమూహం అవుతుంది. మనకోసం మాట్లాడే అందరూ మనవారే అనే విశాలమైన భావననే ఏ ఉద్యమానికైనా గొప్ప అసెట్. మరీ ముఖ్యంగా, మన దేశంలో రాజకీయ మద్దతు లేకుండా ఏ ఉద్యమానికి ఒక స్పష్టత రాదనేది చరిత్ర ఎప్పటికప్పుడు చెబుతూనే ఉన్నది.
అంతిమంగా ఉద్యమానికి సామూహిక గుర్తింపు లభించిందా!? అందరూ మాట్లాడే ఒక స్థితికి చేరుకున్నామా!? అనేవే ముఖ్యమైన మైలురాళ్ళు. బీసీ ఉద్యమం ఇప్పుడీ దశలో ఉన్నది.
దానికి కొనసాగింపే కల్వకుంట్ల కవిత 72 గంటల బీసీ హక్కుల నిరాహార దీక్ష. నిరాహార దీక్ష అనేది భారత దేశ పోరాటాల్లో ఎప్పటికీ ఒక సక్సెస్ రూపమే. ఆ రూపాన్ని మనం కాదనలేని స్థితి. అది ఉద్యమ తీవ్రతను మరింత పెంచుతుందే కానీ తగ్గించదు. ఒక నియమిత సమూహం చేసే ఉద్యమాన్ని సమాజంలోకి తీసుకుపోవడానికి ఆ ఉద్యమం జనరలైజ్ కావడం ముఖ్యమైన ఘట్టం. ముఖ్యంగా బీసీ రాజ్యాధికారమే అంతిమ లక్ష్యంగా సాగుతున్నది ప్రస్తుత బీసీ ఉద్యమం. మహా సముద్రంలాంటి ఈ ఉద్యమ రూపం దేశవ్యాప్తంగా జరగాలంటే ఇందులో నదులెన్నో కలవాలి. దీర్ఘకాలిక ఉద్యమం ఎప్పుడూ లైం లైట్ లో కొనసాగడం అనేది అత్యంత అవసరం. దీనికి అన్ని వర్గాల మద్దతు అవసరం.
కాంగ్రెస్ కామారెడ్డి డిక్లరేషన్ తర్వాత బీసీ ఉద్యమం తన పంథాను మార్చుకున్నది. ఏక నాయకత్వం స్థానంలో బహు నాయకత్వం ముందుకు వచ్చింది. బీసీల్లో ఒకరిద్దరు మాత్రమే దీనికి నాయకత్వం వహించే స్థితి నుండి అది ఎక్కువ మంది చేతుల్లోకి వెళ్ళిపోయింది. ఇది పెరిగిన బీసీ ఉద్యమ చైతన్యానికి నిదర్శనం.
అయితే,బీసీల పోరాటం బీసీలే చేయాలా!? అనే విషయంపై చర్చ ఎమ్మెల్సీ కవిత బీసీ ఉద్యమాన్ని భుజానికి ఎత్తుకున్న రోజు నుండి జరుగుతున్నది. కొందరు ఆమె బీసీనా!? అని అడుగుతున్నరు!? బీసీ ఉద్యమం చేయాలంటే బీసీ యే కావాలని చెప్పిందెవరు!? ఈ ఉద్యమానికి అందరూ కావాలి. అందరూ బీసీ ఉద్యమాన్ని నైతికంగా బలపరచాలి. అంతిమంగా ఎక్కడైనా ఎవరైనా బీసీ ముచ్చటే మాట్లాడే ఒక సందర్భాన్ని ఆహ్వానించాలి. ఈ విషయంలో ఆదివాసి దళిత పోరాటాలను మనం ఆదర్శంగా తీసుకోవాలి. జనార్దన్ రావ్,బాలగోపాల్ ఇలా వారు వేర్వేరు సామాజిక వర్గాలకు చెందిన వారైనప్పటికీ వారు ఆదివాసి దళిత పోరాటాల్లో పాల్గొని వారి కోసం గొంతుకై నిలిచిన చరిత్ర మన ముందున్నది. ఇప్పుడు వారిని వేరే సామాజిక వర్గాలు అనడం కూడా ఇబ్బందిగానే ఉన్నది. అంతలా వారు ఆదివాసి,దళిత హక్కుల పోరాటాల్లో జనరలైజ్ అయ్యారు.
ఏ ఉద్యమానికైనా సమాజపు నైతిక మద్దతు అత్యవసరం. అది ఉద్యమాన్ని మరింత ముందుకు తీసుకెళ్తుందే గానీ వెనక్కు నెట్టదు. ఎవరో ఒకరు ఉద్యమాన్ని వెనక్కు నెట్టే పరిస్థితి ఉంది అంటే ఇంకా ఆ ఉద్యమం జనరలైజ్ కాలేదని అర్థం చేసుకోవాలి. ప్రస్తుతం బీసీ ఉద్యమం ఇంకో లెవెల్ కి చేరుకుని మందుతున్నది. అదిప్పుడే చల్లారదు. కనుక,ఎవరు జై బీసీ అన్నా ఆహ్వానించాల్సిందే. వ్యక్తిగత రాజకీయాలు ఉద్యమంలో బ్రాడ్ సెన్స్ ను కిల్ చేస్తాయి వాటితో ఎటువంటి ఉపయోగం లేదు. ఇదే విషయంలో మనం పూలేను ఆదర్శంగా తీసుకోవాలి. ఆయన బ్రాహ్మణిజానికి వ్యతిరేకం కానీ బ్రాహ్మణులకు వ్యతిరేకం కాదనే సమాలోచనతో ఎందరో బ్రాహ్మణ వితంతు స్త్రీలకు సాయం చేశారు. ఆశ్రయం ఇచ్చాడు. చదువు చెప్పాడు.
బాబాసాహెబ్ కూడా ఈ దేశం నాది..కానీ ఈ దేశాన్ని నాకు కాకుండా చేస్తున్న బ్రాహ్మణిజం మీదనే కోపం గానీ దేశం మీద కాద న్నాడు. కనుకనే ఈ దేశంలో పుట్టిన బుద్ధిజాన్ని మాత్రమే ఆయన స్వీకరించాడు. గాంధీజీ బ్రిటీష్ పాలకులు మాకు శత్రువులు కాదు. కానీ వారు ఇండియా మీద అనుసరిస్తున్న విధానాలే మాకు శత్రువులు అన్నాడు. కేసీఆర్ ఆంధ్రా ప్రజలతో నాకేం పేచీ!! ఆంధ్రా నాయకులతోనే! అనడం. .ఇవన్నీ వారి వారి బ్రాడ్ పొలిటికల్ ఐడియాలజీని తెలుపుతూ ఉద్యమాన్ని నిర్మించే క్రమంలో అవలంభించాల్సిన యుద్ధ వ్యూహాలను మనకు తెలియజేస్తున్నాయి. కనుక, మనకు ఉద్యమ సమయంలో బ్రాడ్ సెన్స్ తో పాటు ఏక శత్రువు మాత్రమే ఉండాలి.
మనకు మన లక్ష్యసాధన మార్గంలో మన శత్రువు ఒక్కరే ఉండేట్టుగా చూసుకుని కొన్ని సర్దుబాటులతో కలిసొచ్చే కొందరిని కలుపుకు పోవాలి. అలా కాదు ఊరందరితో పంచాయితీ అంటే ఉద్యమానికి ఆక్సెప్టెన్సీ లభించదు. ముఖ్యంగా స్త్రీల పట్ల మనకు ఒక కన్సర్న్ ఉండాలి. అస్తిత్వ ఉద్యమాల్లో అన్ని కులాల్లో అణగదొక్కబడ్డవారు స్త్రీలు. కనుక భారత దేశంలో స్త్రీ వాదం (1975- 85) రూపంలో మనం మొదటిఅస్తిత్వ పోరాటాన్ని చూశాం.
ఒకప్పుడు బీసీల కోసం ఎవరూ మాట్లాడడం లేదు అనుకునే స్థాయి నుండి ఇవ్వాళ మాట్లాడితే ఎందుకు? అనే స్థితి. ఇది ఉద్యమానికి మంచిది కాదు. ఉద్యమం పాయలు పాయలుగా సాగాలి. ఇవ్వాళ కవిత నిరాహార దీక్ష చేస్తే ఆహ్వానిద్దాం. రేపు ఇంకొకరు చేస్తరు. మరుసటి రోజు మరొకరు. ఒక ఆరంభం అయితే కవిత రూపంలో అవుతున్నది. రేపు ఇంకొకరు చేయడానికి ఇది ప్రేరణ. మొన్న మన బీసీ సోదరులు బత్తుల సిద్ధేశ్వర్ బృందం చేసిన ఆమరణ నిరాహార దీక్ష తర్వాత కవిత చేస్తున్న దీక్ష వలన బీసీ ఉద్యమానికి ఒక నైతికత, గౌరవం ఆపాదించబడుతుంది.
బీసీల కోసం బీసీలు పోరాడడం వారి ఆత్మ గౌరవ పోరాటం. ఆ ఉద్యమానికి బీసీయేతరులు కూడా చేయి కలపడం వారి సామాజిక బాధ్యత. ఆ బాధ్యతనే నిర్వర్తిస్తున్నారు కవిత. నార్త్ ఇండియాలో వచ్చిన ఫెమిన్ లీడర్షిప్ సౌత్ ఇండియాలో రాలేదు. మనకు ఈ కోవలో ఒక జయలలిత ఒక కనిమొళి ఒక కవిత ఒక షర్మిల మాత్రమే కనబడతారు. వీరందరూ వేర్వేరు సామాజిక వర్గాలకు చెందినప్పటికీ వీరంతా తమ సొంత రాజకీయ నిర్మాణం కలిగి ఉన్న శక్తివంతులు. అయినా వారు పురుషాధిపత్య రాజకీయ బాధితులే. వారిని గౌరవిద్దాం.
72 గంటల కవిత దీక్షకు మద్దతు ఇద్దాం.

- డా.చింతం ప్రవీణ్ కుమార్
బీసీ రైటర్స్ వింగ్, ఫౌండర్ ప్రెసిడెంట్


# నమ్మిన వారు ప్రత్యక్షంగా... నమ్మనివారు పరోక్షంగా మోసపోతుంటారు




నమ్మిన వారు ప్రత్యక్షంగా, నమ్మని వారు పరోక్షంగా మోస పోతూనే ఉంటారు. మోసం చేయడం, మోసపోవడం సమాజంలో ఎప్పటికీ ఆగని చక్రంలా కొనసాగు తుంది. మోసపోయిన వారు కొంత నిదానంగా తమ బాధను చెప్పుకుంటారు, మోసగాళ్లు కొంత ఆలస్యంగా దొరుకుతారు. నమ్మకం అనేది మానవ సంబంధాలకు పునాది, కానీ ఆ నమ్మకాన్ని ఆసరాగా చేసుకుని మోసం చేసే వారు సమాజంలో ఎప్పుడూ ఉంటారు. ప్రేమ, స్నేహం, వివాహం, వ్యాపారం, ఆన్‌లైన్ లావాదేవీలు లేదా రోజు వారీ జీవితంలో, మోసం రకరకాల రూపాల్లో కనిపిస్తుంది. ఈ మోసాలు కొన్నిసార్లు ఆర్థిక నష్టాన్ని, కొన్నిసార్లు భావోద్వేగ గాయాన్ని, మరికొన్నిసార్లు సామాజిక ఒత్తిడిని తెస్తాయి.
సమాజంలో నమ్మకం అనేది సంబంధాలను నడిపించే శక్తి. కానీ, ఈ నమ్మకాన్ని దుర్వినియోగం చేసే వారు ఎక్కడో ఒకచోట దాగి ఉంటారు. ఉదాహరణకు, తెలంగాణలో 2025లో ఆన్‌లైన్ మోసాలు 1,800 కేసులకు పైగా నమోదయ్యాయి, ఇందులో చాలా వరకు ప్రేమ, స్నేహం పేరుతో జరిగినవి. హైదరాబాద్‌లో ఒక యువకుడు డేటింగ్ యాప్ ద్వారా పరిచయమైన వ్యక్తి చేత రూ.3 లక్షలు కోల్పోయాడు. పెళ్లి హామీతో మోసపోయిన ఈ ఘటనలో ఆ యువకుడు ఆర్థికంగా, మానసి కంగా కుంగిపోయాడు. అలాగే, వరంగల్‌లో ఒక వ్యాపారి తన సన్నిహిత స్నేహితుడి చేత వ్యాపార ఒప్పందం పేరుతో రూ.10 లక్షలు మోస పోయాడు. ఈ ఘటనలు నమ్మకం ఎలా దుర్వినియోగ మవుతుందో చూపిస్తాయి. మోసం చేసేవారు తమ చర్యలను దాచడానికి అనేక మార్గాలను ఎంచుకుంటారు. ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్‌లు, సోషల్ మీడియా, ఫేక్ ప్రొఫైల్స్ ద్వారా మోసాలు జరుగుతున్నాయి. 2025లో తెలంగాణలో సైబర్ క్రైమ్ విభాగం 300కు పైగా ఆన్‌లైన్ మోసాలను ఛేదించినప్పటికీ, చాలా కేసులు నమోదు కాకుండానే ఉంటున్నాయి. మోసపోయిన వారు తమ బాధను చెప్పుకోవడానికి సిగ్గుపడతారు లేదా సమాజం తమను తీర్పు తీర్చుతుందని భయపడతారు. ఈ నిశ్శబ్దం మోసగాళ్లకు మరింత ధైర్యాన్నిస్తుంది. ఉదాహరణకు, ఖమ్మంలో ఒక వ్యక్తి తన బంధువు చేత మోసపోయి రూ.5 లక్షలు కోల్పోయాడు, కానీ కుటుంబ గౌరవం కోసం ఫిర్యాదు చేయలేదు. మోసం ఆగాలంటే సమాజంలో అవగాహన, చట్టపరమైన రక్షణ, సైబర్ భద్రతా చర్యలు అవసరం. ఆన్‌లైన్ లావాదేవీలలో జాగ్రత్త, గుర్తింపు ధృవీకరణ వంటి చర్యలు మోసాలను తగ్గించగలవు. సమాజం నమ్మకాన్ని గౌరవించాలి, కానీ నమ్మకంతో పాటు జాగరూకత కూడా అవసరం. మోసపోయిన వారు తమ గొంతును వినిపించే వేదికలు, చట్టపరమైన సహాయం, కౌన్సెలింగ్ సేవలు అందుబాటులో ఉండాలి. మోసం ఒక చక్రంగా కొనసాగకుండా, సమాజంలో నమ్మకం, నీతి బలపడేలా చర్యలు తీసుకోవాలి.

- అలివేలు
కాకతీయ విశ్వవిద్యాలయం

# సాహిత్యాంబుధి సదాశివ "యాది"




తెలుగు సాహిత్య చరిత్రలో జీవిత చరిత్రలను గురించి రాస్తూ డాక్టర్ ద్వానా శాస్త్రి "ఒక సంఘంలో ఒక కాలంలో ఏ ఏ పరిస్థితులు, పరిణామాలు తెస్తాయో వాటి క్రమబద్ధత ఏ విధంగా ఉంటుందో, మేధావులైన వారి స్వీయ జీవితానుభవాల వల్ల తెలుసుకోవచ్చు" అని వివరించారు. అలా తెలుగులో వచ్చిన స్వీయానుభవాల గ్రంధాలలో కాళోజి నా గొడవ, దాశరధి యాత్ర స్మృతి, దాశరధి రంగాచార్య జీవనయానం, తిరుమల రామచంద్ర గారి హంపి నుంచి హరప్పా దాకా, శ్రీపాద సుబ్రహ్మణ్య శాస్త్రి గారి అనుభవాలు జ్ఞాపకాలు, బోయి భీమన్న గారి పాలేరు నుంచి పద్మశ్రీ దాకా, శ్రీశ్రీ అనంతం, గడియారం రామకృష్ణ శర్మ గారి శతపత్రం, సామల సదాశివ గారి యాది అనే రచనలు ముఖ్యమైనవి.
గంగా జమున తెహజీబ్ కు ప్రతీక అన్నట్లు ఆదిలాబాద్ జిల్లాకు చెందిన సామల సదాశివ ఇటు తెలుగు అటు ఉర్దూ భాష సాహిత్యాలకు సంబంధించి అనేక చారిత్రక సాంస్కృతిక అంశాలు ఎన్నింటినో యాదిలో పొందుపరిచారు. తేదీ 11.5. 1928న జన్మించిన సదాశివ ఉపాధ్యాయులుగా, ఉపన్యాసకులుగా, పర్యవేక్షణ అధికారులుగా, ప్రధానాచార్యులుగా విద్యా రంగంలో వివిధ హోదాలలో పనిచేశారు. సంస్కృతం, తెలుగు, హిందీ, ఉర్దూ, ఫారసీ, మరాఠీ భాషలలో ఆయన గొప్ప పండితుడు, పరిశోధకుడు. ఉర్దూ సాహిత్య చరిత్ర, అంజద్ రుబాయిలు, మలయ మారుతాలు, యాది, సంగీత శిఖరాలు అన్నవి ఆయన ముఖ్య రచనలు.1964లో ఆయన రచించిన అంజద్ రుబాయిలకు ఉత్తమ అనువాద రచనా పురస్కారం, అలాగే 2011లో ఆయన "స్వరలయలు" అనే గ్రంథానికి కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం లభించాయి. కాకతీయ, తెలుగు విశ్వవిద్యాలయాలు గౌరవ డాక్టరేట్ డిగ్రీ తో ఆయనను సన్మానించాయి. శ్రీ సదాశివ తెలుగు ఉర్దూ సాహిత్యాలకు అలాగే హిందుస్తానీ, కర్ణాటక సంగీతాలకు మధ్య సాంస్కృతిక వారధిగా నిలిచారు.
"యాది" ఆయన జీవన సంపుటియే కాక ఎన్నో చారిత్రక సాంస్కృతిక సాహిత్య అంశాలను అందలి వాస్తవాలను నమోదు చేసిన చారిత్రక గ్రంథంగా పేర్కొనవచ్చును. సమకాలీన సమాజానికి తెలియని ఎన్నో ముచ్చట్లను ఆయన ఇందులో ఆసక్తికరంగా వివరించారు. ఇది చదువుతుంటే మనం చరిత్ర లోకి సంస్కృతిలోకి వెళ్తున్నట్లు అనిపిస్తుంది. ఆనాటి వ్యక్తుల స్వభావాలను, అప్పటి పరిస్థితులను, విశేషాలను అవగతం చేసుకోవటానికి ఇది ఒక చక్కని ఆధార గ్రంథం గా నిలుస్తుంది. ఉదాహరణకు తెలంగాణ కవులు, కళాకారులు ప్రతిభావంతులైన కూర్చిన కవితను, నేర్చిన సంగీతాన్ని తాము చదువుతూ తమవారికి వినిపిస్తూ ఆనందిస్తారు కానీ, దాన్ని ఆలంబనగా చేసుకొని పైకి ఎక్కాలని పాకులాడరు. పైగా వారికి కీర్తి కాంక్ష ,ధనాపేక్ష లేదు"అని వివరించారు. అలాగే కాళోజీ ఇంటికి అతిథిగా వచ్చిన విశ్వనాథ వారు గార్లపాటి రాఘవరెడ్డి గారి పద్యాలు వింటూ మంచంలో పడుకున్నవాడల్లా ఒక్కసారిగా మంచం దిగి నేలపై కూర్చుని వాటిని విని రెడ్డి గారిని గట్టిగా కౌగిలించుకొని "రెడ్డిగారు! మీరు మహా కవులు. ఈ పద్యాలు నన్ను కదిలించాయి" అని అభినందించటం తెలంగాణ పద్య కవిత్వ వైభవానికి ఇదొక మచ్చుతునకగా చెప్పవచ్చు. సదాశివ తనకు ఆత్మీయులైన ప్రొఫెసర్ హబీబుర్రహ్మాన్ గురించి రాస్తూ ఒక సభలో ఆయన రూమి టోపీని ఎవరో వేలెత్తి చూపితే "కొందరి స్వభావాలు మారలేదు కానీ వేషాలు మారినాయి. నా స్వభావం మారలేదు. కనుక వేషం కూడా మారలేదు". అని ఘాటుగా జవాబు ఇచ్చారట. పోలీస్ చర్యకు ముందు టోపీ ధరించిన వారంతా అనంతర కాలంలో ఖద్దరుధారులైనారు కదా! అన్న వ్యంగ్యోక్తి ఇందులో ఉంది. సదాశివ లక్సెట్టిపేటలో ఉపాధ్యాయుడుగా పనిచేస్తున్న రోజులలో పాఠశాల పర్యవేక్షణకై వచ్చిన విద్యాశాఖ అధికారి ఒకరు తనకు తెలియకపోయినా తరగతిలో తను అడిగిన ప్రశ్నకు సరైన జవాబు ఇచ్చిన విద్యార్థిని ఉపాధ్యాయుడు కూర్చోమనగా ఆ తర్వాత బయటకు వచ్చిన అధికారి ఆ పిల్లవాడు చెప్పింది కరెక్టేనా? అని అడగడంతో చిర్రెత్తిపోయిన సదాశివ "తేలు మంత్రం రానివాడు పాము పుట్టలో వేలు పెట్టినట్లు, మీకే తెలుగు రాదు. వ్యాకరణం ప్రశ్నలు ఎందుకు అడిగినారు?" అని ఆ అధికారికి దీటుగా జవాబు ఇచ్చాడట. దాంతో సదాశివను అక్కడినుండి బదిలీ చేశాడట. ఇది ఆనాటి అధికారుల వైఖరికి అద్దం పడుతుంది. అలాగే ప్రజాస్వామ్య కాలంలో మంత్రులకు, రాజకీయ నాయకులకు భయపడే ఉన్నతాధికారులను చూస్తున్నాము. ఆనాడు నిజాం నిరంకుశ పాలనను, మంత్రిమండలి అవివేకాన్ని, రాక్షస మూక వంటి రజాకార్ల ఆగడాలను నిర్భయంగా విమర్శించే ముస్లిం గురువులను చూచినాము అని ఆయన కుండ బద్దలు కొట్టినట్లు చెప్పారు. అలాగే షోయబుల్లా ఖాన్ భార్య నిండు గర్భిణిగా ఉన్న సమయంలో డాక్టర్ హరిచంద్ర హెడా భార్య జ్ఞాన కుమారి, డాక్టర్ అమ్మ కలిసి బురఖాలు ధరించి ఆమె సుఖ ప్రసవం అయ్యేటట్లు చేశారని లోకానికి అంతగా తెలియని విషయాన్ని ఆయన వివరించారు. ఉస్మానియా దవాఖానకు దగ్గరగా ఉన్న చింతల నరసమ్మ భోజనశాల గురించి రాస్తూ "ఆమెకు రూపాయలకంటే తన దగ్గర తినే వాళ్లు కడుపునిండా సంతృప్తిగా తినాలన్నదే ముఖ్యం"అని రాశారు. ఆయన కృతజ్ఞతా భావానికి ఒక మచ్చుతునక. ఒకనాడు హైదరాబాదులోని విద్యాశాఖ కార్యాలయంలో చిన్నప్పుడు తనకు లెక్కలు రావని మందలించిన తన చిన్ననాటి గురువు లక్ష్మణ్ అయ్యర్, సదాశివ ఎం.ఏ సర్టిఫికెట్ను చూసి తన కొడుకే పాస్ అయినంతగా సంబరపడి అక్కడ పనిచేసే సిబ్బందికి అందరికి మిఠాయి పంచాడట. ఇది ఆనాడు గురువులకు శిష్యుల పట్ల ఉన్న వాత్సల్యానికి నిదర్శనంగా చెప్పుకోవచ్చు. అంజద్ రుబాయిలు ఉర్దూలో చాలా ప్రశస్తమైనవి. ఒకనాడు ఆయన గొప్పతనాన్ని తెలుసుకున్న నిజాం అతడు ఆఫీసుకు రావలసిన అవసరం లేదు. నెల నెల అతని జీతం ఇంటికి పంపించండని అన్నారట. దానికి అంజద్ "పనిచేయకుండా తీసుకునేది ఖైరాత్. నేను ఖైరాతిని కాదు. ఉద్యోగిని" అని జవాబు ఇవ్వడం అతని ఆత్మాభిమానానికి ప్రతీకగా చెప్పవచ్చు. దీనిని బట్టి అతని కవిత్వము అతని వ్యక్తిత్వము రెండు అభిన్నమైనవనీ తెలుస్తుంది. విశ్వనాథ లాంటి మహాకవి ఉర్దూలో తనను గురించి రాయమని సదాశివను అడగడం, వేలూరు శివరామశాస్త్రి గారు, గడియారం రామకృష్ణ శర్మ గారు మొదలైన వారు సదాశివ సాహిత్య వ్యాసంగాన్ని పలు విధాలుగా ప్రశంసించడం మరచిపోలేని జ్ఞాపకాలు. కాళోజీసోదరుల ఆప్యాయత అనురాగాలను గురించి ప్రత్యేకంగా వివరించారు. వారి తల్లి రమాబాయమ్మ ఇంటికి వచ్చిన అతిథులు అందరి పాలిట అన్నపూర్ణయై వ్యవహరించేదట. కాళోజి సోదరుల గురించి రాస్తూ "హింసకు, ప్రతి హింసకు, అణచివేతకు, అన్యాయానికే కాక సాహిత్యంలోనే రుగ్మతలకు కూడా ఏడుస్తారు. ప్రతిఘటించాలని ప్రబోధిస్తారు, ప్రతిఘటిస్తారు" అని వెల్లడించారు. చివరకు వారిద్దరూ మరణించినప్పుడు వయస్సు 89 సంవత్సరాలే కావటం, అలాగే వారి పార్థివ శరీరాలను కాకతీయ వైద్య కళాశాలకు అర్పించడం వారి త్యాగ జీవితానికి గుర్తుగా చెప్పవచ్చు. సదాశివకు ఉర్దూ దినపత్రిక సియాసత్ సంపాదకులు అబీద్ అలీ ఖాన్ గారితో సన్నిహిత పరిచయం ఉండేది, సుమారు ఆయన అందులో వందకు పైగా వ్యాసాలు రాశారు. వారి ఆత్మీయ మైత్రి ఆయన చివరి వరకు కొనసాగింది. జిల్లాలో కొమరం భీమ్ వీర మరణం తర్వాత గిరిజన సమస్యలపై దృష్టి పెట్టిన నిజాం ప్రసిద్ధ మానవ శాస్త్రవేత్త డార్ఫ్ ను అక్కడి గోండుల పరిస్థితులను అధ్యయనం చేయవలసిందిగా ఆదేశించారు. దానితో ఆయన మార్లవాయి అనే గ్రామాన్ని ఆవాసంగా తీసుకొని అక్కడి ప్రజల ప్రేమాభిమానాలను చూరగొని వారి దృష్టిలో మహాదేవుడుగా గుర్తింపబడ్డాడు. ప్రజా సమస్యల్ని పరిష్కరించడంలో అధికారులు చిత్తశుద్ధిని కనబరిస్తే, ప్రజలు వాళ్లను ఎలా కొలుస్తారో ఈ ఉదంతం మనకు వివరిస్తుంది. ప్రభుత్వ అధికారులు అలాంటి వారిని ఆదర్శంగా తీసుకొని నిజాయితీతో గ్రామీణ ప్రాంతాలకు చెందిన పేద బడుగు బలహీన వర్గాలు, ఆదివాసీల సమస్యలను పరిష్కరించడానికి కృషి చేయాలన్న ప్రబోధం కూడా పరోక్షంగా ఈ సంఘటన వివరిస్తుంది. గ్రంథంలో అక్కడక్కడ సదాశివ వివిధ వ్యాసాలలో పేర్కొన్న పలు అంశాలు ఆయన వ్యక్తిత్వాన్ని గురించి, ఆనాటి పరిస్థితులను గురించి ప్రత్యేకంగా వివరిస్తాయి. అందులో "నా బద్ధకం కారణంగా చాలా అవకాశాలు పోగొట్టుకున్నాను. ఏ నియమం పాటించని నేను 20 ఏళ్ల పాటు తెలుగు పత్రికలకు రాయలేదు. నా దగ్గర సరిపోయేంత డబ్బు ఉండేది కాదు. నా ఇంట్లో సౌకర్యాలు అంతగా లేవు. అయినా మమకారాలు ఉన్నచోట సౌకర్యాల ప్రసక్తి ఉండదు కదా! సంగీత సాహిత్యాలకు మతం రంగులను పులమ వద్దంటే ఎవరు వినరు. మా తరం వాళ్లలో నైతిక సాహసం మిగిలి ఉంది అన్న వాక్యాలు అందుకు ఉదాహరణలు. ఇచ్చిన వ్యక్తిని బట్టి కదా వస్తు విలువ అన్నట్లు ఆయన చెప్పిన మాటలు ఈ గ్రంథానికి కూడా వర్తిస్తాయి. ఇలా తన కాలాన్ని జల్లెడ పట్టి ఎన్నో అంశాలను మనకు అందించారు. తెలుగులో 20 ఏళ్ల పాటు " రాయని భాస్కరుడు"గా ఉన్న ఆయనతో మళ్లీ కలాన్ని కదిలింప చేసిన పాత్రికేయులు కె.రామచంద్ర మూర్తి, ప్రముఖ రచయితలు వాకాటి పాండురంగారావు, జయధీర్ తిరుమలరావు, ఆనాటి మిసిమి సంపాదకులు ఆలపాటి రవీంద్రనాథ్ ధన్యులు. వారి ప్రేరణ వల్ల "యాది" లాంటి గొప్ప రచన మనకు అందుబాటులోకి వచ్చింది. ఉర్దూ, తెలుగు సాహిత్యాల మధ్య వారధిగా నిలిచిన "యాది"సదాశివ తేదీ 7.8.2012 న అస్తమించారు. ప్రస్తుతం పాఠకులకు అలభ్యంగా ఉన్న వారి "యాది" ని మరోసారి యాది చేసుకుంటూ తెలంగాణ సాహిత్య అకాడమీ గానీ తెలుగు విశ్వవిద్యాలయం గానీ "యాది"ని పునర్ ముద్రించాలని కోరుకుంటున్నాను. మన చరిత్ర మనకు చైతన్యాన్ని అందిస్తుంది కదా!



డాక్టర్ శంకరమంచి శ్యాంప్రసాద్
99 891 48 305

## "సెలవు (లేని) రోజులు"

సెలవు లేని రోజులన్నీ
పరిగెత్తాల్సిందే -
కాలం, వృత్తంలో తిరుగుతూనే ఉంటుంది...
ఏ ఆదివారమో,
లేక ఏ పండుగదినమో
మనసు కొంచెం ఊపిరి పీల్చుకుంటే -
కొండంత ఊరట.
వేయి పనుల మధ్య
ఒక్క నిమిషం ప్రశాంతత -
వెయ్యేనుగుల బలం, బలగం!

-బాలాజీ పోతుల
8179283830

## మార్పు అనివార్యం

దానిపేరు సోషలిజం
క్రమంగా కమ్యూనిజం
ఈమార్పుఅనివార్యం!
బానిస భూస్వామ్య
పెట్టుబడిదారీ -దోపిడీ
వ్యవస్థలు గతించాయి!
మిగిలింది ఒక్కటే
దోపిడీలేనిసమాజం
ప్రజలుకోరుతున్నారు!
ఎక్కడలేనిదిక్కుమాలిన
మనువాదంఈమార్పుతో
వీళ్ళకుగుండెల్లో బేజార్!
తినితిని బాగాతిన్నారు
కూర్చునిసోమరిపోతుల్లాజి
తినాలనే చూస్తున్నారు!
శ్రమనుండి ప్రభవించు
సర్వ సంపదలు!
ఇదొక్కటే నిజం!
నిజాన్ని నీరుగార్చి
మాయలుమిథ్యలతోజి
ఇంక సాగదు మీబతుకు!
జనం విజ్ఞానవంతులై
వైజ్ఞానిక సమాజం
అదుగో అరుణోదయం!
ఐక్యమై అందరూ
భానుతేజముపొంది
ఉరికి వస్తున్నారు
మాయలన్నీ మలిగి
వివక్షలన్నీ తొలగి
శ్రమయేవజయతే!

-తమ్మినేని అక్కిరాజు, హైదరాబాద్

# ప్రజల ఆరోగ్యం పట్ల వైద్య ఆరోగ్యశాఖ అప్రమత్తం

- ఇప్పటివరకు జిల్లాలో మలేరియా కేసులు నమోదు కాలేదు
- సైకిల్ పై 20 కి.మీ ప్రయాణించి రామాయంపేట ప్రభుత్వ వైద్యశాలను కలెక్టర్ ఆకస్మిక సందర్శన



**మెదక్ జిల్లా బ్యూరో, ఆగస్టు 3 (జనంసాక్షి):** ప్రజలు వ్యక్తిగత శారీరక పరిసరాల పరిశుభ్రతపై దృష్టి సారిస్తూ నీరు నిలవ లేకుండా చూసుకున్నట్లయితే వ్యాధులు దరి చేరకుండా మంచి ఆరోగ్యం మన సొంతమవుతుందని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ తెలిపారు. ఆదివారం జిల్లా కలెక్టర్ దంపతులు సైకిల్ పై 20 కిలోమీటర్లు ప్రయాణం చేసి రామాయణపేట ప్రభుత్వ ఆసుపత్రిని కలెక్టర్ అకస్మికంగా సందర్శించారు. రోగులకు అందిస్తున్న సేవలు, సిబ్బంది హాజరు పట్టిక ఓపి రిజిస్టర్, డెలివరీ రిజిస్టర్, పరిశీలించి వైద్య సిబ్బందికి తగు సూచనలు చేశారు. పేద ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు ప్రభుత్వం వైద్య శాఖను బలోపేతం చేస్తూ పటిష్ట కార్యచరణ ద్వారా ముందుకు పోతుందని దానికి అనుగుణంగా వైద్య సేవలు అందించేందుకు కృషి చేస్తున్నట్లు చెప్పారు. సీజనల్ వ్యాధులను దృష్టిలో పెట్టుకొని వైద్య ఆరోగ్యశాఖ అప్రమత్తంగా ఉందని, జిల్లాలోని ఆరోగ్య కేంద్రాలను పటిష్ట పర్యవేక్షణకు కలెక్టర్ కార్యాలయంలో సీసీ కెమెరాల ద్వారానిగా పెట్టమన్నారు, వైద్యాధికారులు సిబ్బంది అందరూ కూడా సెలవు రోజుల్లో కూడా అందుబాటులో ఉంటూ వైద్య సిబ్బంది సమయ పాలన, మెరుగైన వైద్య సేవలు అందించడంలో ఆదర్శంగా నిలుస్తారన్నారు. ఇంటి పరిసరాలలో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని దోమలు వృద్ధి చెందకుండా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో ఇప్పటివరకు మలేరియా కేసులు నమోదు కాలేదని, ప్రమాద సాయి కేసులు ఎక్కడ లేవన్నారు, ప్రజలను రక్షించే విధంగా చర్యలు తీసుకుం టున్నామన్నారు. ప్రజ లందరూ వ్యక్తిగత శారీరక పరిస రాల పరిశుభ్రతపై దృష్టి సారిస్తూ నీళ్లు నిలువ లేకుండా చూసుకుంటు న్నట్లయితే ప్రజలందరూ సురక్షితంగా ఆరోగ్య వంతంగా ఉండవచ్చు అన్నారు. రామాయంపేట ప్రభుత్వ ఆసుపత్రిలో గైనకా లజిస్ట్ లేకపోవడం వల్ల తక్కువ మొత్తంలో ప్రసవాలు జరు గుతు న్నాయని గుర్తించడం జరిగిందని తొంద ర్లోనే గైనకా లజిస్ట్ పోస్టును నింపి అధిక మొత్తంలో ప్రసవాలు జరిగే విధంగా చర్యలు తీసుకుంటా మన్నారు రామాయ ంపేట ప్రభుత్వ ఆసుపత్రి అన్నిరకాల మౌలిక మౌలిక వస తులతో నిష్ణాతు లైన వైద్య నిపుణులు సిబ్బందితో రోగులకు మెరుగై న సేవలు అందు తున్నాయి అన్నారు. ఇంకా మెరుగైన సేవలు చేందుకు రామాయం పేట ఆసు పత్రిలో వసతు లపై ఆదిశగా చర్యలు చేపడతా మన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు పాల్గొన్నారు.

# స్పెషల్ ఎడ్యుకేషన్ ఎస్.జి.టి. వారికి న్యాయం చేయాలి




**హైదరాబాద్ ఆగస్టు 3 (జనంసాక్షి):** సెటా రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యద ర్శులు బత్తుల రాజేంద్రప్రసాద్, అట్ల శ్రీనివాస్ రెడ్డి పి.ఆర్.టి.యు. తెలం గాణ రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో ప్రత్యేక ఆహ్వానితులుగా స్పెషల్ ఎడ్యుకేషన్ టీచర్స్ అసోసి యేషన్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు బత్తుల రాజేం ద్రప్రసాద్, అట్ల శ్రీనివాస్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా బత్తుల రాజేంద్రప్రసాద్, అట్ల శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ స్పెషల్ ఎడ్యుకేషన్ టీచర్స్ గత సంవత్సర కాలంగా ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తున్న ప్పటికీ జాబ్ చార్ట్ ప్రభుత్వం విడుదల చేయడంలో జాప్యం జరుగుచున్నదని స్కూల్ అసిస్టెంట్ స్పెషల్ ఎడ్యుకేషన్ పదో న్నతులలో దాదా పుగా 50% పైగా పాఠశాలలో ఖాళీగా ఉన్న దృష్ట్యా ప్రస్తుతం పని చేస్తున్న ఎస్జీటీ స్పెషల్ ఎడ్యుకేషన్ ఉపాధ్యాయులకు కనీస సర్వీసును మినహాయింపు చేస్తూ పదోన్నతుల సీని యార్టీ లిస్టులలో చేర్చుటకు ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్లాలని పి.సి.సి. అధికార ప్రతినిధి, పి.ఆర్.టి.యు. తెలంగాణ వ్యవస్థాపక అధ్యక్షులు గాల్ రెడ్డి హర్ష వర్ధన్ రెడ్డి వినతిపత్రం సమర్పించడం జరిగిందని స్పెషల్ ఎడ్యుకేషన్ ఎస్జిటికి న్యాయం చేయాలి ఒక ప్రకటనలో తెలిపారు.

# కాంగ్రెస్ ప్రభుత్వంలో దరఖాస్తులకే పరిమితం

- రాజీవ్ యువవికాస్ పథకాన్ని ప్రభుత్వం అమలు చేయాలి
- డీవైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కోట రమేష్ ఆనగంటి వెంకటేశ్



**హైదరాబాద్ ఆగస్టు 3 (జనంసాక్షి):** తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక దరఖాస్తులకే పరిమితం అవుతుందే తప్ప హామీల అమలుకు నోచుకోవడం లేదని డీవైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కోట రమేష్ ఆనగంటి వెంకటేశ్ అన్నారు. భారతప్రజాతంత్ర యువజన సమాఖ్య (డివైఎఫ్ఐ) రాష్ట్ర కమిటీ సమావేశం డివైఎఫ్ఐ రాష్ట్ర కార్యాలయం చిక్కడపల్లిలో నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధిరుణాలు అందించాడానికై రాజీవ్ యువ వికాస్ పథకం ద్వారా రూ. 50వేల నుండి రూ.5 లక్షల వరకు రుణాలను ఇస్తామని 6వేల కోట్ల రూపాయలను కేటాయించిందన్నారు. ఈ పథకానికి రాష్ట్రంలో ఉన్న నిరుద్యోగులు 16 లక్షలా 25వేల మంది వరకు దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. ప్రభుత్వం జూన్ 2 తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవం రోజున రాజీవ్ యువ వికాస్ పతకం లబ్దిదారులకు నిధులను మంజూరు చేస్తామని ప్రచారం చేసి వాయిదా వేసిందన్నారు.ప్రభుత్వం నిర్లక్ష్యం చేయకుండా కాలయాపన చేయకుండా రాజకీయ ప్రమేయం లేకుండా అర్హులైన లబ్దిదారుల అందరికి రాజీవ్ యువ వికాస్ పథకం ద్వారా నిధులు మంజూరు చేయాలనీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సిబిల్ స్కోరు లేకున్నా నిరుద్యోగ యువతకు ఈ పథకాన్ని అమలు చేయాలని, లేనిపక్షంలో డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆందోళనకార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. అదేవిదంగా రాష్ట్రంలో ఖాళీగా ఉన్న పోస్టులన్నింటిని భర్తీ చేయాలని, రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన జాబ్ క్యాలెండర్ ఇయర్ ను అమలు చేసి నోటిఫికేషన్స్ వేసి ఉద్యోగాలను భర్తీ చేయాలన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర ఆఫీస్ బేర్రర్స్, రాష్ట్ర కమిటీ సభ్యులు గడ్డం వెంకటేష్, మల్లం మహేష్, తిరుపతి, కార్తీక్, తిరుపతి నాయక్,శివ వర్మ, హరికృష్ణ,రమేష్, సాంబమూర్తి, హస్మి బాబు, సాగర్, మహేష్, టికానంద్, వీరబాబు, నరేష్, నవీన్ శ్రీకాంత్, మహేష్, పాల్గొన్నారు.

# 7న గోవాలో జాతీయ ఓబీసీ మహాసభ

- భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తాం
- బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ వెల్లడి

**హైదరాబాద్ ఆగస్టు 3 (జనంసాక్షి):** ఈ నెల ఆగస్టు 7న గోవా రాష్ట్రంలోని డాక్టర్ శ్యాంప్రసాద్ ముఖర్జీ ఆడిటోరియంలో జరిగే జాతీయ ఓబీసీ మహాసభకు దేశవ్యాప్తంగా ఓబీసీ ఉద్యోగులు కదిలి వచ్చి విజయవంతం చేయాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ పిలుపునిచ్చారు. హైదరాబాదులోని బీసీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర కార్యాలయంలో బీసీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎం చంద్ర శేఖర్ గౌడ్, ప్రధాన కార్యదర్శిడి రమ ఆధ్వర్యంలో గోవాలో జరిగే జాతీయ ఓబీసీ మహాసభను విజయవంతం చేయాలని కోరుతూ బీసీ ఉద్యోగుల సంఘం రూపొందించిన పోస్టర్ ను జాజుల శ్రీనివాస్ గౌడ్,రాష్ట్రీయ ఒబిసి ప్రదాన కార్యదర్శి ముఖ్యఅతిథిలుగా పాల్గొని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జాజుల శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా బీసీలు ఎదుర్కొంటున్న సమస్యలపై ఆగస్టు 7న గోవాలో జరిగే జాతీయ ఓబీసీ మహాసభలో సుదీర్ఘంగా చర్చించి భవిష్యత్తు ఉద్యమ కార్యాచరణను రూపొందిస్తమని జాజుల శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. ఈ మహాసభకు దేశంలోని 29 రాష్ట్రాల నుండి పదివేల మంది ఓబిసి ప్రతిని దులు పాల్గొంటారని, దేశంలోని అఖిలపక్ష రాజకీయ పార్టీలకు చెందిన బీసీ నేతలు కూడ హాజరవు తున్నట్లు ఆయన తెలిపారు. దేశవ్యాప్తంగా జనా భాదామాషా ప్రకారం చట్టసభల్లో 50శాతం రాజకీయ రిజర్వేషన్లు కల్పించాలని, రిజర్వేషన్లపై విధించిన 50 శాతం పరిమితిని ఎత్తివేయాలని, బీసీలపై విధించిన క్రిమిలేయరును రద్దు చేయా లని, బీసీ ఉద్యోగులకు ప్రమోషన్లు రిజర్వేషన్లు అమలు చేయాలనే ప్రధాన డిమాండ్లపై ఈ మహా సభలో ప్రధానంగా చర్చించనున్నట్లు ఆయన తెలిపారు. రాష్ట్రీయ ఓబీసీ మహాసంగ్ ప్రధాన కార్యదర్శి సచిన్ రాజోల్కర్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం ఓబీసీ రిజర్వేషన్లు అమలులోకి వచ్చినటువంటి రోజైనా ఆగస్టు 7న జాతీయ ఓబీసీ మహాస భలను దేశంలోని అన్ని రాష్ట్రాలలో నిర్వహిస్తున్నామని ఈసారి పదో మహాసభను గోవా రాష్ట్రంలో డాక్టర్ శ్యాంప్రసాద్ ముఖర్జీ ఆధ్వర్యంలో పెద్ద



ఎత్తున నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. బీసీ ఉద్యో గుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎం చంద్ర శేఖర్ గౌడ్ ప్రధాన కార్యదర్శి రమ మాట్లా డుతూ ఏడవ తేదీన ఉదయం 10 గంటల నుండి ప్రారంభమ య్యే జాతీయ ఓబీసీ మహాస భలో కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు రాష్ట్ర ప్రభుత్వ ఉద్యో గులు పెద్దఎత్తున పాల్గొని సభను విజయ వంతం చేయాలని ఉద్యోగులకు వారు విజ్ఞప్తి చేశారు.

ఈ కార్యక్ర మంలో బీసీ కుల సంఘాల జేఏసీ చైర్మన్ కుందారం గణేష్ చారి బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యవర్గ అధ్యక్షులు కుల్కచర్ల శ్రీనివాస్ ముదిరాజ్, బిసి విద్యార్ధి సంఘం అధ్యక్షులు తాటి కోండ విక్రం గౌడ్, బిసి ఉద్యోగ సంఘాల నేతలు రాదరాణి పాల్గోన్నారు.0

# అసమానతలులే లేని సమాజం కావాలి

- శానిటరీ నాప్కిన్స్ ఉచితంగా పంపిణీ చేయాలి
- వివక్షకు వ్యతిరేకంగా విద్యార్థులు ఉద్యమించాలి
- ఎస్ఎఫ్ఐ రాష్ట్ర విద్యార్థినిల సదస్సులో ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మీ



**హైదరాబాద్ ఆగస్టు 3 (జనంసాక్షి):** దేశంలో రాష్ట్రంలో అమ్మాయిల పైన అత్యాచారాలు రోజు రోజుకు పెరుగుతో పోతున్నాయి. కానీ కేంద్ర ,రాష్ట్ర ప్రభుత్వాలు వాటిపైన ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం సిగ్గుచేటు. బేటి బచావో ,బేటి పడావో అని చెప్పే నరేంద్ర మోడీ ఈ భారత దేశంలో ఒక గంటకి కొన్ని వేల అత్యాచారాలు ,కొన్ని వేల యాసిడ్ దాడులు గురవుతున్న మహిళలు ఎందరో ఉన్నారు .కానీ చట్టం ఉన్నవారికి చుట్టం లాగా లేని వారికి ఎటువంటి చట్టం వర్తించకపోవడం చాలా బాధాకరం. గతంలో అమ్మాయిల హాస్టల్, కాలేజీలలో సానిటరీ నాప్కిన్స్, ఉచితంగా ఇచ్చేవారు.కానీ ప్రస్తుతం ఇవ్వడం లేదని వాటిని ప్రతి గురుకులంలో అమలు చేయాలని ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మీ డిమాండ్ చేశారు. హైదరాబాద్ సిటి సిఐటియు కార్యలయంలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎం.మమత అధ్యక్షత విద్యార్ధినిల రాష్ట్ర సదస్సు జరిగింది. ఈ సందర్భంగా మల్లు లక్ష్మీ మాట్లాడుతూ.. సానిటరీ నాప్కిన్స్ పైన జీఎస్టీ ఎత్తివేయాలని ఆమె చెప్పారు. హాస్టల్స్, గురుకులాలు,కెజిబివిలు అ మ్మాయిలకు సరైన సదుపాయాలు లేక సరిపడ గదులు లేక సరిపడా వాష్రూమ్స్ లేక అమ్మాయిలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వాటి పైన ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. అమ్మాయిలకు సరైన ఆహారం తీసుకోక అనారోగ్య బారిన పడుతున్నారని రక్తహీనతకు గురవు తున్నరని, అందుకే అమ్మాయిలకు న్యూట్రి షన్ ఫుడ్ అందించాలని, మెస్ చార్జీలు పెంచాలని డిమాండ్ చేశారు. విద్యార్థులందరూ మహనీయుల చరిత్రలు తెలుసుకోని మహనీయుల అడు గుజాడల్లో నడవాలని వారి ఆశయ దారుల్లో కొన సాగాలని చెప్పారు. నేడు సోషల్ మీడియాలో వస్తున్న అశ్లీల కంటెంట్, డబుల్ మీనింగ్ వీడి యోలు, డ్రగ్స్, గంజాయి,మద్యం, సిగరెట్ లాంటి సంస్కృతి విద్యార్థినిలలో కూడా రుద్దబడు తుందని వాటికి వ్యతిరేకంగా విద్యార్థులు ఉద్యమించాలని అన్నారు. ప్రభుత్వాలు మహిళ విద్యకు నిధులు కేటాయించి, బాలిక వసతిగృహాలు, యూనివర్శిటీలు, విద్యాసంస్థల అభివృద్ధి చేయాలని కోరారు. ఈ రాష్ట్ర సదస్సులో విద్యార్థుల సమస్యలు పరిష్కా రానికి పోరాటానికి ప్రణాళి కను రాష్ట్ర కన్వీనర్ ఎం.పూజ ప్రవేశ పెట్టారు. ఈ సదస్సులో ఎస్ఎ ఫ్ఐ రాష్ట్ర అధ్యక్ష, కార్యద ర్శులు ఎస్.రజనీకాం త్, టి.నాగరాజులు మాట్లా డారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సహాయ కార్య ద ర్శి దీపికా, రాష్ట్ర కమిటీ సభ్యులు రమ్య, కార్తీక్, రమేష్, అవినాష్, హేమలత, పాల్గొన్నారు.

# సునిత లక్ష్మారెడ్డికి రాజకీయ భిక్ష పెట్టిందే కాంగ్రెస్

- ఊసరవెల్లి రాజకీయాలు చేస్తే ఊరుకునేది లేదు
- ఎమ్మెల్యే సునిత రెడ్డికి కాంగ్రెస్ నాయకుల హెచ్చరిక



**హత్నూర, ఆగస్టు 3 (జనంసాక్షి):** ఊసరవెల్లి రాజకీయాలు చేస్తూ,రెచ్చగొట్టే వ్యాఖ్యలతో బిఆర్ఎస్ కార్యకర్తల్లో విష బీజాలు నాటుతున్న ఎమ్మెల్యే సునిత లక్ష్మారెడ్డి తీరు సరైనది కాదని హత్నూర మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు ఘాటుగా వ్యాఖ్యానించారు.మండల కేంద్రమైన హత్నూర రైతు వేదికలో శనివారం నిర్వహించిన కొత్త రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో బిఆర్ ఎస్-కాంగ్రెస్ నాయకుల మధ్య చోటు చేసుకున్న వాగ్వివాదంపై మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆదివారం హత్నూర కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాజకీయ భవిష్యత్తునిచ్చి ఎమ్మెల్యేగా,మంత్రిగా ఉన్నతమైన పదవులను కట్టబెట్టిన కాంగ్రెస్ పార్టీ పట్ల అనుచితంగా వ్యాఖ్యానించిన సునిత రెడ్డి తీరును వారు తప్పుబట్టారు.కాంగ్రెస్ పార్టీ ప్రజలకిచ్చిన ఆరు గ్యారంటీల్లో భాగంగా రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో రాష్ట్ర ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి చిత్ర పటానికి క్షీరాభిషేకం చేస్తే తప్పేముందని వారు ప్రశ్నించారు.కాంగ్రెస్ సర్కార్ అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలను చూసి ఓర్వలేకనే ఎమ్మెల్యే సునిత లక్ష్మారెడ్డి చిల్లర రాజకీయాలు చేస్తుందని వారు విమర్శించారు.ఎమ్మెల్యే ప్రోత్బలంతోనే బిఆర్ఎస్ కార్యకర్తలు దురుసుగా ప్రవర్తించారని వారు ఆరోపించారు.సిఎం రేవంత్ రెడ్డి చిత్రపటాన్ని చించివేసేలా బిఆర్ఎస్ కార్యకర్తలను ఉసిగొల్పిన ఎమ్మెల్యే సునిత లక్ష్మారెడ్డిపై చట్టరిత్యా చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు కర్రె కృష్ణ, మైనారిటీ విభాగం రాష్ట్ర కార్యదర్శి హకీం,మహిళా మాజీ జిల్లా అధ్యక్షురాలు సుజాత,మాజీ సర్పంచి వీరాస్వామి గౌడ్, నాయకులు సత్యం, మణిదీప్, సాయి, రియాజ్, సురేందర్ రెడ్డి, పెంటయ్య తదితరులు పాల్గొన్నారు.

# అంబేద్కర్ ఆశయ సాధన కోసం కృషి చేద్దాం

- చట్టసభల్లో మహిళలకు రిజర్వేషన్ హర్షణీయం
- యువత మత్తు వదలి ఉన్నత స్థానానికి ఎదగాలి
- తెలంగాణ శాసనసభాపతి గడ్డం ప్రసాద్ కుమార్
- శాసనమండలి ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్



**వికారాబాద్ జిల్లా బ్యూరో ఆగస్టు 3 (జనంసాక్షి):** బడుగు బలహీన వర్గాల కోసం అంబేద్కర్ చేసిన కృషి అమోహం.. ఆయన ఆశయ సాధన కోసం అందరం కృషి చేయాలని తెలంగాణ రాష్ట్ర శాసన సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ అన్నారు. మర్పల్లి మండలంలోని పట్లూరు గ్రామంలో భారీ అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి శాసనమండలి ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ ప్రొఫెసర్ కాసిం తోపాటు మాజీమంత్రి చంద్ర శేఖర్ మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్‌తో పాటు అనేక మంది రాజకీయ నాయకులు హాజర య్యా రు. ఈ సందర్భంగా స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ మాట్లాడుతూ దేశంలోని అన్ని వర్గాల అభ్యున్నత కోసం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ రాజ్యాంగాన్ని రచించారని కొనియాడారు. సంబాండవర్గాలకు సమన్యాయం చేయడానికి రాజ్యాంగాన్ని రూపొందించినట్లు వివరించారు. చట్టసభల్లో మహిళలకు స్థానం కల్పించాలని నాడు అంబేద్కర్ సూచించారని అన్నారు. రాజ్యాంగంలో పొందుపరిచిన విధంగా రాజకీయాల్లో ఉద్యోగాల్లో మహిళలకు సమన్యాయం జరుగుతుందని అన్నారు. రాజ్యాంగం ద్వారా హక్కును పొందుతున్న ప్రతి పౌరుడు దేశం కోసం సేవకుడిలా పనిచేయాలని శాసన మండలి ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ అన్నారు. రాజ్యాంగం ప్రమాదంలో పడిందని దానిని రక్షించడానికి పోరాటం చేయవలసిన ఆవశ్యకత ఉందని అన్నారు. మహాత్ముల ఆలోచనలకు పదును పెట్టి హక్కుల సాధన కోసం ఉద్యమిం చాలని అన్నారు. అన్ని వర్గాల్లో పేదలు ఉన్నం దున రాష్ట్ర ప్రభుత్వం ఇంటిగ్రేడ్ పాఠశాలలను నెలకొల్పి అన్ని వర్గాల పిల్లల అభివృద్ధి కోసం కృషి చేస్తుందని అన్నారు. బీసీ రిజర్వేషన్ 42% సాధించవలసిన అవసరం ఉందని అభిప్రాయ పడ్డారు. కేంద్ర ప్రభుత్వం మహిళా బిల్లు ఆమో దించి చట్టసభల్లో అవకాశాలు కల్పిస్తామని హామీ ఇచ్చిందని ఎప్పుడో కాకుండా వచ్చే ఎన్నికల నాటికి అమలు పరచవలసిన ఆవశ్యకత ఉందని అన్నారు. మూఢ నమ్మకాలపై చట్టం తీసుకురావల సిన అవసరం ఉందని అన్నారు. సమాజంలో నాటుక పోయిన రుగ్మతులను తొలగించ వలసిన అవసరం ఉందని అన్నారు. మనుషులకు వర్ణం లేదని మనుషులంతా సమానమేనని ప్రొఫెసర్ కాసిం అన్నారు. యువత మొబైల్ ఫోన్ కు అలవాటు పడి బంగారు భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారని అన్నారు. వ్యసనాలు వదిలి ఉన్నత స్థానానికి ఎదగడానికి సంకల్పించాలని కోరారు. తెలంగాణ రాష్ట్రంలో ఎక్కడ చూసినా ఇతర రాష్ట్రాలకు చెందిన వారే పనిచేస్తున్నారని తెలంగాణలో ఉన్న ప్రజలు యువత సోమరులుగా మారారని జిహెచ్ఎంసి అసిస్టెంట్ కమిషనర్ శ్యామ్ రావు అన్నారు. యువత పెడదారి పడుతున్నందున డ్రగ్స్ పై ఉక్కు పాదం మోపుతున్న ప్రభుత్వాన్ని అందరము హర్షించాలని అన్నారు. అంబేద్కర్ ఆశయ సాధన పుస్తకాలను ఐదు లక్షల వరకు ప్రచురించి పంపిణీ చేసినట్లు ఆయన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షులు పృథ్వీరాజ్ తో పాటు మండల కాంగ్రెస్ అధ్యక్షులు సురేష్ కాంగ్రెస్ సీనియర్ నాయకులు రాములు రామేశ్వర్ సురేష్ రాజు రవి కృష్ణారెడ్డి కలియుముద్దీన్ ప్రభాకర్ మాజీ గ్రంథాలయ చైర్మన్ కొండల్ రెడ్డి టిఆర్ఎస్ నాయకులు అశోక్ శంకర్ అశోక్ బిజె ఆర్ సంఘం నాయకులు వికాస్ బాలేష్ రవీందర్ అంజయ్య తదితరులు పాల్గొన్నారు.



# పేదవారి పక్షాన పోరాడేదే కమ్యూనిస్టు పార్టీ జెండా

- కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు




**నారాయణఖేడ్, ఆగస్టు 03 (జనంసాక్షి) :** పేదవారి పక్షాన పోరాడేదే కమ్యూనిస్టు పార్టీ జెండా అని కొత్తగూడెం ఎమ్మెల్యే కునంనేని సాంబశివరావు అన్నారు. ఆదివారం నారాయణఖేడ్ పట్టణంలోని కింగ్స్ ప్యాలెస్ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం నిర్వహించిన సిపిఐ జిల్లా మహాసభ జిల్లా కార్యదర్శి సయ్యద్ జలాలుద్దీన్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కునంనేని సాంబశివరావు మాట్లాడుతూ.. రాష్ట్ర జాతీయ మహాసభలు మూడేళ్లకోసారి జరుపుకోవడం జరుగుతుందని, అందులో భాగంగా నాలుగవ జిల్లా మహాసభలు నిర్వహిస్తున్నామన్నారు. భారతదేశంలో కమ్యూనిస్టు పార్టీ అవసరాన్ని ప్రజలు గుర్తిస్తున్నారని అన్నారు. భారత కమ్యూనిస్టు పార్టీ స్థాపించి 100 సంవత్సరాలు పూర్తయినప్పటికీ ప్రజలు పార్టీని మరవడంలేదని తెలిపారు. ప్రజా ఉద్యమాలు కమ్యూనిస్టు పార్టీతోనే కొనసాగుతాయని తెలిపారు. నారాయణఖేడ్ ప్రాంత అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలని డిమాండ్ చేశారు. నిరుద్యోగం రూపుమాపేందుకు ఫ్యాక్టరీలు పెట్టాల్సిన అవసరం ఉందన్నారు. సాగుకు ఉపయోగపడేలా ప్రాజెక్టు కట్టి రైతాంగాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. బీసీ రిజర్వేషన్లను ఆమోదం తెలిపేలా రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రపతికి నివేదిక పంపడం జరిగిందన్నారు. దాన్ని రాష్ట్రపతి ఆమోదం చేయాల్సి ఉందని తెలిపారు. దీనికి బిజెపి స్వార్థం కోసం అడ్డుపడుతుందని విమర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్టు లో తప్పు చేసిన ఎంతటి పెద్దవారినైనా, వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇన్చార్జి ఈటి నరసింహ, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు మంద పవన్, రాష్ట్ర సభ్యులు ప్రకాష్ రావు జిల్లా సహాయ కార్యదర్శి ఆనంద్, కార్యవర్గ రెహమాన్, తాజోద్దీన్, దత్తు రెడ్డి మెహబూబ్ ఖాన్, రుబీనా కౌన్సిల్ సభ్యులు చిరంజీవి పుప్పాల అశోక్, సిహెచ్ అశోక్, ఇసాక్, లింగం, సతీష్, ప్రేమ్ కుమార్ నియోజకవర్గ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# రెసిడెన్షియల్ పాఠశాలలు పరిశుభ్రంగా ఉంచాలి

- పరిశుభ్రం తోనే ఆరోగ్యం
- ప్రభుత్వం సూచించిన విధంగా మెనూ పాటించాలి
- వేడిగా ఉన్న పదార్థాలనే విద్యార్థులకు వడ్డించాలి
- నిర్వహణ అధికారులుకు, ఉపాధ్యాయులుకు సూచించిన కలెక్టర్



**మెదక్ జిల్లా బ్యూరో, ఆగస్టు 3 (జనంసాక్షి):** పరిశుభ్రత తోనే ఆరోగ్యం... రెసిడెన్షియల్ పాఠశాలలో పరిశుభ్రంగా ఉంచాలని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ సూచించారు. ఆదివారం కలెక్టర్ హవేలీ ఘన్పూర్ మండలం మహాత్మా జ్యోతిబా పూలే తెలంగాణ వెనుకబడిన తరగతుల బాలుర సంక్షేమ రెసిడెన్షియల్ పాఠశాల ఆయన ఆకస్మికంగా తనిఖీ నిర్వహణ తీరును పర్యవేక్షించారు. విద్యార్థులతో మాట్లాడారు. మెనూ బోర్డ్ ను పరిశీలిస్తూ భోజనం ఎలావుంది? మెనూ ప్రకారంగా పెడుతున్నారా? అని విద్యార్థినులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులందరు పాఠశాలలో ఉండాలని, 100 శాతం హాజరు నమోదు ఉండాలన్నారు. విద్యార్థులు క్రమశిక్షణతో లక్ష్యాలను నిర్ధేశించుకొని విద్యాపరంగా ప్రభుత్వం అందిస్తున్న వసతులను సద్వినియోగ పరచుకొని ఉత్తమ ఫలితాలు సాధించాలన్నారు. వంట శాలను సందర్శించి విద్యార్థుల కొరకు వండిన ఆహార పదార్థాలు పరిశీలించారు. స్టోర్ రూమ్ ను సందర్శించి నిల్వ చేసిన సరుకులను పరిశీలిస్తూ నాణ్యమైన సామగ్రిని తెప్పించుకోవాలన్నారు. తరగతి గదిలో విద్యార్థులకు పాఠాలు బోధించి సామర్థ్యాలను పరీక్షించి కలెక్టర్ సంతృప్తి వ్యక్తం చేశారు.చదువులో చక్కటి తెలివితేటలు,ఏదైనా సాధించగల సామర్థ్యం ఉన్న విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలో ఉన్నారని వారి సామర్థ్యాలకు పదును పెట్టి ఉత్తమ విద్యా బోధన అందించినట్లయితే భావి భారత పౌరులుగా గర్వించే ముందుకు పోతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# కాటికి పోవాలన్నా కష్టమే

- పాడే వెనుక పదిమంది రాని పరిస్థితి
- పంచాయితీ పరిధిలో లేదంటున్న అధికారులు
- హామీ మరిచిన మంత్రి



**కృష్ణ, ఆగస్టు 3 (జనంసాక్షి):** మక్తల్ నియోజకవర్గం కృష్ణ మండలం గుడేబల్లూర్ గ్రామంలో ప్రజల అవస్థలు వర్ణనాతీతం ప్రధానంగా చివరకు చనిపోయిన బొంద పెట్టేందుకు ఆపసోపాలు పడుతున్నారు. కాటికి వెళ్లేందుకు కష్టాలు పడుతున్నారు.చివరి చూపు చూసేందుకు పాడే వెంట పదిమంది రాని పరిస్థితులు నెలకొన్నాయి.స్మశానానికి వెల్లే రోడ్డు అధ్వాన్నంగా తయా రైంది ఎన్నో ఏళ్ల నుంచి, చనిపో యిన శవాన్ని బొంద పెట్టేందుకు వాగులో బురదలో రాళ్ళలో ఆపసో పాలు పడుతున్నారు.కడసారి చూపు ఇంటి దగ్గరే ముగుస్తున్నది. స్మశానం వరకు వెళదామంటే అవస్థలు పడా ల్సిందే.దాంతో పాడే వెంబడి పట్టు మని పదిమంది వెళ్ళలేక పోతు న్నారు.అయితే పంచాయితీకి క్రమం తప్పకుండా పన్నులు చెల్లి స్తున్నా కనీసం స్మశానానికి రోడ్డు సౌకర్యం కల్పించక పోవడం దారుణమని గ్రామస్తులు విమర్శి స్తున్నారు.రోడ్డు వేయాలని పంచా యితీ అధికారులను అడిగితే ఆరోడ్డు పంచాయితీ పరిధిలో లేదని ఇరిగేషన్ పరిధిలోకి వస్తుందని చెబుతున్నారు.ఇది వరకే ఉపాధి హామీ పథకంలో సిసి రోడ్డు వేయాలని తీర్మా నించడం జరిగిందనీ పంచాయితీ అధికారులు చెబుతున్నారు. కాగా ఎన్నికల ముందు తరువాత మంత్రి వాకిటి శ్రీహరి రోడ్డు వేస్తానని హామీ ఇచ్చి విధ్మరించారని విమర్శిస్తున్నారు .ప్రజల కష్టాలు దృష్టిలో ఉంచుకుని వెంటనే స్మశానానికి రోడ్డు సౌకర్యం కల్పించాలని కోరుతున్నారు.





# స్థానిక ఎన్నికలు ఇప్పటికీ డౌటే..!

- వీడని రిజర్వేషన్ల పీటముడి..?
- పార్టీల పరంగా 42శాతం టికెట్లే శరణ్యమా

**వనపర్తి, ఆగష్టు03 (జనంసాక్షి):** తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికలపై సందిగ్ధత కొనసాగుతోంది. సెప్టెంబర్ 30లోపు పూర్తి చేయమని రాష్ట్ర హైకోర్టు ఆదేశించింది.ఈ మేరకు జూలై చివరి నాటికి గ్రామ పంచాయతీలు మండల జిల్లా పరిషత్‌ల ఎన్నికలకు రిజర్వేషన్లను చేస్తారని సంబంధిత అధికారులు, రాజకీయ పక్షాలు భావించినప్పటికీ, ఆ ప్రక్రియ ఊసే లేకపోవడంతో ఆదిలోనే హంసపాదు దాపురించింది. బీసీల రిజర్వేషన్ల ఎంపికకు అడ్డంకులు నెలకొంటున్నందున స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు పడిన పీటముడి వీడడం లేదు. సీఎం రేవంత్ రెడ్డి తాను అనుకున్న దారిలో వెళ్తున్నారు. కానీ అడుగులు ముందుకు పడవని ఆయనకూ క్లారిటీ ఉంది. డెడ్ లైన్ దగ్గర పడుతున్నా .. అధికారికంగా రిజర్వేషన్లను ఖరారు చేయలేరు. పాత రిజర్వేషన్లతోనే అమలు చేయాల్సి ఉంది. దానికి సిద్ధపడితేనే ఎన్నికలు జరుగుతాయి.

**42 శాతం బీసీ రిజర్వేషన్లు సాధ్యం కాదు**

కామారెడ్డిలో బీసీ డిక్లరేషన్ ప్రకటించినప్పుడు బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇస్తామని రేవంత్ ప్రకటించారు. ఆయన ఈ హామీ విషయంలో నిజాయితీగానే ఉండి ఉండవచ్చు. కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే కులగణన చేసి, రిజర్వేషన్లపై పరిమితి ఎత్తేస్తామని రాహుల్ గాంధీ పదే పదే చెబుతున్నారు. అలాంటి సమయంలో కాంగ్రెస్ వస్తుందని రిజర్వేషన్లు ఇస్తానని రేవంత్ అనుకుని ఉంటారు. కానీ కేంద్రంలో కాంగ్రెస్ రాలేదు. ఇప్పుడు బీసీ రిజర్వేషన్లను తాత్కలి కంగా అయినా ఇవ్వడానికి ఆయన కష్టాలు పడాల్సివస్తోంది. ఎప్పుడో నిర్వహించాల్సిన స్థానిక ఎన్నికలు ఈరిజర్వేషన్ల కారణంగానే పడుతూ వస్తున్నాయి.బీసీల రిజర్వేషన్లకు సంబంధించిన ఆర్డినెన్సును జారీ చేసినప్పటికీ గవర్నర్ ఆమోదం ఎదురు చూస్తున్నారు.



**స్థానిక ఎన్నికలను నిర్వహించకపోతే సమస్యలు**

స్థానిక ఎన్నికలను నిర్వహించకపోతే ప్రభుత్వానికి సమస్యలు వస్తాయి. ఇలా రిజర్వేషన్లతో ముడి పెట్టుకోవడం వల్ల ఆ ఎన్నికలు నిర్వహించడం కత్తి మీద సాములా మారింది. చివరికి హైకోర్టు మూడు నెలల గడువు ఇచ్చింది. వెంటనే రిజర్వేషన్లను ఖరారు చేయాలి. అలా చేయాలంటే గవర్నర్‌కు పంపిన ఆర్డినెన్స్ పై సంతకం చేయాలి. ఆ ఆర్డినెన్స్ కు రాజ్యాంగ అర్హత లేదని ఎక్కువ మంది నిపుణులు చెబుతున్నారు. రేవంత్ పై బీజేపీకి ఏమైనా సాఫ్ట్ కార్నర్ ఉంటే, ఆర్డినెన్స్ పై గవర్నర్ సంతకం పెట్టవచ్చు. వెంటనే స్థానిక ఎన్నికల నోటిఫికేషన్ రిలీజ్ చేయవచ్చు. కానీ కోర్టుల్లో పడితే మాత్రం మళ్లీ సమస్యలు వస్తాయి.

**రాజకీయ రిజర్వేషన్లతో నిర్వహించడమే మార్గం**

బీసీలకు 42 శాతం రిజర్వేషన్లకు చట్టపరంగా ప్రాసెస్ కు సమయం పడుతుంది.. కాబట్టి స్థానిక ఎన్నికలను అనధికారిక రాజకీయ రిజర్వేషన్లతో నిర్వహించాలని రేవంత్ భావించవచ్చు. అది ఒక్కటే మార్గం ఉంది. అనధికారిక రాజకీయ రిజర్వేషన్లు అంటే.. పార్టీ పరంగా బీసీలకు 42 శాతం అవకాశాలు కల్పించడం. నియోజకవర్గాలను యూనిట్ గా తీసుకుని 42 శాతం బీసీలకు టిక్కెట్లు ఇస్తే.. అవకాశాలు కల్పించినట్లే. ఇతర పార్టీలు అలా చేస్తాయా లేదా అన్నది పక్కన పెడితే విమర్శలను కొంత మేర ఎదుర్కోవచ్చు. రేవంత్ ముందు ఉన్న మార్గం ఇదొక్కటే. ఎన్నికలు సజావుగా జరగాలంటే. ఇలా ముందుకెళ్లాలి. ఇతర మార్గాల్లో వెళ్తే న్యాయపరమైన చిక్కుల్లో పడతాయి.

# మార్కెట్ ధర కనుగుణంగా పరిహారం అందివ్వాలి

- 14 లక్షల రూపాయలు ఆమోదయోగ్యం కాదు
- ప్రభుత్వం మొండి వైఖరితో ఉంటే ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తాం
- నారాయణపేట కొడంగల్ ఎత్తిపోతల భూనిర్వాసితుల రాస్తారోకో

**నారాయణపేట జిల్లా బ్యూరో (జనంసాక్షి):** నారాయణపేట కొడంగల్ ఎత్తిపో తల పథకం భూనిర్వాసితులకు బహిరంగ మార్కెట్ ధర కనుగుణంగా పరి హారం అందివ్వాలని కోరుతూ నారాయణపేట జిల్లా కేంద్రంలోని ఆదివారం గంటపాటు రాస్తారోకో నిర్వహించారు. ఈ రాస్తారోకోలో భూ నిర్వాసితుల సంఘం గౌరవ అధ్యక్షులు వెంకట్రామిరెడ్డి మాట్లాడుతూ గత 20 రోజులుగా భూనిర్వాసితులు జిల్లా కేంద్రంలో రీలే దీక్షలు చేస్తున్న జిల్లా కలెక్టరేట్ ముట్టడి చేసిన ప్రభుత్వం మొండిగా వ్యవహరిస్తున్నాదని భూనిర్వాసితుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నదని విమర్శించారు. ప్రభుత్వం ఇట్లానే మొండి వైఖరితో ఉంటే భవిష్యత్తులో భూ నిర్వాసితులు ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తారని హెచ్చరించారు. ప్రభుత్వం ఇస్తామన్న ఎకరంకు పరిహారము 14 లక్షల రూపా యలు ఆమోదయోగ్యం కాదని ఆ డబ్బుతో మరో వంక భూమి కొనే పరిస్థితి లేదని అన్నారు.ప్రాజెక్టులకు భూములు ఇస్తున్న భూని ర్వాసితులకు అన్యాయం చేయొద్దని హితవు పలికారు. ప్రాజెక్టు కోసం తమ భూములను అప్పగిస్తున్న రైతులను కన్నీళ్లకు గురి చేయవద్దని వారిని శాశ్వత వలసదా రులుగా తయారు చేయొద్దని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు .మార్కెట్ ధర నిర్ణయిం చెందుకు న్యాయ కమిషన్ ఏర్పాటు చేయాలని బేసిక్ ధర ప్రకారం 2013 షేకరన చట్టాన్ని అమలు చేసి భూ నిర్వాసితులను ఆదుకోవాలని కోరారు. సిఐటియు జిల్లా కార్యదర్శి బండమీది బాల్ రామ్ మాట్లాడుతూ అన్ని విధాలుగా వెనుక బడి గురైన నారాయణపేట ప్రాంతానికి నారాయ ణపేట కొడం గల్ ఎత్తిపోతల పథకం మంచి దేనని అయితే అదే స్థాయిలో భూనిర్వశితులకు కూడా ప్రభుత్వం ప్రాధాన్య ఇవ్వాలని భూ నిర్వాసితులను ప్రభుత్వం తన హృదయంలో పెట్టుకొని పూర్తి స్థాయిలో సాయం అంది వ్వాలని, అందు కు బహిరంగ మార్కెట్ ధరకు అనుగుణంగా వారికి పరిహారం అందించే విధంగా ప్రభు త్వ చర్యలు ఉండాలని డిమాండ్ చేశారు. ఈ రాస్తారోకో కార్యక్ర మంలో భూ నిర్వాసితుల సంఘం పేరపల్ల గ్రామ నాయకులు నాయకులు ఆంజనేయులు, సింగారం భూని ర్వసితుల గ్రామ నాయకులు హనుమంతు భూ నిర్వాసితుల సంఘం నాయకులు సత్య నారాయణ గౌడ్, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర నాయకులు నరహరి జిల్లా అధ్యక్ష కార్యదర్శి భాను, పవన్ పాల్గొ న్నారు.ఈ రాస్తారోకో బందోబస్తుగా నారాయ ణపేట మండల రూరల్ ఎస్సై రాముడు, నారాయణపేట పట్టణ ఏఎస్ఐలు ఆంజ నేయులు అంజిలయ్య పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



# రజకులను ఎస్సీ జాబితాలో చేర్చండి

- ఎన్.డి.ఆర్.ఎస్ జాతీయ శ్రీనివాస్

**జడ్చర్ల, ఆగస్టు 3 (జనంసాక్షి):** కులవృత్తిపై ఆధార పడి జీవిస్తున్న రజకులను ఎస్సీ జాబితాలో చేర్చాల ని నేషనల్ ధోబి రిజర్వేషన్ సంగ్ జాతీయ కన్వీనర్ నడిమింటి శ్రీనివాస్ కేంద్ర మంత్రి గంగా పురం కిషన్ రెడ్డిని కోరారు. కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి గంగా పురం కిషన్ రెడ్డిని హైదరాబాదులో ఆయన నివాసంలో ఆదివారం మర్యాదపూ ర్వకంగా కలిసిన నేషనల్ దోబి రిజర్వే షన్ సంగ్ జాతీయ కన్వీనర్ నడిమింటి శ్రీనివాస్ శాలువాతో ఘనంగా సన్మానించి మాట్లాడుతూ కులవృత్తిపై ఆధారపడి జీవిస్తున్న రజకులను ఎస్సీ జాబితాలో చేర్చాలని, వృత్తి ఒకటే అయినా కొన్ని రాష్ట్రాలలో దోబీలకు భిన్న రిజర్వేషన్లు ఉండడం వలన ఆర్థిక, రాజకీయ, సామాజిక అసమానతలు తలెత్తుతున్నాయని, అందుకు రజకులను ఎస్సీ జాబితాలో చేర్చాలని కోర డంతో కేంద్రమంత్రి కిషన్ రెడ్డి రజకులను ఎస్సీ జాబితాలో చేర్చే అంశంపై కేంద్ర ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి ఎస్సీ జాబితాలో చేర్చేందుకు తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షులు గోపి రజక, రాష్ట్ర అధికార ప్రతినిధి ముత్యాల నర్సింగ రావు, కలకుంట బ్రహ్మయ్య పాల్గొన్నారు.



# కేంద్ర ప్రభుత్వం పథకాలు క్షేత్రస్థాయికి చేర్చాలి

- బిజెపి రాష్ట్ర సీనియర్ నేత నాగురావు నామాజీ పిలుపు

**నారాయణపేట జిల్లా ప్రతినిధి (జనంసాక్షి):** కేంద్రంలో ప్రధాని నరేంద్రమోడీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అట్ట డుగు స్థాయి ప్రజలకు చేర్చాలని బిజెపి రాష్ట్ర సీనియర్ నేత నాగురావు నామాజీ పిలుపునిచ్చారు. ఆదివారం మద్దూరు మండలం రెనివట్ల గ్రామంలో జిల్లా బిజెపి ఉపాధ్యక్షుడు మదన్ తో కలిసి గావ్ చలో ఘర్ చలో కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూప్రధాని నరేంద్ర మోడీ 11 ఏళ్ల పాలన సాధిం చిన అభివృద్ధిని ప్రజ ల్లోకి విస్తృతంగా తీసుకెళ్ళి రాష్ట్రంలో ఏ ఎన్నికలు వచ్చి నా బిజెపి గెలుపే లక్ష్యంగా ప్రతి కార్యకర్త పని చేయాలని అన్నారు.ఈ రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వ వైఫ ల్యాలను ఎండ గట్టి ఏ ఎన్నిక అయినా బిజె పి గెలుపు కోసం ప్రతి కార్యకర్త సైనికుల్లా పని చేయాలనీ అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం గ్యారెంటీల గారడితో 6 అబద్ధాలు 66 మోసాలతో అధికా రంలోకివచ్చిం దన్నారు.రైతు రుణ మాఫీ పూర్తి కాలేదు, ఏడాది అయినా రైతు బరోసా పూర్తిగా లేదని,మహా లక్ష్మి పేరుతో మహిళలను మోసం చేశారని అన్నారు. అలాగే గృహజ్యోతి తో మహిళలను మోసం చేశార ని,వృద్దులకు చేయూత అందించలేద ని,యువత వికాసం మరిచార ని సొంతిల్లు కలగానే మిగిలి పోయిందని కార్యకర్తలకే ఇళ్లు మంజూరు అవుతున్నాయని విమర్శిం చారు.అన్ని వర్గాల ప్రజలు రోడ్డున పడ్డారనీ అన్నారు.బి ఆర్ ఎస్,కాంగ్రెస్ దోచుకోవడంలో ఆ రెండు పార్టీలు ఒక్కటేనని, అంతే కాకుండా పదేళ్లు బిఆర్ఎస్ కే.ట్యాక్స్ ఇప్పుడు కాంగ్రెస్ ఆర్ఆర్ ట్యాక్స్లుల్లిస్తున్నదనీవిమర్శిం చారు.అలాగేప్రజాస్వామ్యాన్ని పాతర వేశారని ప్రజలు వీరి పాలనలో భూమి, ఇళ్లు కోల్పోయారని.రాష్ట్రాన్ని అప్పుల కుప్పలు చేశారని ఆడబిడ్డలు ఆక్రంద నలు చెందుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.అలాగే కేంద్ర ప్రభుత్వం సబ్ కావికాస్,సబ్ కా విశ్వాస్ నినాదంతో చేపట్టి న సంక్షేమ పథకాల ను,వక్ఫ్ బోర్డు రద్దుతో ముస్లింలకు ఏమి నష్టం లేద న్న విషయా న్ని ప్రజలకు వివరించాలని బిజెపి గెలుపుకు పట్టుదలతో కృషి చేయాలని అన్నారు. ఆపరేషన్ సిందూరతో ప్రధాని నరేంద్రమోడీ పాకిస్తాన్‌కు బుద్ధి చెప్పడమే కాకుండా ప్రపంచ దేశాల్లో ఏకాకిని చేశారని అన్నారు.కరోనా నాటి నుంచి పేదలు ఆకలితో అలమటి ంచే పరిస్తిని దూరం చేస్తూ ఉచి తంగా ప్రతి ఒక్కరికీ 5 కిలోల బియ్యం పంపిణీ చేస్తున్నా రని అన్నారు. అంతే కాకుండా అనేక రంగాల్లో అభివృద్ధినీ సాధించారని అన్నా రు.వాటిని ప్రజలకు వివరిస్తూ సంస్థగతంగా పార్టీ ని మరింత పటిష్టం చేయాల నికోరారు.ఈ కార్యక్రమంలో బిజెపి మండల పదాదికారులు,మండల అధ్యక్షులు పాల్గొన్నారు.



# చేనేత కార్మికులకు న్యాయం చేయాలి

**నారాయణపేట జిల్లా ప్రతినిధి (జనంసాక్షి):** నారాయణపేట జిల్లా కేంద్రంలో గాంధీనగర్ తాయమ్మ గుడిలో చేనేత కార్మికుల జనరల్ బాడీ మీటింగ్ నిర్వహించి,చేనేత కార్మికులకు న్యాయం చేయాలన్నారు.ఈ కార్యక్రమానికి సీపీఐ(ఎంఎల్) మాస్ లైన్ డివిజన్ కార్యదర్శి కె.కాశీనాథ్ , టియుసిఐ జిల్లా ఉపాధ్యక్షులు, బి. నర్సింహ, చేనేత కార్మిక సంఘం టియుసిఐ జిల్లా నాయకులు కెంచె నారాయణ, పాల్గొనివారు మాట్లాడుతూ నారాయణపేట పట్టణంలో చేనేత సహకార సంఘం 1951సం"రంలో ఏర్పడింది. అందులో దాదాపు 4265 మంది కార్మికులు ఉన్నరు. గాంధీనగర్ కాలనీకి చెందిన చేనేత కార్మిక సొసైటీ తరఫున వంద మందికి ఇండ్లు నిర్మించి, చేనేత పనిముట్లు ఇచ్చి కాలనీ నిర్మించారు. కార్మికుల దగ్గర నెలకు 5 రూపాయల చొప్పున ఒక్కొక్కరి దగ్గర దాదాపు 2475/- రూపాయలు వసూలు చేశారు. సొసైటీ, ప్రభుత్వం నిర్ణయించిన ధర మొత్తం గత 35 సంవత్సరాల కిందటనే సొసైటీకి ప్రభుత్వానికి లబ్ధిదారులు చెల్లించడం జరిగింది,అయినా నేటికి ప్రభుత్వం సొసైటీ ఇంటి యజమానులకు రిజిస్ట్రేషన్ చేయించకుండా ఇబ్బంది పెడుతున్నారు. ప్రభుత్వం , సొసైటీ ఇండ్ల పట్టాలను వెంటనే ఇప్పించాలని సిపిఐఎంఎల్ మాస్ లైన్ డివిజన్ కార్యదర్శి కాశీనాథ్ డిమాండ్ చేశారు.చేనేత మీనా ఆధారపడి జీవిస్తున్న కార్మికులను పేర్లను సొసైటీ నుండి తొలగించడం అన్యాయమన్నారు. ఇప్పుడున్న సహకార సంఘంలో 72 సభ్యులు మాత్రమే ఉన్నారు నారాయణపేట పట్టణంలో వందలాది మంది కార్మికులు చేనేత వృత్తిని నమ్ముకొని మొగ్గలు నేస్తున్న కార్మికులకు జౌళి శాఖ అధికారి ఎ.డి వెంటనే సహకార సంఘం సభ్యత్వాన్ని ఇవ్వాలని డిమాండ్ చేశారు లేని పక్షంలో చేనేత కార్మికులను కూడగట్టుకొని పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని అన్నారు.ఈ కార్యక్రమంలో సంఘ నరసింహులు, నాగేందర్, కమలాపూర్ మహేష్ , నందు, అంబదాస్ , వెంకట్రావు, ప్రవీణ్ శంకర్, నాగేందర్, మహాదేవ్, నర్సిరెడ్డి, బాలాజీ, రామకృష్ణ, నరేష్, రమేష్, అమర్, అనిల్, వరప్రసాద్ శ్రీకాంత్, అనంతమ్మ, లక్ష్మి, సచిన్, నవీన్, నిఖిల్, నరేష్, రాకేష్, శ్రీధర్, గణేష్, జైపాల్, పాల్గొన్నారు



# సీఎం హామీ మేరకు డిసెంబర్ 9లోగా పూర్తి పరిహారం

- జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి
- ఉదండాపూర్ నిర్వాసితులకు ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి భరోసా

**జడ్చర్ల, ఆగస్టు 3 (జనంసాక్షి) :** ఉదండాపూర్ భూ నిర్వాసితులకు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హామీ మేరకు డిసెంబర్ 9వ తేదీలోగా పూర్తిగా ఆర్అండ్ఆర్ ప్యాకేజీ పరిహారం చెల్లిస్తామని జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుద్ రెడ్డి నిర్వాసితులకు భరోసానిచ్చారు. పాలమూరు, రంగారెడ్డి ప్రాజెక్టులో భాగంగా నిర్మించిన ఉదండాపూర్ రిజర్వాయర్ నిర్వాసితులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచన మేరకు ఆదివారం ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి తన సొంత ఖర్చులతో సామూహిక భోజనాలను ఏర్పాటు చేశారు. ప్రాజెక్టులో భాగమైన వల్లూరు గ్రామం వద్ద నిర్వాసితులతో కలిసి ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి సహపంక్తి భోజనం చేశారు. ముందుగా ఎమ్మెల్యే వారికి స్వయంగా అన్నం వడ్డించి వారితో కలిసి భోజనం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మీరు పుట్టి పెరిగిన ఊర్లను, ఇండ్లను, భూములను కోల్పోతే ఎంత బాధ ఉంటుందో నాకు తెలుసు అని, మీ త్యాగంతో ఈ ప్రాంతాన్ని సస్యశ్యామలం చేశారని, మీ త్యాగం వెలకట్టలేనిదని, మీతో కలిసి భోజనాలు చేయడంనా అదృష్టంగా భావిస్తున్నానని అన్నారు. ఆర్అండ్ఆర్ ప్యాకేజీ పరిహారం రూ. 25 లక్షల వరకు పెంపు విషయం ప్రభుత్వ పరిశీలనలో ఉందని, సీఎం ఇచ్చిన హామీ మేరకు డిసెంబర్ 9వ తేదీలోపు పూర్తి ప్యాకేజీ చెల్లింపులు చేస్తామని అన్నారు. లక్షల మంది రైతుల బాగు కోసం ఉదండాపూర్ నిర్వాసితులు చేసిన త్యాగం అమూల్యమైనదని, వారి కోసం చివరి వరకు అండగా నిలబడతానని, వారికి ఎటువంటి సమస్యలు వచ్చినా అండగా ఉంటానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.



రాష్ట్ర ప్రభుత్వం ఆర్అండ్ఆర్ ప్యాకేజీ రూ. 175 కోట్లు విడుదల చేసిన శుభ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క, ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ధన్యవాదాలు తెలుపుతూ వారి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఉదండాపూర్ నిర్వాసితులు తమకు అండగా నిలిచిన ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డిని గజమాలతో ఘనంగా సత్కరించారు కార్యక్రమంలో నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# సామాన్య ప్రజలకు అందని ద్రాక్షల విద్య, వైద్యం

- సమాజంలో దోపిడీ అణచివేత పోవాలంటే ఎర్రజెండా రావాలి
- మోదీ పాలనలో అప్రజాస్వామిక విధానాలు
- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు చుక్క రాములు

**సంగారెడ్డి ప్రతినిధి, ఆగస్టు 3(జనంసాక్షి):** దేశంలో సామాన్య ప్రజలకు అందని ద్రాక్షల విద్య, వైద్యం ఉందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు చుక్క రాములు అన్నారు. ఆదివారం సీపీఎం జిల్లా స్థాయి విస్తృత స్థాయి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సీపీఎం కార్యాలయం వద్ద జెండ విష్కరణ చేయడం జరిగింది. ఈ సందర్భంగా చుక్క రాములు మాట్లాడుతూ.. విద్య వైద్యం సామాన్య ప్రజలకు అందని ద్రాక్షల మిగిలిపోతున్నాయనీ అవేదన వ్యక్తం చేశారు. ప్రపంచమంతా శాస్త్రీయంగా అభివృద్ధి చెందుతుంటే మన దేశంలో మాత్రం బిజెపి మూఢాచారాల కు పెద్దపీట వేస్తోందన్నారు. సమాజంలో సామాజిక అసమానతలు, మహిళలపై దాడులు రోజురోజుకు పెరుగుతున్నాయని అన్నారు. సోషలిస్టు దేశాలలో మార్క్సిజం ఆధారంగా ఆకలి, దారిద్రం, దోపిడీ, అణిచివేత లేకుండా వారికి విద్య, ఉద్యోగ, ఉపాధి, రంగాలలో మిగతా దేశాల కన్నా సోషలిస్టు దేశాలలో మంచి పరిపాలన అందుతుందన్నారు. మహిళల హక్కులు పూర్తిగా రక్షించబడుతున్నాయని పేర్కొన్నారు. దేశంలో బిజెపి అధికారంలోకి వచ్చాక కులాల పేరిట, మతాల పేరిట విద్వేషాలు పెరిగిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. కార్మికులు పోరాడి సాధించుకున్న చట్టాలను నాలుగు కోడ్స్‌గా కుదించి కార్పొరేట్లకు, యాజమాన్య వర్గాలకు వత్తాసు పలికే విధంగా పరిపాలన సాగిస్తున్నారని మండిపడ్డారు.రాష్ట్రంలో ప్రజాప్రభుత్వం అంటున్న కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను పూర్తిస్తాయిలో అమలు చేయడంలో ఊగిసలాడుతుందన్నారు. ఈ ప్రభుత్వంలో కూడా అభివృద్ధి పేర పేదల భూములు బలవంతంగా గుంజు కుంటున్నారని విమర్శించారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం భవిష్యత్తులో పోరాటాల్లోకి రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజు, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మల్లేశం, జిల్లా కమిటీ సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.



# విశ్వశాంతి కోసం పాదయాత్ర

- 18వ వీరశైవ లింగాయత్ సమాజం పాదయాత్రను ప్రారంభించిన ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

**పటాన్చెరు ఆగస్టు 03 (జనంసాక్షి) :** విశ్వశాంతి కోసం వీరశైవ సమాజం ఆధ్వర్యంలో పటాన్చెరు నుండి బొంతపల్లి వీరభద్ర స్వామి దేవస్థానం వరకు ప్రతి సంవత్సరం పాదయాత్ర చేపట్టడం అభినందనీయమని పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. పటాన్చెరు వీరశైవ సమాజం ఆధ్వర్యంలో పటాన్చెరు పట్టణంలోని ఉమామహేశ్వర దేవాలయం నుండి బొంతపల్లి వీరభద్ర స్వామి దేవాలయం వరకు చేపట్టిన 18వ మహా పాదయాత్రను ఆదివారం ఉదయం పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే జిఎంఆర్ మాట్లాడుతూ 12వ శతాబ్దంలో అభ్యుదయ సమాజం కోసం కృషి చేసిన గొప్ప సంఘసంస్కర్త మహాత్మా బసవే శ్వరుడి స్ఫూర్తితో సేవా కార్యక్రమాలు చేపట్టడం సంతోష కరమన్నారు. 18 సంవత్స రాలుగా ఏకధాటిగా పాదయాత్ర చేపట్టడం అభినందనీయమన్నారు. నియోజకవర్గంలోని వీరశైవుల అభివృద్ధికి సంపూర్ణ సహకారం అందిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రామచంద్రపురం కార్పోరేటర్ పుష్ప నగేష్, సమాజం ప్రతినిధులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.



# జర్నలిస్ట్ కోల నాగేశ్వరరావుకు "తెలంగాణ ఐకాన్" అవార్డు ప్రధానం

**హుజూర్ నగర్, ఆగస్టు 3 (జనంసాక్షి):** హుజూర్ నగర్ ప్రాంతంలో రెండున్నర దశాబ్దాలుగా జర్నలిజంలో విశేష సేవలు అందించడమే కాకుండా సమాజ హితం కోసం నిరంతరం పనిచేస్తున్న సూర్యాపేట జిల్లా టియుడబ్ల్యూజె ఐజెయు యూనియన్ జిల్లా అధ్యక్షులు, సీనియర్ జర్నలిస్ట్ కోలా నాగేశ్వరరావుకి తెలంగాణ తల్లి ఐకాన్ అవార్డు ప్రధానం చేశారు. శనివారం రాత్రి హైదరాబాదులోని రవీంద్రభారతిలో తెలంగాణ సాంస్కృతిక శాఖ, సావిత్రిబాయి పూలే ఫౌండేషన్ ఆధ్వర్యంలో భారతదేశ స్వతంత్ర దినోత్సవ సంబరాలు సందర్భంగా కవి సమ్మేళనం నిర్వహించగా అనంతరం జరిగిన అవార్డుల ప్రధానోత్సవంలో కోలా నాగేశ్వరరావుకి తెలంగాణ తల్లి ఐకాన్ అవార్డును శాసనమండలి ప్రతిపక్ష నేత మాజీ స్పీకర్ మధుసూదనా చారి చేతులమీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు ప్రభుత్వానికి వారధిగా ఉంటూ ప్రభుత్వ పథకాలు పేదలకు అందిం చడంలో పత్రికల పాత్ర ఎంతో కీలకంగా ఉంటుందని అన్నారు. జర్నలిస్టులు సమాజ హితం కోసం పనిచేస్తున్నారని అభినందించారు. అట్టడుగు వర్గాల అభివృద్ధికి చేయూత అందించాలని పిలుపునిచ్చారు. గ్రామీణ ప్రాంతాల్లో జర్నలిస్టుల సంక్షేమానికి ప్రభుత్వాలు దృష్టి పెట్టాలన్నారు. ప్రభుత్వాలు జర్నలిస్టులకు భద్రత కల్పించాలన్నారు. జర్నలిస్టులకు ప్రభుత్వ పథకాలు ప్రత్యే కంగా మంజూరు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పూలే ఫౌండేషన్ చైర్మన్ బోయ గోపి, విన్నపం ఒక పోరాటం స్వచ్ఛంద సంస్థ అధ్యక్షురాలు లీలా వతి, బీసీ సంఘం నాయకులు ఉప్పు సత్యనారాయణ, పాల్గొన్నారు.



# భూ కబ్జాదారులపై ముస్లిం సంఘాల ఉక్కుపాదం

- 93 ఏళ్ల కురు వృద్ధుడు యూసఫ్ ఖాన్ ధర్నా



**మహబూబాబాద్ బ్యూరో, ఆగస్టు 03(జనం సాక్షి):** తమ భూమిని ఆక్రమించుకొని ఇబ్బందులకు గురిచేస్తున్న భూ కబ్జాదారుల ఆగడాలను భరించలేక ఈ నెల 12వ తేదీన స్థానిక తహసిల్దార్ ఆఫీస్ వద్ద యూసుఫ్ ఖాన్ అనే 93 ఏళ్ల కురు వృద్ధుడు ధర్నాకు సిద్ధమవుతున్నారు. ఈ సందర్భంగా మహబూబాబాద్ పట్టణానికి చెందిన ముస్లింలు స్థానిక ఈద్గాలో పత్రిక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో యూసుఫ్ ఖాన్ కుటుంబ సభ్యులతో పాటు వివిధ పార్టీలకు, వివిధ కమిటీలకు చెందిన ముస్లింలు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా యూసుఫ్ ఖాన్ కుమారుడైన అహ్మద్ ఖాన్ మాట్లాడుతూ, జులై నెల 12వ తేదీన మండల సర్వేయర్ సర్వే ప్రకారం మా హద్దులకు మేము రాళ్లు పాతుకోగా కబ్జాదారులు తొలగించడం జరిగింది. ఈ విషయమై టౌన్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసిన కూడా పోలీసులు నిర్లక్ష్యంతో ఉన్నారు. పోలీసుల నిర్లక్ష్యంతో మరింతగా పోయిన కబ్జాదారులు ఆ భూమిలోకి వస్తే మిమ్మల్ని చంపేస్తామని, భూమిలోకి రానివ్వడం లేదని వారి ఆగడాలకు విసిగిపోయిన తన తండ్రి 93 ఏళ్ల యూసుఫ్ అలీ ఖాన్ స్థానిక తహసిల్దార్ ఆఫీస్ ముందు ధర్నాకు సిద్ధమవుతున్నారని అన్నారు. కంకర్ బోడు మసీద్ కు చెందిన మసీద్ ప్రెసిడెంట్ మహమ్మద్ అదిల్ మాట్లాడుతూ- ముస్లింలపై దౌర్జన్యాలు చేయడం మంచి పద్ధతి కాదని, ఇప్పటికైనా భూకబ్జాదారులు తమ వైఖరి మార్చుకోవాలని, ఇది ఒక కుటుంబ సమస్య కాదని, మహబూబాబాద్ లోని ప్రతి ముస్లిం సమస్య అని ఈ సమస్యను కలిసికట్టుగా ఎదుర్కొంటామని అన్నారు. ఇస్లేహా మాషిర కమిటీ మహబూబాబాద్ అధ్యక్షులు ఎండి ఇక్బాల్ మాట్లాడుతూ చాలా తేలికగా పరిష్కారం అయ్యే సమస్యను భూకబ్జాదారులు జటిలం చేసుకుంటున్నారని, యూసుఫ్ ఖాన్ కుటుంబం ఎలా సర్వే చేసుకున్నారో, పక్క వారు కూడా తమ తమ భూములకు సర్వే నిర్వహించుకోవడం ద్వారా సమస్య పరిష్కారం అవుతుందని, మహబూబాబాద్ కు చెందిన రెవెన్యూ అధికారులు, పోలీసు అధికారులు, స్థానిక ఎమ్మెల్యే చొరవ తీసుకొని పక్క వారి భూమి కూడా సర్వే చేయడం వల్ల ఈ సమస్య అతి తేలికగా పరిష్కారం అవుతుందని, సంబంధిత అధికారులు, స్థానిక ఎమ్మెల్యే ఈ విషయమై సానుకూలంగా స్పందించి సమస్యను త్వరగా పరిష్కారం చేయాలని, యూసుఫ్ అలీఖాన్ ధర్నా చేయకముందే సమస్య పరిష్కారమైతే అందరికీ బాగుంటుందని, 93 ఏళ్ల కురు వృద్ధుడు తన హక్కుల కోసం ధర్నా చేయడం ముస్లిం సమాజానికి, ప్రభుత్వానికి మంచిది కాదని సూచించారు. ఈ కార్యక్రమంలో ఇస్మాయిల్ నాయక్, సయ్యద్ సాదిక్, నిజాం, మక్బూల్, నజీర్, అబ్దుల్ కలీం, యాఖుబ్ పాషా, ముజాఫర్, జియా, ఇంతియాజ్ ఖాన్, మహమ్మద్ అలీఖాన్, అలీమ్, ఫజల్, అన్వర్, ఫెరోజ్, అజీజ్, అజీమ్, సఫర్ తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ అంటేనే కార్యకర్తల పార్టీ

- టిఎస్ ఈజీసీ సభ్యులుగా చల్ల నియామకం
- మంత్రి సీతక్కకు కృతజ్ఞతలు తెలిపిన రాష్ట్ర రూరల్ డెవలప్మెంట్ డైరెక్టర్ చల్ల నారాయణరెడ్డి.



**కొత్తగూడ ఆగస్టు 3 (జనంసాక్షి) :** ములుగు అసెంబ్లీ మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ మండల కేంద్రం సాదిరెడ్డిపల్లికి చెందిన చల్ల నారాయణరెడ్డి గత 40 ఏళ్లుగా కాంగ్రెస్ పార్టీ కార్యకర్తగా డైరెక్టర్ గా చైర్మన్ గా పార్టీ బాధ్యతలు చేపట్టి రాష్ట్ర నాయకుడిగా ఎదిగారు.ఎన్నో కష్టాలను చవి చూసిన వారు ఆనాడు ఏజెన్సీ ప్రాంతంలో నిర్బంధంలో అన్ని సమస్యలకు తట్టుకొని కాంగ్రెస్ జెండా మోస్తూ కార్యకర్తలకు అండగా ఉన్నారు.వారి యొక్క పార్టీ సేవలను గుర్తించి తెలంగాణ రాష్ట్ర మంత్రివర్యులు డాక్టర్ దనసరి అనసూయ సీతక్క, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు నూతనంగా రాష్ట్ర రూరల్ డెవలప్మెంట్ డైరెక్టర్ తెలంగాణ గా అధికారికంగా నియమకం చేశారు.చల్ల నారాయణరెడ్డి మాట్లాడుతూ కార్యకర్తలు సమన్వయంతో పని చేయాలి.కష్టపడిన వారికి పదవులు తప్పకుండా వస్తాయి.దానికి నేనే నిదర్శనం నాపై నమ్మకంతో నాకు ఇంత ఉన్నతమైన స్థానాన్ని గౌరవాన్ని ఇచ్చిన మా అక్క సీతక్కకు ఎన్ని జన్మలెత్తిన వారి రుణం తీర్చుకోలేము వారి అడుగుజాడల్లో నడుచుకుంటూ ప్రజలకు నిస్వార్థ సేవ చేస్తానని అన్నారు.అదేవిదంగా నా పదవికి సహకరించిన ములుగు మహబూబాబాద్ జిల్లా అధ్యక్షులు అన్ని మండలాల అధ్యక్షులు మండల నాయకులకు పార్టీ కార్యకర్తలకు ఎల్లప్పుడూ రుణపడి ఉంటానని అన్నారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు వజ్జ సారయ్య,కొత్తగూడ బ్లాక్ అధ్యక్షులు సుంకరబోయిన మొగిలి.కాంగ్రెస్ పార్టీ సీనియర్ జిల్లా నాయకులు లావణ్య వెంకన్న.కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి మాజీ ఎంపీపీ కొత్తగూడ బానోత్ విజయ రూఫ్ సింగ్.మాజీ జెడ్పిటిసి కొత్తగూడ పులుసం పుష్పలత శ్రీనివాస్.కొత్తగూడ మాజీ వైస్ ఎంపీపీ కాడబోయిన జంపయ్య, మండల ప్రధాన కార్యదర్శి బిట్ల శ్రీనివాస్, సొసైటీ డైరెక్టర్ బోనగిరి యాకయ్య, మండల అధికార ప్రతినిధి ఇర్ప రాజేశ్వర్.నర్సంపేట మార్కెట్ కమిటీ డైరెక్టర్ బొల్లు రమేష్ యాదవ్, కాంగ్రెస్ పార్టీ జిల్లా యూత్ నాయకులు, నోముల ప్రశాంత్ యాదవ్, జిల్లా ఓబీసీ నాయకులు వల్లపు రంజిత్, కొత్తగూడ ఎస్టీ సెల్ మండల అధ్యక్షులు బోడ ఈరియా నాయక్, కొత్తగూడ ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు కే దాసు ప్రసాద్, మండల నాయకులు గుంటుక రమేష్ , శ్రీను, కొత్తగూడ బ్లాక్ ప్రధాన కార్యదర్శి కే ఉపేంద్ర చారి, కొత్తగూడ టౌన్ అధ్యక్షులు గుమ్మడి సమ్మయ్య, మాజీ సర్పంచ్ మల్లెల రణధీర్. కొత్తగూడ టౌన్ ఉపాధ్యక్షులు వెలుదంటి వేణు.కొత్తగూడ టౌన్ ప్రధాన కార్యదర్శి యాకూబ్ పాషా పాల్గొన్నారు.



# కాళేశ్వరంలో శ్రావణ మాసం సందడి

**కాళేశ్వరం, ఆగస్టు 03 (జనంసాక్షి) :** భూపాలపల్లి జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రం కాళేశ్వరం లో శ్రావణమాసం ఆదివారం సందర్భంగా భక్తుల సందడి నెలకొంది. ఆదివారం సెలవు రోజు కావడంతో కాళేశ్వరం పుణ్యక్షేత్రాన్ని భక్తులు అధిక సంఖ్యలో దర్శించి తరించారు. ఉదయాన్నే గోదావరిలో స్నానం ఆచరించి కాళేశ్వర ముక్తేశ్వర ఆలయంలో అభిషేకాలు కుంకుమ పూజలు నిర్వహించారు. గోదావరి వద్ద భక్తుల సందడి అధికంగా ఉండడంతో గోదావరి నుంచి ఆలయం వరకు వాహనాల రద్దీ నెలకొంది. ఆటు దర్శనాలకు ఇటు పితృ కార్యక్రమాలకు భక్తులు తరలి రావడంతో గ్రామంలో ఎటు చూసినా వాహనాల రద్దీ భక్తుల సందడి నెలకొంది. స్థానిక ఎస్సై తమాషా రెడ్డి వాహనాలను క్రమబద్ధీకరిస్తూ గోదావరి వద్ద భక్తులకు ఇబ్బందులు కలవకుండా భద్రత ఏర్పాట్లు చేపట్టారు. ఆలయ అధికారులు ఆలయంలో భక్తుల రద్దీకి అనుగుణంగా ఏర్పాట్లు చేశారు.

# ఏటూరు నాగారంలో అక్రమ ఇసుక రవాణాను పట్టుకున్న పోలీసులు




**ఏటూరునాగారం, ఆగస్టు 03(జనంసాక్షి) :** అక్రమ ఇసుక రవాణా గురించి నమ్మదగిన సమాచారం మేరకు ఫారెస్ట్ చెక్ పోస్ట్ నందు పోలీసులు ఉండగా, జంపన్న వాగు నుంచి ఇసుక అక్రమంగా రాత్రివేళల కూలీల ద్వారా డీసీఎం లోకి ఎక్కించి తరలిస్తున్న డీసీఎం వాహనాన్ని పట్టుకున్నారు. వాహన డ్రైవర్ ఎండీ జహీర్ తండ్రి వహీద్ ఏటూరు నాగారం మరియు అతని బంధు అయినా సద్దాం హుస్సేన్ తో కలిసి హనుమకొండ కు తరలించి గత కొంతకాలంగా లాభాలు గడుస్తున్నారని వే బ్రిడ్జి ద్వారా తూకం వేసి డీసీఎం లో 14 టన్నులు ఇసుక దాని విలువ సుమారు 6000 రూపాయలు ఉంటుంది కేసు నమోదు చేశామని ఏటూరునాగారం ఎస్సై రాజ్ కుమార్ తెలిపారు. అక్రమార్కుల గురించి సమాచారం ఇవ్వాల్సిందిగా ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో పిఎస్ఐ నరేష్ ఆర్ఎస్ఐ అన్వేష్, కార్తీక్ పిసి అజయ్, విక్రమ్, హరీష్, ధ్రువ, గోపి, పాల్గొన్నారు.

# మద్యం మత్తులో భార్యను హత్య చేసిన భర్త



**జైపూర్ ఆగస్టు 3 (జనంసాక్షి) :** మద్యానికి బానిసై భార్యను డబ్బుల కోసం వేధించడంతో పాటు డబ్బులు ఇవ్వక పోవడంతో అర్ధరాత్రి కర్రతో భార్యపై దాడి చేయడంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. పూర్తి వివరాల్లోకెళ్తే మంచిర్యాల జిల్లా జైపూర్ మండలం మిట్టపల్లి గ్రామానికి చెందిన గోదారి రాజమణి, రాజయ్య భార్యాభర్తలు . రాజయ్య సింగరేణి రిటైర్డ్ ఉద్యోగి, రాజమణి అదేగ్రామంలో అంగన్‌వాడీ టీచర్‌గా విధులు నిర్వహిస్తుంది. రాజయ్య రిటైర్డ్ అయినప్పటి నుండి మద్యానికి బానిసై భార్య భర్తల మధ్య తరచూ గొడవలు జరుగుతుండేవి. రాజయ్య తన భార్యను మద్యానికి డబ్బుల కోసం వేధిస్తూ గొడవపడేవాడు. ఇదే క్రమంలో శనివారం అర్ధరాత్రి భార్య భర్తల మధ్య గొడవలు జరగడంతో అక్కడే ఉన్న కర్రతో రాజమణిపై ,రాజయ్య,దాడి చేయడంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందినట్లు మృతురాలి కూతురు పూజిత ఫిర్యాదు మేరకు జైపూర్ ఎస్సై శ్రీధర్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

# మద్యం సేవించి వాహనాలు నడిపితే జైలు, జరిమానా

- ప్రమాదాల నివారణే లక్ష్యంగా ప్రతి రోజు డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు
- తరచుగా డ్రంక్ అండ్ డ్రైవ్ చేస్తూ పట్టుబడిన వ్యక్తుల డ్రైవింగ్ లైసెన్స్ రద్దుకు సిఫార్సు
- జులై మాసంలో 456 డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు
- నిందితులకు శిక్ష విధించడంపై స్పెషల్ ఫోకస్
- ములుగు జిల్లా ఎస్పీ శబరిష్




**ములుగు ప్రతినిధి, ఆగస్టు 03(జనంసాక్షి) :** మద్యం సేవించి వాహనాలు నడిపే వారికి జరిమానా మరియు జైలు శిక్ష తప్పవని ములుగు జిల్లా ఎస్పీ డాక్టర్ శబరీష్ హెచ్చరించారు. ములుగు జిల్లా వ్యాప్తంగా గత నెల(జూలై)లో 456 డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు చేసినట్లు తెలియచేశారు. ఇకపై కేసులు నమోదు చేయడం తో పాటు నిందితులకు శిక్ష విధించడంపై కూడా ప్రత్యేక చర్యలు తీసుకుంటామని తెలియచేశారు. గడిచిన వారంలో వివిధ పోలీస్ స్టేషన్ పరిధిలలో మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడిన 17 మంది మందుబాబులకు వారి కుటుంబ సభ్యుల సమక్షంలో కౌన్సెలింగ్ నిర్వహించి కోర్ట్ ద్వారా అట్టి 17 మందికి 2 రోజుల జైలు శిక్షతో పాటు 2వేల రూపాయల జరిమానాలు విధించడం జరిగింది అని తెలియజేశారు.

ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ మద్యం సేవించి వాహనం నడిపి ప్రమాదాలకు కారణం అయితే అట్టి వారిపై కేసులు నమోదు చేయడం జరుగుతుందని, జిల్లాలో ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో ప్రతి రోజూ డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్ట్ లు, వాహన తనిఖీలు నిర్వహించడం జరుగుతుందని, తరచు డ్రంక్ అండ్ డ్రైవ్ చేస్తూ పట్టుబడిన వ్యక్తుల యొక్క డ్రైవింగ్ లైసెన్స్ తీసుకొని ఆ యొక్క లైసెన్స్ రద్దుకు సంబంధిత రవాణా శాఖ అధికారులకు సిఫారస్సు చేయడం జరుగుతుందన్నారు.

తాగి వాహనాలు నడపవద్దని తద్వారా జరిగే ప్రమాదాలను, కుటుంబ ఆర్థిక పరిస్థితులు చితికిపోయే అంశాలపై పోలీస్ శాఖ వారు కౌన్సిలింగ్ ద్వారా వివరించడం, పట్టుబడిన వారిని వారి కుటుంబ సభ్యుల సమక్షంలో కౌన్సెలింగ్ నిర్వహిస్తూ కోర్టులో హాజరు చేయడం జరుగుతుంది అని అన్నారు. మద్యం సేవించి మొదటిసారి పట్టుబడిన, రెండవసారి పట్టుబడిన వారు సేవించిన మద్యం మోతాదులను బట్టి తప్పనిసరిగా శిక్షలు విధించబడతాయి అని తెలియజేశారు. రోడ్డు ప్రమాదాల నివారణ లక్ష్యంగా క్రమం తప్పకుండా డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలను నిర్వహించడంతో పాటు, ట్రాఫిక్ నిబంధనలు, రోడ్డు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. అలాగే మైనర్లు వాహనాలు నడుపుతూ పట్టుబడితే వారి తల్లిదండ్రులు, వాహన యజమానులు బాధ్యులు అవుతారని హెచ్చరించారు. ట్రాఫిక్ నియంత్రణపైన, మద్యం తాగి వాహనాలు నడిపేవారిపైన కఠినంగా వ్యవహరించడమే కాకుండా వారికి నిరంతరం కౌన్సిలింగ్‌లు ఇవ్వడం, సూచనలు చేయడం జరుగుతుందన్నారు. అంతే కాక పాఠశాలలకు, కళాశాలలకు వెళ్లి విద్యార్థులతో మమేకమై పాటించాల్సిన నియమాలు వివరించడం వంటి కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందన్నారు. వాహనదారులు రోడ్డు భద్రతా నియమాలు పాటిస్తూ పోలీస్ వారికి సహకరించాలని కోరారు.

# నేడు బిఆర్ఎస్ శ్రేణుల కాళేశ్వరం ప్రాజెక్టు సందర్శన

**కాళేశ్వరం , ఆగస్టు 3 (జనంసాక్షి) :** నేడు కాళేశ్వరం ప్రాజెక్టులోని కన్నేపల్లి పంప్ హౌస్ ను మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ ఆధ్వర్యంలో టిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు సందర్శించనున్నారు. ఈ సందర్శన కార్యక్రమంలో మాజీ మంత్రి, భీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, ఎమ్మెల్యేలు గంగుల కమలాకర్, పాడి కౌశిక్ రెడ్డి, కల్వకుంట్ల సంజయ్, మాజీ ఎమ్మెల్యేలు కల్వకుంట్ల విద్యాసాగర్ రావు, కోరుకంటి చందర్, దాసరి మనోహర్ రెడ్డి, రసమయి బాలకిషన్, వోడితల సతీష్ బాబు, సుంకే రవి శంకర్, మాజీ జెడ్పీ ఛైర్పర్సన్ లు జక్కు శ్రీహర్షిణి రాకేష్, దావ వసంత సురేష్, వేములవాడ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇంచార్జి చెలిమెడ లక్ష్మీ నరసింహారావు, ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు చెందిన నాయకులు పాల్గొననున్నట్లు బిఆర్ఎస్ నాయకులు ఒక ప్రకటనలో తెలిపారు.

# గోవు మాంసం తరలింపుపై ఫిర్యాదు



**ఖానాపూర్ ఆగస్టు 03 (జనం సాక్షి) :** అక్రమంగా గోవును చంపి మాంసాన్ని తరలిస్తున్నారని గోరక్ష ప్రముఖ్ తాళ్ళ భూమేష్ గౌడ్ ఆరోపించారు. ఆదివారం కడెం మండల కేంద్రం నుండి ఆటోలో అక్రమంగా తరలిస్తున్న గోవు మాంసాన్ని మండలంలోని తర్లపాడు గ్రామం వద్ద పోలీసులకు అప్పగించారు. వెంటనే వైద్యురాలు డాక్టర్ సౌందర్య ఘటన స్థలానికి చేరుకొని ప్రాథమికంగా మాంసాన్ని పరీక్షించి గోవును చంపి మాంసాన్ని తెస్తున్నట్లు నిర్ధారించారు. అలాగే మాంసాన్ని ఫోరెన్సిక్ పరీక్షల నిమిత్తం పంపించనున్నట్లు పేర్కొన్నారు. మిగిలిన గోవు మాంసాన్ని సత్తెనపల్లి పశువైద్యశాలకు తరలించారు. ఈ విషయమై పోలీస్ స్టేషన్ లో లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేసినట్లు గోరక్ష ప్రముఖ తాళ్ల భూమేష్ గౌడ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో బజరంగ్దళ్ కార్యకర్తలతో పాటు బిజెపి, ఖానాపూర్ హిందుత్వ సమితి నాయకులు, తదితరులు ఉన్నారు.

# అమ్మ చారిటబుల్ ట్రస్ట్ చేయూత




**పాలకుర్తి, ఆగస్టు 03 (జనంసాక్షి) :** పాలకుర్తి మండలంలోని విస్నూరు గ్రామంలో కన్న గట్టయ్య గౌడ్ అనారోగ్యంతో మరణించగా వారి కుటుంబ సభ్యులను పరామర్శించి అమ్మ ఛారిటబుల్ ట్రస్ట్ చేయూతనందించారు, ట్రస్ట్ తరుపున పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని ధైర్యం చెప్పి. బియ్యం, కూరగాయలు, నిత్యావసరాలను ట్రస్ట్ చైర్మన్ యతిపతి శ్రీకాంత్, జనరల్ సెక్రటరీ జీడి హరీష్ లు అందించారు. ఈ కార్యక్రమా నికి సహకరించిన ఇరుకుల్ల మహేష్ కి ట్రస్ట్ సభ్యులు కృతజ్ఞతలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో ట్రస్ట్ కోశాధికారి ఒర్రె కుమారస్వామి, మృతుడి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## జనాలకు ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా

# జనహిత పాదయాత్రనా?

- రాష్ట్రంలో పెండింగ్లో ఉన్న 8500 కోట్ల ఫీజు రియంబర్స్మెంట్ స్కాలర్షిప్ లను విడుదల చేయాలి
- స్థానిక సంస్థల ఎన్నికలలో లబ్ధి పొందడానికి ఈ జనహిత పాదయాత్ర
- ఏబీవీపీ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి మాచర్ల రాంబాబు




**ఖానాపూర్ రూరల్, ఆగస్టు 3 (జనంసాక్షి) :** జనాలకి ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా జనహిత పాదయాత్ర చేయడం సిగ్గు చేటు అని రాష్ట్రంలో పెండింగ్లో ఉన్న 8,500 కోట్ల ఫీజు రియంబర్స్మెంట్ స్కాలర్షిప్ లను వెంటనే విడుదల చేయాలని ఏబీవీపీ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి మాచర్ల రాంబాబు అన్నారు. ఆదివారం స్థానిక వాసవి మాత ఆలయ ప్రాంగణం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ తెలంగాణ కాంగ్రెస్ పార్టీ వ్యవహారాల ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్ జనహిత పేరుతో పాదయాత్రలు చేస్తున్నారు. కానీ తెలంగాణ విద్యార్థుల సమస్యలు ఎందుకు పట్టించుకోవడంలేదని రాష్ట్రవ్యాప్తంగా 8500 కోట్ల ఫీజు రియంబర్స్మెంట్ స్కాలర్షిప్ విడుదల చేసే విధంగా అధికారంలో ఉన్న పార్టీ మీదే కాబట్టి వాటిని విడుదల చేసి గురుకులాల్లో ఇప్పటివరకు ఒక వంద మూడు విద్యార్థులు ఫుడ్ పాయిజన్ వల్ల ఆత్మహత్యల వల్ల చనిపోయారు కనీసం వారి తల్లిదండ్రులను పట్టించుకున్న పాపాన పోలేదని అన్నారు .స్థానిక సంస్థల ఎన్నికల లబ్ధి కొరకై ఈ పాదయాత్రను నిర్వహిస్తున్నారని అన్నారు. ఇప్పటివరకు రాష్ట్రంలో తెలంగాణ విద్యార్థులకు ఇచ్చినటువంటి హామీలను రాష్ట్ర ప్రభుత్వం 20 నెలలు గడుస్తున్నా కూడా నెరవేర్చలేనటువంటి పరిస్థితి ఈ రాష్ట్రంలో ఉంది ఇప్పటికైనా విద్యార్థుల సమస్యలపై స్పందించి విద్యార్థులకు న్యాయం చేసిన తర్వాతనే జనహితం అనే పాదయాత్రను కొనసాగించాలని లేదంటే రాష్ట్రవ్యాప్తంగా ఎక్కడికక్కడ అడ్డుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఇందూర్ విభాగ్ కన్వీనర్ కైరి శశిధర్, నిర్మల్ జిల్లా కన్వీనర్ మూడపల్లి దినేష్, జిల్లా ఎస్ఎఫ్డి కన్వీనర్ దుర్గాప్రసాద్, కార్యకర్తలు సాయికుమార్, దశరథ్, శశాంక్, మహేంద్ర, పవన్ అన్నారు.

# ఘనంగా ఎస్టీఎఫ్ఐ రజతోత్సవ పతాకావిష్కరణ



**మహబూబాబాద్ బ్యూరో, ఆగస్టు 03(జనం సాక్షి):** స్థానిక టీఎస్ యూటీఎఫ్ భవన్ నందు ఎస్టిఎఫ్ఐ (స్కూల్ టీచర్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా) రజతోత్సవాల సందర్భంగా పతాకావిష్కరణ కార్యక్రమాన్ని ఘనంగా టిఎస్ యుటీఎఫ్ జిల్లా కార్యాలయం వద్ద నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్టీఎఫ్ఐ పతాకాన్ని సీనియర్ నాయకులు కందుల ప్రేమ్ కుమార్ ఎగురవేశారు. ఈ సందర్భంగా టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి సామ మల్లారెడ్డి మాట్లాడుతూ దేశ వ్యాపితంగా ఉపాధ్యాయ , విద్యారంగా సమస్యల పరిష్కారానికై జాతీయ స్థాయిలో స్కూల్ టీచర్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ( ఎస్ టి ఎఫ్ ఐ) ను 2020 ఆగస్ట్ 12 న స్థాపించారని అన్నారు. నూతన జాతీయ విద్యా విధానాన్ని 2020 ని రద్దు చేయాలని, నూతన సిపిఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. దేశవ్యాప్తంగా అంతరాలు లేని అందరికీ సమాన విద్య అందించాలని, దేశవ్యాప్తంగా ఉపాధ్యాయుల ఖాళీలను భర్తీ చేయాలని,సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని,కాంట్రాక్టు పద్ధతిలో పనిచేస్తున్న ఉద్యోగ,ఉపాధ్యాయులకు మినిమం టైమ్ స్కేల్ మంజూరు చేయాలని, ఆదాయ పన్ను స్లాబు రేట్లు సవరించాలని డిమాండ్ చేశారు. విద్యారంగానికి బడ్జెట్ కేటాయింపులు పెంచాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ యాకూబ్ మహబాద్పా , కురవి మండలాల ప్రధాన కార్యదర్శులు కె రాజశేఖర్, ఎం ప్రవీణ్ కుమార్. ఉపాధ్యాయులు ప్రేమ్ కుమార్, రామ్మూర్తి, పద్మ తదితరులు పాల్గొన్నారు .

# బిపి పెరిగిపోతోంది.. షుగర్ పేరుకుపోతుంది

- శారీరమ శ్రమ, వ్యాయామం లేక ఈ దుస్థితి
- బిపి, షుగర్, కంటి 59వ ప్రత్యేక క్యాంపు విజయవంతం
- బత్తినేని ఛారిటబుల్ ట్రస్ట్ వైద్య సేవలు సద్వినియోగించుకోండి
- ప్రముఖ జనరల్, బిపి, షుగర్ వైద్య నిపుణులు టి పవన్ కుమార్

**బోనకల్, ఆగస్టు 03 (జనంసాక్షి):** జీవనశైలి జబ్బులైన బిపి, షుగర్‌లు చాపకింద నీరులా వ్యాపించి వ్యాధి బారిన పడివారిలో బిపి పెరిగిపోతోంది అని.. షుగర్ పేరుకుపోతుంది అని... ప్రముఖ జనరల్ బిపి, షుగర్, కంటి వైద్య నిపుణులు టి పవన్ కుమార్ అన్నారు. మండల కేంద్రంలోని మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో బత్తినేని చారిటబుల్ ట్రస్ట్ సౌజన్యంతో సిపిఐ సీనియర్ నాయకులు, అమరజీవి తూము ప్రకాశరావు జ్ఞాపకార్థం ప్రతినెల మొదటి ఆదివారం నిర్వహించే బిపి, షుగర్, కంటి ప్రత్యేక 59వ క్యాంపు ఆదివారం విజయవంతంగా ముగిసింది. ఈ సందర్భంగా ప్రముఖ వైద్యులు టి పవన్ కుమార్ మాట్లాడుతూ ఇంతకముందు పట్టణాల్లో ఎక్కువగా కనిపించిన బిపి, షుగర్ జబ్బులు ఇప్పుడు పల్లెలోనూ వ్యాపిస్తున్నాయని అన్నారు. ప్రతి నలుగురిలో ఒకరికి బిపి, 30 యేళ్లు నిండిన ప్రతి ఐదుగురిలో ఒకరికి షుగర్ ఉందంటే పరిస్థితి తీవ్రతను అంచనా వేయవచ్చని అన్నారు. గ్రామాల్లో 26 శాతం మంది, పట్టణాలలో 30 శాతం మంది బిపి బాధితులు, పల్లెలో 19 శాతం మంది, పట్టణాల్లో 24 శాతం మంది షుగర్ బాధితులున్నట్టు తాజా గణాంకాలు వెల్లడిస్తున్నాయని అన్నారు. ఈ స్థాయిలో బిపి, షుగర్ బాధితులుం డటం అత్యంత ఆందోళన కలిగించే అంశమని ఈ సందర్భంగా ఆయన హెచ్చరించారు. అవగాహన లేక కొందరు, నిర్లక్ష్యంతో మరికొందరు ఈ రెండు ప్రమాద కర జబ్బులను నియంత్రణలో ఉంచుకోలేక గుండెజబ్బులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వ్యాయామం లేక ఈ దుస్థితి అని, ఒత్తిడి కారణంగా ఈ జబ్బులొస్తున్నాయని అన్నా రు. వ్యాయా మంలేదు, దీనికి తోడూ సరైన ఆహారమూ తీసుకో వడం లేదని అన్నారు. పిల్లలు ఎలక్ట్రానిక్ పరికరాల ప్రభావానికి లోనవుతు న్నారని, దీని నుంచి బయటపడాలంటే వారిని క్రీడల వైపు మళ్లి ంచాలని అన్నారు. పెద్ద వాళ్లు అయితే యోగా చేయాలని, శారీ రక వ్యాయామం లేకుంటే చిన్నవయసులోనే ఈ జబ్బులు వచ్చే అవకాశం ఉందని అన్నారు.



100 మంది పేషంట్లకు వైద్యులు టి.పవన్ కుమార్ వైద్యసేవలందించగా, సిపిఐ మం డల కార్యదర్శి యంగల ఆనందరావు, ఆర్ఎంపి డబ్ల్యూఏ టిఎస్ జిల్లా అధ్యక్షులు బొమ్మినేని కొండలరావు చేతుల మీదుగా మం దుల ను పంపిణీచేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు ఆకెన పవన్, తోటపల్లి ఆనందరావు, బానోత్ మురళి, క్యాంపు సహాయకులు యంగల గిరి, మార పోగు గోపి పాల్గొన్నారు.

## కస్తూర్బా గాంధీ విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలి

- ఎస్.ఎఫ్.ఐ సైకిల్ యాత్ర డిమాండ్



**పి.ఏ.పల్లి,ఆగష్టు 03(జనంసాక్షి) :** భారత విద్యార్థి ఫెడరేషన్ ఎస్ఎఫ్ఐ నల్లగొండ జిల్లా కమిటీ ఆధ్వర్య ంలో చేపట్టిన సంక్షేమ హాస్టల్ సంరక్షణ ప్రభుత్వ విద్య పరిరక్షణకై చేపట్టిన సైకిల్ యాత్ర పి.ఏ.పల్లి మండలా నికి చేరుకుంది. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ నల్గొండ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆకారపు నరేష్,కంభంపాటి శంకర్ మాట్లాడుతూ పి.ఏ.పల్లి కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో సుమారు 250 మంది విద్యార్థులు విద్యను కొనసాగిస్తున్నారు. కస్తూర్బా గాంధీ బాలి కల పాఠశాలలో విద్యార్థులకు ఇప్పటివరకు దుప్పట్లు ఇవ్వలేదని ఒక జత యూనిఫామ్ ఇచ్చి రాష్ట్ర ప్రభు త్వం చేతులు దులుపుకుందని అన్నారు. మహిళా విద్యార్థులకు అందాల్సిన కిట్లను కూడా ఇవ్వకుండా రాష్ట్ర ప్రభుత్వం మొండి చేయి చూపుతుందని, రాష్ట్రంలో పాలకులు మారినా, ప్రభుత్వాలు మారిన పేద మధ్యతరగతి విద్యార్థుల బతుకులు ఏమాత్రం మారడం లేదని సందర్శన సైకిల్ యాత్ర ఆవేదన వ్యక్తం చేసింది. నల్లగొండ జిల్లా వ్యాప్తంగా సమస్యల పరిష్కారం కోసం సాగుతాగుతున్న సైకిల్ యాత్ర విద్యార్థుల సమస్యలను అధ్యయనం చేసి ప్రభుత్వానికి మరియు జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చి సమస్యల పరిష్కారం కోసం విద్యార్థులతో కలిసి బలమైన సమరశీల విద్యార్థి పోరాటాలు నిర్వహిస్తాం అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యులు కుర్ర సైదా నాయక్, ఎస్ఎఫ్ఐ దేవరకొండ డివిజన్ అధ్యక్షుడు బుడిగ వేంకటేష్, స్పందన,కోరే రమేష్, మారుపాక కిరణ్,ముస్కు రవిందర్,పొట్లరాకేష్,వినోద్,జగన్,రాజేష్,రామలింగం, గణేష్,వీరన్న,శంకర్,నవదీప్,ప్రణీత్, పాల్గొన్నారు.

## బాల కార్మికుల రక్షణలో స్కోప్ సంస్థకి ప్రశంసలు

- ఆపరేషన్ ముస్కాన్‌లో 126 బాల కార్మికుల విముక్తికి కృషి చేసిన నరసింహరాజును సీపీ అభినందన



**చౌటుప్పల్, ఆగస్ట్ 3 (జనంసాక్షి):** ఆపరేషన్ ముస్కాన్ కార్యక్రమం లో భాగంగా చౌటుప్పల్ డివిజన్ పరిధిలో 126 మంది బాల కార్మికులను విముక్తి చేసిన స్కోప్ స్వచ్ఛంద సంస్థ మండల కోఆర్డినేటర్ బాతరాజు నరసింహ రాజు సేవలను రాచకొండ పోలీస్ కమిషనర్ జి. సుధీర్ బాబు ప్రత్యేకంగా అభినందించారు. నేరేడ్‌మెట్‌లోని రాచకొండ పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో సీపీ సుధీర్ బాబు, నరసింహరాజుకు అభినందన పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాల కార్మికులు లేని సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతను తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా నరసింహ రాజు మాట్లాడుతూ సేవలను గుర్తించి సత్కరించటం పట్ల ఆనందంగా ఉందన్నారు. బాల కార్మికులను నిర్మూలించేందుకు నిరంతరం కృషి చేస్తానని తెలిపారు.

# హింసకు పాల్పడితే పుట్ట గతులుండవు..!

- గుండారం రిజర్వాయర్ ను ఆధునికరిస్తాం
- సెంట్రల్ లైటింగ్, షాపింగ్ కాంప్లెక్స్ నిర్మిస్తాం
- కమాన్ పూర్ మార్కెట్ యార్డుకు అనువైన స్థలాన్ని సేకరిస్తాం
- ఏఎంసి పాలకవర్గ సన్మాన సభలో మంత్రి శ్రీధర్ బాబు

**మంథని, (జనంసాక్షి) :** ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తానని హింసకు పాల్పడి రాజకీయం చేస్తే పుట్టగతులు ఉండవని మంత్రి శ్రీధర్ బాబు హెచ్చరించారు. నూతనంగా నియమించబడిన కమాన్ పూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ వైనాల రాజు, వైస్ చైర్మన్ మద్దెల రాజయ్య, డైరెక్టర్ల సన్మాన సభలో మంత్రి శ్రీధర్ బాబు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయలన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వసమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చేందుకు కృషి చేస్తుందన్నారు. అర్హులైన పేదలకు రేషన్ కార్డులు జారీ చేయాలని గతంలో ప్రతిపక్షంగా ఉన్నప్పుడు ధర్నాలు చేసినా. గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందని మంత్రి విమర్శించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు, అర్హులకు నూతన రేషన్ కార్డులతో పాటు నెలకు సగటున 1200 రూపాయల విలువైన సన్న బియ్యం ఉచితం గా అందిస్తున్నామని, గతంలో దొడ్డు. బియ్యం సరఫరాతో అక్రమా ర్కులు లబ్ది పొందగా, ఇప్పుడు సన్న బియ్యం పేదలకు ఉపయోగక రంగా ఉంటుందని అన్నారు. రేషన్ డీలర్లు బియ్యం పంపిణీని సక్రమంగా నిర్వహించాలని సూచించారు. పాల్గొన్నారు. నియోజకవర్గంలో రాయలసీమ ఫ్యాక్షనిస్టులా చేయాలని హింసతో బయపెట్టించి హింసతో రాజకీయం చేయాలని చూశారు.. కానీ కాంగ్రెస్ పార్టీ గాంధీ పార్టీ.. గాంధీ సిద్ధాంతాలను పాటిస్తు అహింస మార్గంలో శాంతియుతంగా ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముందుకు సాగుతుందన్నారు. రాబోయే రోజుల్లో గుండారం రిజర్వాయర్‌కు మరిన్ని పెద్దఎత్తున నిధులు మంజూరుచేయించి రైతులకు మరింత మేలు జరిగే కార్యక్రమం చేపట్టబోతున్నామని అన్నారు. కమానపూర్ మండలకేంద్రం నుండి పెంచికల్పేట మీదుగా డబుల్ రోడ్డు నిర్మాణానికి 4కోట్లు నిధులు మంజూరు చేయడంజరిగిందని త్వరలో పనులు చేపట్టి రోడ్డు నిర్మాణం పూర్తిచేయిస్తామన్నారు. మండలకేంద్రంలో సెంట్రల్ లైటింగ్ రోడ్డు వెడల్పురూడా త్వరలో పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. మంగపేట రోడ్డు నిర్మాణానికి వంతెన నిర్మాణం చేపట్టేదుకు 4కోట్లు మంజూరుచేయడం జరిగిందన్నారు.



రైతుల సౌకర్యార్థం క్రయ విక్రయాలు జరిపేందుకు రామగిరి, ముత్తారం, కమాన్పూర్ మూడు మండలాలకు సౌకర్యార్థంగా ఉండేలా అతి త్వరలోనే స్థలాన్ని ఏర్పాటుచేసి మార్కెట్ యార్డును ఏర్పాటు చేస్తామన్నారు. రాబోయే రోజుల్లో ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి హామీని అమ లుచేసేందకు కృషిచేస్తామన్నారు. చాలా మంది కార్యకర్తలు పార్టీనీ న మ్ముకొని కష్టకాలంలో తన వెంట ఉన్నవారు ఉన్నారని వారికి కూడా న్యాయం చేసేలా విదంగా చూస్తానని కార్యకర్తలకు భరోసా ఇచ్చారు.

## రామకృష్ణాపురం రైల్వే గేట్ పై బ్రిడ్జి మంజూరుకు కృషి

- రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర



**చింతకాని, ఆగస్టు 03 (జనంసాక్షి):** చింతకాని మండల పరిదిలోని రామకృష్ణాపురం గ్రామం రైల్వే గేట్ పై బ్రిడ్జి నిర్మాణం కొరకు రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర నివాసంలో వారిని మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందించిన రామకృష్ణా పురం బిఆర్ఎస్ నాయ కులు. రామకృష్ణాపురం రైల్వే గేట్ వల్ల ప్రజలు పడుతున్న ఇబ్బందులను తెలియజేసి రామ కృష్ణాపురం రైల్వే గేటుపై బ్రిడ్జి మంజూరు చేయవలసిందిగా విన్నవించారు. రాజ్యసభ సభ్యు లు వద్దిరాజు వెంటనే స్పందించి రైల్వే జీఎంకి ఫోన్ చేసి రామకృష్ణాపురం 107 రైల్వే గేట్ బ్రిడ్జి ఎందుకు మం జూరు కావడం లేదు దానిపై ఆరాధిసి వెంటనే రైల్వే శాఖ మంత్రి కి రిప్ర జెంటేషన్ రెడీ చేయమని తన సిబ్బందికి ఆదేశించారు. పార్లమెంటు సమావేశాలలో రైల్వే మంత్రిని కలిసి మీ గ్రామా ని కి రైల్వే బ్రిడ్జి మంజూరు చేసేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు . ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కన్నెబోయిన కుటుం బరావు, బిఆర్ఎస్ నాయకుడు కురుగుంట్ల రవీందర్ రెడ్డి , శెట్టి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## రెజ్లింగ్‌లో ధ్రువం సత్య వర్మకు ఉజ్వల భవిష్యతు

- అరికపూడి



**శేరిలింగంపల్లి, ఆగస్టు 3 (జనంసాక్షి) :** పసిప్రాయంలోనే రెజ్లింగ్ క్రీడలో అద్భుతంగా రాణిస్తున్న ధ్రువం సత్య వర్మకు రానున్న రోజుల్లో ఉజ్వల భవిష్యత్తు ఉందని రాష్ట్ర ప్రజాపద్దల కమిటీ చైర్మన్ అరికెపూడి గాంధీ పేర్కొన్నారు. జాతీయస్థాయి అండర్ 11 రెజ్లింగ్ విభాగంలో పోటీలను చత్తీస్గడ్ రాష్ట్రంలో నిర్వహించిన నేపథ్యంలో ధ్రువం సత్యవర్మ అందులో పాల్గొని రెండు బంగారు పథకాలను సాధించిన విషయాన్ని తెలుసుకున్న పిఏసి చైర్మన్ అరికెపూడి గాంధీ ఆదివారం సత్య వర్మను శేరిలింగంపల్లి నియోజకవర్గం పరిధి వివేకానందానగర్ లోని తన నివాసంలో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ శేరిలింగంపల్లి ప్రాంతానికి చెందిన ధ్రువం సత్య వర్మ తల్లి దండ్రులు ఎంతో ముందు చూపుతో తమ కుమారుడిని క్రీడల పట్ల ఆసక్తిని పెంపొందించుకునేలా ప్రోత్సహించి నేడు జాతీయస్థాయి క్రీడా కారునిగా ఎదిగేందుకు తోడ్పాటు అందించడం ఎంతో అభినం దనీ యం అన్నారు. ప్రతి విద్యార్థి తల్లిదండ్రి వారి పిల్లలను క్రీడలలో ప్రోత్స హించాలని, జీవితంలో ఉన్నత స్థానానికి ఎదగడానికి సైతం క్రీడలు దోహదపడుతాయని గాంధీ వివరించారు. రెజ్లింగ్ విభాగం అంత సామాన్యమైనది కాదని ఎంతోకటోర శ్రమను కనబరిస్తే తప్ప అందులో రాణించలేరని, అలాంటిది అండర్ 11 విభాగంలో జాతీయ స్థాయిలో రాణించి బంగారు పథకాలను గెలుపొందడం గర్వకారణ మన్నారు. ధ్రువం సత్య వర్మ రానున్న రోజుల్లో మరింతగా రాటుదేలి రెజ్లింగ్ విభా గంలో రాణించడానికి తనవంతు పూర్తి సహాయ సహకారాలు అందద ండలు లభిస్తాయని ఈ సందర్భంగా హామీని ఇచ్చారు. ఈ కార్యక్ర మంలో శేరిలింగంపల్లి సీనియర్ నాయకులు బల రాం యాదవ్, రాజ మోహన్రావు, రమేష్ యాదవ్, జైపాల్ రెడ్డి పాల్గొన్నారు.

## పెళ్లికి వెళ్లి తిరిగి వచ్చేలోపు..

**మొయినాబాద్, ఆగస్టు 03 (జనంసాక్షి) :** పెళ్లికి వెళ్లి తిరిగి వచ్చే లోపు దొంగలు తాళం పగులగొట్టి ఇంట్లోని బంంగారు అభరణాలను అపహరించుకుపోయారు. ఈ సంఘటన మొయి నాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మొయినాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని పెద్దమంగళారం గ్రామానికి చెందిన సీహెచ్ అనిత కుటుంబ సభ్యులతో పాటు హైదరాబాద్‌లోని వనస్థలిపురంలోని తన బంధువుల ఇంట్లో పెళ్లికని ఈ నెల 2వ తేదీన మధ్యాహ్నం 12 గంటలకు ఇంటికి తాళం వేసి వెళ్లారు. తిరిగి వాళ్లు ఇంటికి ఆదివారం ఉదయం 11:30 గంటలకు ఇంటికి వచ్చే సరికి ఇంటి తాళం పగులగొట్టి కనిపించింది. ఇంట్లోకి వెళ్లి చూసే సరికి ఇంట్లో వస్తువులు చిందరవందరగా పడి ఉన్నాయి. బీరువా కూడ తెరిచి ఉంది. అందులో నుంచి 2 బంగారు నెక్లెస్‌లు, 2 జతల చెవి కమ్మలు, రెండు బ్రాస్‌లెట్‌లు, 4 బంగారు గాజులు మొత్తం 16 తులాల బంగారం అభరణాలను దొంగిలించారు. దొంగతనం జరగడంతో బాధితులు ఫిర్యాదు చేశారు. సంఘటన స్థలానికి చేరుకుని క్లూస్ టీంను రంగంలోకి దింపి దొంగల వేలిముద్రలను సేకరించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

## శాంతి భద్రతల పరిరక్షణకు పోలీసులు కృషి చేయాలి

- డి.ఎస్.పి ప్రసన్నకుమార్
- భూవివాదంలో ఘర్షణ పాల్పడిన ఇరువురు హెడ్ కానిస్టేబుల్స్ సస్పెండ్



**పెన్ పహాడ్ ఆగస్ట్ 03 (జనంసాక్షి) :** మండలంలోని గ్రామాల్లో శాంతి భద్రతల పరిరక్షణకు పోలీసులు కృషి చేయాలని సూర్యాపేట డిఎస్పి ప్రసన్నకుమార్ అన్నారు ఆదివారం స్థానిక పోలీస్ స్టేషన్ ను ఆకస్మికంగా సందర్శించి రికార్డులను పరిశీలించి మాట్లాడారు డ్రగ్స్, గంజాయి లాంటి మత్తు పానీయాలకు యువత దూరంగా ఉండాలని గంజాయి లాంటి మత్తు పదార్థాలను అమ్మిన సేవించిన కఠిన చర్యలు ఉంటాయన్నారు గ్రామాల్లో ప్రజలు సైబర్ నేరాలకు గురికాకుండా అవగాహన కల్పించాలని సోషల్ మీడియాలో అనుచిత పోస్టులను పెట్టొద్దని ప్రజలకు విజ్ఞప్తి చేశారు గ్రామాల్లో జరుగుతున్న దోపిడీ దొంగతనాలను అరికట్టేందుకు పోలీసులు నిఘా పెట్టాలని సూచించారు స్థానిక స్టేషన్లో అందిన ఫిర్యాదులకు వెంటనే స్పందించాలని సిబ్బందికి తెలిపారు పోలీస్ స్టేషన్ పరిసర ప్రాంతాలను శుభ్రంగా ఉంచుకోవాలని స్టేషన్కు కావలసిన అవసరాలను తమ దృష్టికి తీసుకొస్తే వాటిని అందించేందుకు ఏర్పాటు చేస్తామని తెలిపారు గత నెల మూడో తారీఖున మండలంలోని లింగాల గ్రామ రెవిన్యూ శివారులో జరిగిన భూవివాదంలో ఘర్షణకు పాల్పడిన నల్లగొండ జిల్లా అన్నెపర్తి 12 వ బెటాలియన్ లో హెడ్ కానిస్టేబుల్స్ గా విధులు నిర్వహిస్తున్న నేరేడుచర్ల మండలం బక్కయ్య గూడెం గ్రామానికి చెందిన శానం నాగేంద్రబాబు శానం లక్ష్మణ్ రావులపై స్థానిక పోలీస్ స్టేషన్లో ఎస్సై కస్తాల గోపికృష్ణ కేసు నమోదు చేయగా బెటాలియన్ కమాండెంట్ కె వీరయ్య సస్పెన్షన్ వేటు వేశారని వెల్లడించారు నేరాలకు పాల్పడిన ప్రతి ఒక్కరిపై కఠిన చర్యలు ఉంటాయని వాహన తనిఖీల్లో వాహనదారులు పోలీసులకు సహకరించాలని డ్రంకెన్ డ్రైవ్ కేసులకు గురి కావద్దని తెలిపారు ఈ కార్యక్రమంలో రూరల్ సీఐ రాజశేఖర్, ఎస్సై గోపికృష్ణ, సిబ్బంది, పాల్గొన్నారు.

## కరీంనగర్ నగరంలో నాఖాబంది, 151 వాహనాలు సీజ్

- కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం



**కరీంనగర్ జిల్లా బ్యూరో, ఆగస్టు 03 (జనంసాక్షి) :** శాంతిభద్రతల పర్యవేక్షణ, పరిరక్షణలో భాగంగా, కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో శనివారం రాత్రి పోలీసులు విస్తృత తనిఖీలు చేపట్టారు. నగరంలోని 20 ప్రధాన కూడళ్ళ వద్ద దాదాపు 150 మంది పోలీసులతో నాఖాబంది నిర్వహించి, వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఈ తనిఖీలలో మొత్తం 151 వాహనాలను పోలీసులు సీజ్ చేశారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం మాట్లాడుతూ, "ప్రివెంటివ్ చర్యల్లో భాగంగా ఈ తనిఖీలు నిర్వహించాం. మద్యం సేవించి వాహనాలు నడిపే వారిని, నంబర్ ప్లేట్ లేని లేదా టాంపర్ చేసిన వాహనాలను, సరైన ధ్రువపత్రాలు లేని వాహనాలను గుర్తించి కేసులు నమోదు చేస్తున్నాం" అని తెలిపారు. సీజ్ చేసిన వాహనాల వివరాలను ఆయన వెల్లడించారు.

మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడినవి 53, నంబర్ ప్లేట్ సరిగా లేని లేదా టాంపర్ చేసినవి 80, సరైన ధ్రువపత్రాలు లేనివి11, నంబర్ ప్లేట్ లేనివి 7, ఈ ఆకస్మిక తనిఖీలు భవిష్యత్తులో కూడా కొనసాగుతాయని కమిషనర్ పేర్కొన్నారు. ప్రజలు తమ వాహనాలను సరైన ధ్రువపత్రాలతో, నిబంధనలకు అనుగుణంగా నడపాలని సూచించారు.

## పాఠశాలల బందుపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తాం

- ప్రైవేట్ పాఠశాలల బంద్ ను వెనక్కితీసుకోవాలి

**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి ఆగస్టు 4 (జనంసాక్షి):** వేములవాడలో అనుమతులు లేని పాఠశాలలు నడుస్తుండడంతో అనుమతులు ఉన్న పాఠశాలల బందుపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తమని, ప్రైవేట్ పాఠశాలల బంద్‌ను వెనక్కితీసుకోవాలని, బిఆర్ఎస్వి నియోజకవర్గ నాయకుడు పోతు అనిల్ కుమార్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ ప్రైవేట్ పాఠశాలల సంఘం పర్మిషన్ లేకుండా నడుస్తున్న పాఠశాలను బంద్ చేయాలిని పర్మిషన్ వున్న పాఠశాలల యాజమాన్యం బంద్‌కు పిలుపు నివ్వడం సరైన నిర్ణయం కాదన్నారు. మూడు రోజుల పాఠశాలలు బంధు ఉంటాయని విద్యార్థులు తల్లి దండ్రులకు ఫోన్లకు మెసేజ్ రావడం జరిగిందన్నారు. పాఠశాలలు బంధు నిర్వహిస్తే విద్యార్థుల భవిష్యత్తు ఏం కావాలని ఆయన ప్రశ్నించారు. మొదటి అసైన్మెంట్ పరీక్షలు జరిగే సమయంలో విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని పాఠశాల యజమాన్యం ఆలోచించాలన్నారు. ఒకవేళ వారు నిరసన తెలుపాలంటే పాఠశాలను బందు చేయకుండా పాఠశా ల వద్ద నిరసన కార్యక్రమం చేయాలన్నారు. అనుమతులేని పాఠశాలలపై మండల విద్యాధికారికి గతంలో ఫిర్యాదు చేయడం జరిగిం దన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు కాయా కష్టం చేసి వేలాది ఫీజులు కడుతూ పిల్లల భవిష్యత్తు బాగుం డాలని ప్రైవేట్ పాఠశాలకు పంపిస్తే ఈ విధం గా బంద్‌ల పేరుతో విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు ఇబ్బందులు వస్తాయన్నారు. పాఠశాలల బందును వెనక్కి తీసుకోకపోతే టిఆర్ఎస్వి పక్షాన ఆందోళన కార్యక్రమాలు చేపడతామన్నారు.




## రాజన్న ఆలయం పలు విభాగాలలో ఈవో తనిఖీలు



**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి ఆగస్టు 3 (జనంసాక్షి):** వేములవాడ రాజన్న ఆలయంలోని పలు విభాగాలను ఆదివారం ఆలయ ఇన్చార్జి ఈవో రాధాబాయి తనిఖీలు చేశారు. ప్రసాద తయారీ కేంద్రము,ప్రసాదాల అమ్మకాల కేంద్రము, ప్రోటోకాల్ విభాగం,ప్రధాన గోదాం,బుకింగ్ కౌంటర్,ప్రచార శాఖ,భక్తుల సమాచార కేంద్రాలను ఆకస్మిక తనిఖీలు చేశారు. అనంతరం ఆమె సంబంధిత ఉద్యోగులతో సమావేశం నిర్వహించి ప్రసాదాల తయారీలో ఉపయోగించే పదార్థాల నాణ్యతపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. స్వామి వారికి నివేదించే ప్రసాదం శుద్ధి, ప్రమాణాల పరంగా లోపం లేకుండా చూడాలని ఆదేశించారు. సెంట్రల్ గోదాంలో సరుకుల నిల్వలు,రిజిస్టర్ల నిర్వహణ,టికెట్ కౌంటర్లలో జరిగే లావాదేవీలు, సమాచార కేంద్రాల్లో భక్తులకు అందే సేవలపై సమీక్ష చేశారు. టికెట్ల జారీ విధానం సక్రమంగా కొనసాగాలని, ఉద్యోగులంతా సమయపాలన పాటించాలన్నారు. భక్తుల సమాచార కేంద్రంలోని సిబ్బంది భక్తులతో మర్యాదగా వ్యవహరించాలనీ, ప్రసాద నాణ్యతలో ఎలాంటి లోపాలు చోటుచేసుకోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆమె ఆదేశించారు. ప్రతి విభాగంలో రికార్డుల నిర్వహణ సక్రమంగా చేపట్టాలన్నారు.

## లారీ యజమానుల సంక్షేమ సంఘం అధ్యక్షురాలిగా బోయపాటి కృష్ణవేణి

- ఎన్నికలను క్లీన్ స్వీప్ చేసిన బోయపాటి పానెల్
- తెలంగాణలో తొలిసారిగా ఈ పదవికి మహిళ ఎన్నిక





**ఖమ్మం ఆగస్టు 3 (జనంసాక్షి) :** ఖమ్మం పట్టణ లారీ యజమానుల. సంక్షేమ స ంఘం ఎన్నికలు ఆదివారం నిర్వహించారు. అధ్యక్షురాలిగా బోయపాటి కృష్ణ వేణిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మిగతా పదవులకు ఎన్నికలు నిర్వహించారు. ప్రధాన కార్యదర్శిగా దగ్గు శ్రీనివాసరావు 182 ఓట్లతో గెలుపొందగా ఉపాధ్యక్ష పదవికి తేజవత్ వీరన్న 24 2 ఓట్లు, పొట్లపల్లి సారవయ్యకు 162 ఓట్లు పోలవగా ఉపాధ్యక్షులు పదవికి తేజవత్ వీరన్న 78 ఓట్ల ఆదిత్యంలో విజయం సాధించారు. కాగా ఈ సంఘం అధ్యక్షురాలిగా ఓ మహిళని ఎన్నుకోవటం రాష్ట్రంలో ఇదే ప్రధమం. పలువురు ప్రముఖులు, రాజకీయ నాయకులు బోయపాటి కృష్ణవేణికి అభినందలు తెలిపారు. ఈ ఎన్నికల్లో బోయపాటి పానెల్ ఏకపక్ష విజయం సాధించడంతో జరుపుకున్నారు. మితాయిలు పంచిహర్షం వెలిబుచ్చారు.






# జీతంలో టాప్

### ఐటీ కంపెనీల్లోనే అత్యధికంగా ఈ సీఈవో శాలరీ..



**జనంసాక్షి:**ప్రముఖ ఐటీ కంపెనీ హెచ్‌సీఎల్‌టెక్ సీఈవో సి.విజయకుమార్ రికార్డు స్థాయి వేతనం అందుకున్నారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో ఆయన 10.85 మిలియన్ డాలర్లు (సుమారు రూ.94.6 కోట్లు) సంపాదించారు.ఇది భారతీయ ఐటీ రంగంలో ఎగ్జిక్యూటివ్‌లు పొందుతున్న అత్యధిక వేతనంగా నిలిచింది.విజయకుమార్ వేతనం పెద్ద పోటీ సంస్థలైన టీసీఎస్, ఇన్ఫోసిస్ ఛీఫ్‌ల సంపాదనను సైతం అధిగమించింది. అంతేకా కుండా వచ్చే ఆర్థిక సంవత్సరానికి ఆయన ప్రస్తుత వేతనాన్ని 71 శాతం పెంచి 18.6 మిలియన్ డాలర్లకు (సుమారు రూ.154 కోట్లు) పెంచుకో వడానికి కంపెనీ బోర్డు ఆమోదం తెలిపిందని కంపెనీ వార్షిక నివేదిక తెలిపింది.ఇదే సమయంలో టీసీఎస్ సీఈఓ కృతివాసన్ వేతనం రూ.26.52 కోట్లు కాగా, ఇన్ఫోసిస్ సీఈవో సలీల్ పరేఖ్ వేతనం రూ.80.62 కోట్లుగా ఉంది. అలాగే విప్రో సీఈఓ శ్రీనివాస్ పలియా ఆర్జన సుమారు రూ.53.64 కోట్లు, టెక్ మహీంద్రా సీఈఓ మోహిత్ జోషి సంపాదన రూ.53.9 కోట్లుగా ఉన్నాయి.2025 మార్చి 31తో ముగిసిన ఆర్థిక సంవత్సరంలో విజయకుమార్ అందుకున్న మొత్తం పరిహారంలో మూల వేతనం 1.96 మిలియన్ డాలర్లు కాగా పనితీరు ఆధారిత బోనస్ 1.73 మిలియన్ డాలర్లుగా ఉందని హెచ్‌సీఎల్‌టెక్ వార్షిక నివేదిక తెలిపింది.ఆయన సంపాదనలో ఎక్కువ భాగం దీర్ఘకాలిక ప్రోత్సాహకాలు 6.96 మిలియన్ డాలర్ల విలువైన నియంత్రిత స్టాక్ యూనిట్లు (ఆర్ఎస్‌యూలు) నుంచే వచ్చింది. ఇవికాక బెనిఫిట్స్, పెర్క్విసైట్స్ కింద అదనంగా మరో 0.20 మిలియన్ డాలర్లు లభించాయి.2016లో హెచ్‌సీఎల్‌టెక్ సీఈఓగా బాధ్యతలు స్వీకరించిన విజయకుమార్ అమెరికాలో ఉంటూ తన రెమ్యూనరేషన్‌ను కంపెనీకి చెందిన అమెరికా అనుబంధ సంస్థ హెచ్‌సీఎల్ అమెరికా ఇంక్ నుంచి తీసుకుంటున్నారు.



# విక్రయాలు పెరిగాయ్..


### జూలై నెలలో మొత్తం 29 శాతం పెరిగిన టీవీఎస్ యూనిట్లు

**జనంసాక్షి:** టీవీఎస్ మోటార్ విక్రయాలు 2025 జూలై నెలలో మొత్తం 29 శాతం పెరిగి 4,56,350 యూనిట్లకు చేరుకున్నాయని కంపెనీ తెలిపింది. గతేడాది ఇదే జూలైలో డీలర్లకు 3,39,676 వాహనాలు సరఫరా చేసినట్లు పేర్కొంది.దేశీయంగా (భారత్‌లో) 3,08,720 వాహన అమ్మకాలు నమోదవ్వగా, 2024 జూలైలో విక్రయాలు 2,54,250 యూనిట్లుగా ఉన్నాయి.ఇందులో మోటార్‌సైకిల్ విభాగ విక్రయాల వృద్ధి 25 శాతంగా ఉంది. గతేడాది జూలైలో 1,61,074 యూనిట్లుగా ఉండగా, 2025 జూలైలో 2,01,494 యూనిట్లకు చేరాయి. ఇదే జూలైలో మొత్తం 198,265 స్కూటర్లు అమ్ముడయ్యాయి. గతేడాది జూలైలో విక్రయించిన 1,39,995 యూనిట్లతో పోలిస్తే ఇవి 42% అధికంగా ఉన్నాయి. ఎలక్ట్రానిక్ వాహన(ఈవీ) విభాగం అమ్మకాల వృద్ధి 10 శాతంగా ఉంది. మొత్తం 21,442 యూనిట్ల నుంచి 23,605 యూనిట్లకు చేరింది. జూలైలో మొత్తం 1,42,629 యూనిట్లు ఎగుమతి కాగా, గతేడాది ఇదే నెలలో 97,589 యూనిట్లు విదేశాలకు తరలించారు.

# ఏడబ్ల్యూఎస్ కొత్త సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్ మోడల్

బెంగళూరు: అమెజాన్ వెబ్ సర్వీసెస్ (ఏడబ్ల్యూఎస్) కొత్తగా ఏఐ డ్రివెన్ డెవలప్‌మెంట్ లైఫ్‌సైకిల్ (ఏఐ-డీఎల్‌సీ) మోడల్‌ను ఆవిష్కరించింది. కైరో, అమెజాన్ క్యూ డెవలపర్‌లాంటి టూల్స్‌ను ఉపయోగించి, కృత్రిమ మేథ (ఏఐ)తో సాఫ్ట్‌వేర్‌ను రూపొందించేందుకు ఇది ఉపయోగ పడుతుంది.దీనితో మానవ పర్యవేక్షణలో కోడింగ్, టెస్టింగ్ లాంటి పనులను ఆటోమేట్ చేయడం ద్వారా సాఫ్ట్‌వేర్‌ను అభివృద్ధి చేసే వ్యవధిని నెలల నుంచి రోజుల స్థాయిలోకి కుదించవచ్చని సంస్థ తెలిపింది. అలాగే మెరుగైన ఏఐ విధానాలను షేర్ చేసుకునేందుకు ఏఐ-నేటివ్ బిల్డర్స్ కమ్యూనిటీని కూడా ప్రవేశపెట్టినట్లు వివరించింది.అటు ఏడబ్ల్యూఎస్ స్కిల్ బిల్డర్ ద్వారా అంతర్జాతీయంగా 27 లక్షల మంది విద్యార్థులకు, ఉచితంగా ఏఐ ట్రైనింగ్ యాక్సెస్ అందిస్తున్నట్లు ఏడబ్ల్యూఎస్ తెలిపింది. జనరేటివ్ ఏఐని ఉపయోగించి వాస్తవ ప్రపంచపు సవాళ్లను పరిష్కరించే డెవలపర్లకు 2 మిలియన్ డాలర్ల విలువ చేసే క్రెడిట్స్‌ను ఇచ్చేలా ఏడబ్ల్యూఎస్ ఏఐ లీగ్‌ను కూడా ప్రకటించింది.




**వ్యక్తిగత చార్టర్డ్ అకౌంటెంట్ ఒక సంవత్సరంలో చేయాల్సిన పన్ను ఆడిట్‌ల సంఖ్యను 60కి పరిమితం చేస్తూ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ చార్టర్డ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా (ఐసీఏఐ) కొత్త నిబంధనలను జారీ చేసింది.దీనివల్ల నియంత్రణ వ్యవస్థ బలోపేతం కావడంతోపాటు, ఆడిటింగ్ పనిపై దృష్టి సారించేందుకు వీలవుతుందని ఐసీఏఐ అధ్యక్షుడు చరణ్‌జోత్ సింగ్ నందా బుధవారం తెలిపారు. నాలుగు లక్షల మందికి పైగా సభ్యులున్న ఐసీఏఐ వ్యక్తిగత ఆడిట్‌ల సంఖ్యను పరిమితం చేస్తూ తీసుకొచ్చిన నిబంధనలు 2026 ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి రానున్నాయి.**

### ధర ఎక్కువైనా.. భారత్‌లో తగ్గని డిమాండ్

*__జనంసాక్షి:__భారతదేశంలో ఖరీదైన బైకులను విక్రయించే బీఎండబ్ల్యూ మోటోరాడ్ కంపెనీ దేశీయ విఫణిలో 1000 యూనిట్ల 'ఎస్ 1000 ఆర్ఆర్' సూపర్‌బైక్‌లను విక్రయించింది.సంస్థ తన 1000 బైకును ఇటీవలే ఢిల్లీలో లుటియన్స్ మోటోరాడ్ యజమానికి డెలివరీ చేసింది.ఈ ఏడాది ప్రారంభంలో జరిగిన ఆటో ఎక్స్‌పోలో బీఎండబ్ల్యూ మోటోరాడ్ 2025 ఎస్ 1000 ఆర్ఆర్ ను మూడు వేరియంట్లలో లాంచ్ చేసింది. అవి స్టాండర్డ్ (రూ. 21.30 లక్షలు), ప్రో (రూ. 23.80 లక్షలు) %ు% ప్రో ఎం స్పోర్ట్ (రూ. 26.05 లక్షలు). ఇవన్నీ లేటెస్ట్ డిజైన్, అప్డేటెడ్ ఫీచర్స్ పొందుతాయి.బీఎండబ్ల్యూ ఎస్ 1000 ఆర్ఆర్ బైక్ 999 సీసీ ఇన్‌లైన్ ఫోర్ సిలిండర్ ఇంజిన్ ద్వారా 210 హార్స్ పవర్, 113 న్యూటన్ మీటర్ తారక్ ప్రొడ్యూస్ చేస్తుంది. 6-స్పీడ్ గేర్‌బాక్స్‌తో లభించే ఈ సూపర్‌బైక్ కేవలం 3.3 సెకన్లలో 0-100 కిమీ/గం వేగాన్ని అందుకుంటుంది.*

### విదేశీ గడ్డపై వేల కోట్ల సామ్రాజ్యం..

# ఎవరీ భారతీయుడు?

**జనంసాక్షి:**చాలా మంది భారతీయులు విదేశాల్లో విజయవంతమైన కెరీర్ సొంతం చేసుకోవడమే కాకుండా.. అతిపెద్ద పారిశ్రామికవేత్తల లీగ్‌లో కూడా నిలిచారు. వ్యాపార, పరిశ్రమల ప్రపంచంలో తనకంటూ ఒక ప్రత్యేక స్థానాన్ని ఏర్పరచుకున్న వారిలో ఒకరు 'ప్రకాష్ లోహియా'.ఇంతకీ ఈయన ఎవరు?, నెట్‌వర్త్ ఎంత? అనే విషయాలను ఈ కథనంలో తెలుసుకుందాం.కోల్‌కతాకు చెందిన ప్రకాష్ లోహియా.. 1952 ఆగస్టు 11న మోహన్ లాల్ లోహియా %ు% కాంచన్ దేవి లోహియా దంపతులకు జన్మించారు. 1973లో తన తండ్రితో కలిసి ఇండోనేషియాకు మకాం మార్చారు. అక్కడ వారు 1976లో స్పన్ నూలు ఉత్పత్తిదారు ఇండోరమా కార్పొరేషన్‌ను స్థాపించారు. ఈ కంపెనీ ఎరువులు, పాలియోలిఫిన్లు వంటి ఉత్పత్తులను తయారు చేసేది .ప్రకాష్‌కు ఒక అన్నయ్య, తమ్ముడు ఉన్నారు. కాబట్టి వీరి తండ్రి మోహన్ లాల్ లోహియా తమ వ్యాపారం వృద్ధి చెందడానికి, కుటుంబ వివాదాలను నివారించడానికి వారి 1980లలో ఆస్తిని ముగ్గురు కుమారులకు విభజించారు. ఆ తరువాత ప్రకాష్ లోహియా అన్నయ్య ఓం ప్రకాష్ భారతదేశానికి తిరిగి



వచ్చి ఇండోరామా సింథటిక్స్‌ను స్థాపించారు. తమ్ముడు అలోక్ థాయిలాండ్‌లోని బ్యాంకాక్‌లో ఉన్ని నూలును తయారు చేసే ఇండోరామా హెూల్డింగ్స్‌ను స్థాపించారు.అన్న, తమ్ముడు సొంత వ్యాపారాలను ప్రారంభించుకు న్న తరువాత.. ప్రకాష్ లోహియా 2006లో నైజీరియాలో ఒక ఇంటిగ్రేటెడ్ ఒలేఫిన్ ప్లాంట్‌ను కొనుగోలు చేశాడు. ఇది అప్పట్లోనే పశ్చిమ ఆఫ్రికాలో అతిపెద్ద పెట్రోకెమికల్ సంస్థ, ఆఫ్రికాలో రెండవ అతిపెద్ద ఒలేఫిన్‌ల ఉత్పత్తిదారు.ప్రకాష్ లోహియా.. ఆర్సెలర్ మిట్టల్ చైర్మన్ సీఈఓ, భారతదేశ బిలియనీర్లలో ఒకరైన లక్ష్మీ మిట్టల్ సోదరి సీమా లోహియా భర్త. 2025 నాటికి ప్రపంచ బిలియనీర్లలో ఆయన 353వ స్థానంలో.. 2024 నాటికి ఇండోనేషియాలోని 50 మంది అత్యంత ధనవంతులలో ఆరవ స్థానంలో ఉన్నారు. లోహియా నికర విలువ 8.3 బిలియన్ డాలర్ల కంటే ఎక్కువ అని ఫోర్బ్స్ వెల్లడించింది

# 'తమిళనాట 6.5 లక్షల కొత్త ఓటర్లు'

### మరో బాంబు పేల్చిన కాంగ్రెస్ సీనియర్ నేత చిదంబరం

**జనంసాక్షి:**ఓటర్ లిస్టు విషయంలో ఎన్నికల సంఘంపై ఇప్పటికే ప్రతిపక్ష పార్టీ నేతలు అనుమానాలు వ్యక్తం చేస్తున్న వేళ కాంగ్రెస్ సీనియర్ నేత చిదంబరం మరో బాంబు పేల్చారు.తమిళనాడులో ఏకంగా 6.5 లక్షల మంది ఓటర్లు పెరిగారని చెప్పుకొచ్చారు. దీంతో ఓటర్ లిస్ట్‌పై కొత్త చర్చ మొదలైంది.బీహార్‌లో ఎన్నికల సంఘం నిర్వహించిన ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) రాజకీయంగా తీవ్ర దుమారం రేపిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో తమిళనాడులో కూడా ఓటర్ల సంఖ్య పెరిగిందని కాంగ్రెస్ సీనియర్ నేత చిదంబరం తెలిపారు. తాజాగా చిదంబరం ట్విట్టర్ వేదికగా.. 'ఎస్ఐఆర్ ప్రక్రియ మరింత ఆసక్తికరంగా మారుతోంది. బీహార్‌లో 65 లక్షల మంది ఓటర్లు తమ ఓటు హక్కును కోల్పోయే ప్రమాదంలో ఉండగా.. తమిళనాడులో మాత్రం 6.5 లక్షల మంది ఓటర్లు పెరిగారు. ఇది



ఆందోళనకరమైన చర్య. చట్టవిరుద్ధమైనది. పెరిగిన ఓటర్లను శాశ్వత వలస కార్మికులు అని పిలిస్తే అసలైన వలస కార్మికులను అవమానించినట్లు అవుతుంది. తమిళనాడు ఓటర్లు తమకు నచ్చిన ప్రభుత్వాన్ని ఎన్నుకునే అవకాశం లేకుండా చేసేందుకు ఓట్ల పెంపుదల జరిగింది. ఎన్నికల సంఘం తన అధికారాలను దుర్వినియోగం చేస్తోంది. రాష్ట్రాల ఎన్నికల విధానాలను మార్చేందుకు ఈసీ ప్రయత్నిస్తోంది. ఈ అధికార దుర్వినియోగాన్ని రాజకీయంగా, చట్టబద్ధంగా ఎదుర్కోవాల్సిందే' అని పిలుపునిచ్చారు.ప్రతి భారతీయుడికి శాశ్వత నివాసం ఉన్న ఏ రాష్ట్రంలోనైనా నివసించడానికి, పని చేయడానికి హక్కు ఉంది. అది స్పష్టంగా సరైనది. బీహార్ ప్రస్తుత ఓటర్ల జాబితాలో పేర్లు ఉన్న లక్షల మంది వ్యక్తులు రాష్ట్రం నుండి శాశ్వతంగా వలస వెళ్లారు. కాబట్టి వారిని మినహాయించాలని ఎన్నికల సంఘం ఎలా నిర్ణయానికి వచ్చింది?. ఒక వ్యక్తి ఒక రాష్ట్రం నుండి శాశ్వతంగా వలస వెళ్లారు అని నిర్ధారణకు రాక ముందే, ప్రతి కేసుపై సమగ్ర విచారణ నిర్వహించకూడదా?. సామూహిక ఓటుహక్కుల తొలగింపు అనేది తీవ్రమైన సమస్య, అందుకే సుప్రీంకోర్టు పిటిషన్లను విచారిస్తోంది' అంటూ చెప్పుకొచ్చారు. ఈ క్రమంలోనే చిదంబరం తన పోస్టుకు తమిళనాడు ముఖ్యమంత్రి కార్యాలయాన్ని ట్యాగ్ చేశారు. తమిళనాడు ఓటరు జాబితాలో వలస కార్మికులను చేర్చడంపై అధికార డీఎంకేతో పాటు ప్రాంతీయ పార్టీలు కూడా ఆందోళన వ్యక్తం చేశాయి.

### విమాన సిబ్బందిపై ఆర్మీ అధికారి దాడి

ఢిల్లీ: శ్రీనగర్ విమానాశ్రయంలో దారుణ ఘటన జరిగింది. ఓ ఆర్మీ అధికారి స్పైస్ జెట్ సిబ్బందిపై దాడికి పాల్పడ్డాడు. పరిమితికి మించి అదనపు లగేజీని విమానంలోకి తీసుకెళ్లేందుకు ఆ ఆర్మీ అధికారి ప్రయత్నించగా..స్పైస్ జెట్ సిబ్బంది ఆయనను అడ్డుకున్నారు. ఈ క్రమంలో ఆ ఆర్మీ అధికారి దురుసుగా ప్రవర్తించడంతో పాటు నలుగురు స్పైస్ జెట్ సిబ్బందిపై దాడికి పాల్పడ్డాడు. గత నెల జులై 26న జరగ్గా, ఈ వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.శ్రీనగర్ నుంచి ఢిల్లీకి వెళ్లే స్పైస్ జెట్ విమానంలో ప్రయాణించేందుకు ఆ అధికారి 7 కిలోల పరిమితిని మించి 16 కిలోల లగేజీ తీసుకువచ్చారు. అదనపు ఛార్జ్ చెల్లించాల్సిందిగా స్పైస్ జెట్ సిబ్బంది కోరారు.



దీంతో ఆ ఆర్మీ అధికారి నిరాకరించాడు. భద్రతా ప్రోటోకాల్‌ను ఉల్లంఘించడంతో పాటు.. బోర్డింగ్ ప్రక్రియ పూర్తి చేయకుండా ఏరో బ్రిడ్జిలోకి ప్రవేశించడానికి ప్రయత్నించగా.. సీఐఎస్ఎఫ్ సిబ్బంది ఆ ఆర్మీ అధికారిని గేట్ వద్దకు పంపించారు.మరో వైపు, గేట్ వద్దకు చేరుకున్న ఆర్మీ అధికారి.. అక్కడున్న క్యూ స్టాండ్‌తో స్పైస్ జెట్ గ్రౌండ్ సిబ్బందిపై దాడి చేశాడు. ఒక ఉద్యోగి కిందపడి స్పృహ కోల్పోయినప్పటికీ కొట్టడం ఆపలేదు. అడ్డుకునేందుకు ప్రయత్నించిన మరో ముగ్గురు స్పైస్ జెట్ సిబ్బందిపైనా విచక్షణారహితంగా దాడికి పాల్పడ్డాడు.

# మరింత బలపడుతున్న అనుమానాలు

### ధర్మస్థళ మిస్టరీ కేసులో ఆధారాలపై షాకిచ్చిన ఆర్టీఐ సమాధానం

**ధర్మస్థళ(జనంసాక్షి):**కర్ణాటకలోని ధర్మస్థళలో సామూహిక ఖననాల మిస్టరీ అంతకంతకూ బిగుసుకుంటోంది. వందలాది మృతదేహాలను ఖననం చేశానంటూ, ఒక మాజీ పారిశుద్ధ్య కార్మికుడు చేసిన సంచలన వ్యాఖ్యల దరిమిలా ఏర్పాటైన ప్రత్యేక దర్యాప్తు బృందం (ఎస్ఐటీ) ఈ ఘటనపై ముమ్మర విచారణ చేపట్టింది.తాజాగా ఈ ఉదంతంలో ఆర్‌టీఐ జోక్యంతో మరో మలుపు తిరిగింది.ఆర్టీఐ కార్యకర్త జయంత్ ఈ ప్రాంతంలో ఒక యువతిని అక్రమంగా ఖననం చేశారంటూ ఫిర్యాదు చేయడంతో పాటు, ఒక కుక్కను పాతిపెట్టినట్లు ఆమె మృతదేహాన్ని ఖననం చేశారని ఆరోపించారు. దీనికి సంబంధించిన వివరాలను ఆయన ఐరీటిఐని కోరిన దరిమిలా, కొత్త విషయాలు వెలుగు చూస్తున్నాయి. బెల్తాంగాడి పోలీసులు 2000-2015 మధ్య చోటు చేసుకున్న అసహజ మరణ రికార్డులను తొలగించారని ఆర్టీఐ తెలుపడంతో, ధర్మస్థళ సామూహిక ఖననాలపై నెలకొన్న అనుమానాలు మరింత బలపడుతున్నాయి.బెల్తాంగాడి



పోలీసులు నాటి అసహజ మరణ రికార్డులను తొలగించడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆర్టీఐ కార్యకర్త జయంత్ స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీం (సిట్)కు చేసిన ఒక ఫిర్యాదులో ఒక యువతి మృతదేహాన్ని అక్రమంగా ఖననం చేసినట్లు పేర్కొన్నారు. చట్టపరమైన ప్రోటోకాల్‌లు ఉల్లంఘించారని ఆరోపించారు. ఆ సమయంలో పలువురు అధికారులు దీనికి సాక్ష్యంగా నిలిచారని కూడా ఆయన ఆరోపించారు. తన ఫిర్యాదును పరిశీలించిన సిట్ త్వరలోనే తన ఆరోపణలపై దర్యాప్తు ప్రారంభిస్తుందని భావిస్తున్నానని అన్నారు.ఆర్టీఐని ఆశ్రయించిన జయంత్ బెల్తాంగాడి పోలీస్ స్టేషన్ పరిధిలో అదృశ్యమైన, వ్యక్తుల డేటా, ఫొటోలను తాను కోరినట్లు తెలిపారు. అయితే దీనికి ఆర్టీఐ నుంచి వచ్చిన సమాధానంలో.. బెల్తాంగాడి పోలీసులు నాటి పోస్ట్‌మార్టం నివేదికలు, వాల్ పోస్టర్లు, నోటీసులు గుర్తింపులేని మృతదేహాలకు సంబంధించిన ఫోటోలను సాధారణ పరిపాలనా ఉత్తర్వుల మేరకు నాశనం చేశారని వెల్లడయ్యింది. ఈ సందర్భంగా జయంత్ మీడియాతో మాట్లాడుతూ 'ఆగస్టు 2 న నేను సిట్‌కు ఫిర్యాదు చేశాను.. ఈ ఫిర్యాదు నేను వ్యక్తిగతంగా సేకరించిన సాక్ష్యంతో ఆధారపడి వుంది. యువతి ఖననం సమయంలో హాజరైన ప్రతి ఒక్కరి పేరు నేను తెలియజేశాను. నాడు చట్టపరమైన విధానాలన్నింటినీ ఉల్లంఘించారు. వారు ఒక కుక్కను పాతిపెట్టినట్లుగా ఆ యువతి మృతదేహాన్ని ఖననం చేశారు. అందుకే నేను దీనిపై ఫిర్యాదును దాఖలు చేశాను' అని పేర్కొన్నారు.

# బీహార్‌లా బెంగాల్‌లోనూ చేయాలి

### సువేందు సంచలన డిమాండ్

**హౌరా (పశ్చిమ బెంగాల్): జనంసాక్షి:**

బీహార్‌లో అమలు చేసిన ఓటర్ల జాబితా ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ పశ్చిమ బెంగాల్‌లోనూ అమలు చేయాలని బీజేపీ నేత సువేందు అధికారి డిమాండ్ చేశారు.పశ్చిమ బెంగాల్‌లో కోటి మందికిపైగా రోహింగ్యా వలసదారులు, బంగ్లాదేశ్ ముస్లిం ఓటర్లు అక్రమంగా ఉంటున్నారని ఆయన ఆరోపించారు. హౌరాలో జరిగిన కన్యా సురక్ష యాత్ర సందర్భంగా పార్టీ కార్యకర్తల మధ్య సువేందు అధికారి ఈ విధంగా వ్యాఖ్యానించారు.పశ్చిమ బెంగాల్ ఓటరు జాబితాలో మరణించిన ఓటర్లు, నకిలీ ఎంట్రీలు, నకిలీ ఓటర్లు, రోహింగ్యా వలసదారులు, బంగ్లాదేశ్ ముస్లిం ఓటర్లు ఉన్నారని, ఓటరు జాబితా విశ్వసనీయతను నిర్ధారించడానికి భారత ఎన్నికల సంఘం అక్రమ ఓటర్ల పేర్లను తొలగించాలని సువేందు అధికారి డిమాండ్ చేశారు.కాగా బీహార్‌లో అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఎన్నికల సంఘం ఓటర్ల జాబితా సవరణను చేపట్టింది. తుది ముసాయిదాలో 65 లక్షల మంది ఓటర్లను ఓటర్ల జాబితా నుండి తొలగించారు. పోల్ బాడీ తెలిపిన వివరాల ప్రకారం జూన్ 24, 2025 నాటికి రాష్ట్రంలో ఓటర్ల సంఖ్య 7.89 కోట్లు. అయితే దానికి భిన్నంగా 7.24 కోట్ల గణన ఫారమ్‌లు (ఈ ఎఫ్)లు రావడం విశేషం.

# ట్రంప్ వ్యాఖ్యలకు మద్దతివ్వడానికి రాహుల్‌కు ఇతర కారణాలు ఏమైనా ఉండొచ్చు

### శశిథరూర్ కొత్త ట్విస్ట్.. రాహుల్ వ్యాఖ్యలపై వింత సమాధానం!

ఢిల్లీ: కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ భారత ఆర్థిక వ్యవస్థపై వ్యాఖ్యలు చేయడంపై హస్తం పార్టీ ఎంపీ శశిథరూర్ వింత సమాధానంలో ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు.భారత్ డెడ్ ఎకానమీ అంటూ అమెరికా అధ్యక్షుడి వ్యాఖ్యలను రాహుల్ సమర్థించడంపై శశిథరూర్ స్పందిస్తూ.. ట్రంప్ వ్యాఖ్యలకు మద్దతివ్వడానికి రాహుల్‌కు ఇతర కారణాలు ఏమైనా ఉండొచ్చు అంటూ కామెంట్స్ చేశారు.కాంగ్రెస్ ఎంపీ శశిథరూర్ తాజాగా మీడియా ప్రశ్నలపై స్పందిస్తూ.. భారత్‌కు వ్యూహాత్మక, ఆర్థిక భాగస్వామిగా అమెరికా చాలా ముఖ్యమైంది. ఎందుకంటే భారత్ నుంచి అమెరికాకు దాదాపు 90 బిలియన్ డాలర్ల విలువైన వస్తువులు ఎగుమతి అవుతున్నాయి. ఇరుదేశాల మధ్య సముచిత వాణిజ్య ఒప్పందం కుదిరేలా ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలి. ఇక, ట్రంప్ వ్యాఖ్యలకు మద్దతివ్వడానికి రాహుల్‌కు మరేమైనా కారణాలు ఉండొచ్చు. అయితే, రాహుల్ అభిప్రాయంపై తాను ఎటువంటి వ్యాఖ్యలు చేయదలుచుకోలేదన్నారు.ఇదిలా ఉండగా.. ఇటీవల శశిథరూర్‌కు కాంగ్రెస్ పార్టీకి మధ్య అభిప్రాయభేదాలు తెరపైకి వస్తున్నాయి. ఆయన వ్యవహార శైలిపై సొంత పార్టీలో అసంతృప్తి పెరుగుతున్నట్లు కనిపిస్తోంది. ఈ నేపథ్యంలో రాహుల్‌పై థరూర్ వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. దీంతో, థరూర్ వ్యాఖ్యలు సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నాయి.మరోవైపు.. భారత్ టార్గెట్‌గా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంచలన వ్యాఖ్యలు చేస్తున్నారు. ఓ వైపు భారత్‌ను మిత్రదేశం అంటూనే మన ఆర్థిక వ్యవస్థను ఉద్దేశించి అనుచిత వ్యాఖ్యలు చేశారు. రష్యా, భారత్.. వాటి డెడ్ ఎకానమీలను మరింత దిగజార్చుకోనీయండంటూ వ్యాఖ్యానించారు. రష్యాతో వాణిజ్యం కొనసాగిస్తుందనే కారణం చూపుతూ.. భారత నుంచి దిగుమతులపై 25శాతం సుంకాలతో పాటు పెనాల్టీలు విధించారు. ఈ క్రమంలోనే రష్యాతో భారత్ ఎలాంటి వాణిజ్యం చేసుకున్నా తనకు సంబంధం లేదన్నారు. ఇరు దేశాలు ఆర్థికవ్యవస్థలను మరింత పతనం చేసుకుంటున్నాయని వ్యాఖ్యానించారు. అనంతరం, ట్రంప్ వ్యాఖ్యలను రాహుల్ గాంధీ ఆయన వ్యాఖ్యలను సమర్థించారు. ఈ క్రమంలో వివాదం నెలకొంది.

# నితిన్ గడ్కరీ ఇంటికి బాంబు బెదిరింపు..



నాగపూర్: ఇటీవలి కాలంలో బాంబు బెదిరింపు కాల్స్, మెయిల్స్ రావడం తీవ్ర కలకలం సృష్టిస్తున్నాయి. ఈ క్రమంలోనే తాజాగా కేంద్ర రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ నివాసానికి బాంబు బెదిరింపు రావడం సంచలనంగా మారింది.దీంతో, రంగంలోకి దిగిన పోలీసులు.. గాలింపు చర్యలు చేపట్టారు.వివరాల ప్రకారం.. మహారాష్ట్రలోని నాగపూర్‌లో ఉన్న నితిన్ గడ్కరీ నివాసంలో బాంబు పెట్టినట్లు ఓ వ్యక్తి.. పోలీసులకు ఫోన్ చేసి చెప్పాడు. దీంతో, అప్రమత్తమైన పోలీసులు, బాంబ్‌స్క్వాడ్.. గడ్కరీ ఇంట్లో గాలింపు చర్యలు చేపట్టారు. సోదాల తర్వాత ఎటువంటి పేలుడు పదార్థాలు దొరకకపోవడంతో అది నకిలీ బెదిరింపు అని తేల్చారు. అనంతరం ఫోన్ నంబర్ ఆధారంగా గంటల వ్యవధిలోనే పోలీసులు నిందితుడిని అరెస్టు చేశారు. నకిలీ బెదిరింపు కాల్ చేసిన వ్యక్తిని నాగ్‌పుర్ తులసి బాగ్ రోడ్‌లోని మద్యం దుకాణంలో పనిచేసే ఉమేష్ విష్ణు రౌత్‌గా గుర్తించామన్నారు. బెదిరింపు కాల్ చేయడానికి గల కారణాలపై దర్యాప్తు కొనసాగుతోందన్నారు.

# ఇండియా కూటమి కీలక భేటీ

అంశాలపై విపక్ష నేతలు చర్చిస్తారని సమాచారం.బిహార్‌లో ప్రస్తుతం ఎన్నికల సంఘం నిర్వహిస్తున్న ఓటరు జాబితా సమగ్ర సవరణ ప్రక్రియ, మహారాష్ట్ర ఓటరు జాబితాలపై ఆరోపణలు, ఆపరేషన్ సిందూర్, భారత్ - అమెరికా వాణిజ్య ఒప్పందం, భారత్‌పై ట్రంప్ విధించిన సుంకాలపై ఈ సమావేశంలో చర్చించే అవకాశం ఉందని సంబంధిత వర్గాలు తెలిపాయి. తాను తప్పకుండా ఆగస్టు 7న జరిగే ఇండియా కూటమి సమావేశానికి హాజరవుతానని నేషనల్ కాన్ఫరెన్స్ పార్టీ నేత ఫరూఖ్ అబ్దుల్లా శనివారం రోజ్జే వెల్లడించారు.త్వరలో జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ-జేడీయూ కూటమిని గెలిపించేందుకే బిహార్‌లో ఓటరు జాబితాల సవరణ ప్రక్రియను చేపట్టారని ఆయన ఆరోపించారు. ఈ అంశాలను సమావేశంలో తాను ప్రస్తావిస్తానన్నారు. బిహార్‌లో ప్రస్తుతం అధికారంలో ఉన్న వాళ్లనే తిరిగి గెలిపించేందుకు ఇప్పటికే ఏర్పాట్లు చేశారని ఫరూఖ్ అబ్దుల్లా వ్యాఖ్యానించారు. తనకు కూడా రాహుల్ గాంధీ నుంచి పిలుపు వచ్చిందని, ఆగస్టు 7న జరిగే సమావేశానికి హాజరవుతానని సీపీఐ నేత డీ రాజా చెప్పారు. సమావేశ ఎజెండా ఏమిటనేది ఇంకా తెలియదన్నారు. త్వరలోనే అన్ని విషయాలు తెలుస్తాయని పేర్కొన్నారు.బిహార్‌లో ఓటర్ల తొలగింపు, మహారాష్ట్రలో లక్షలాది ఓటర్ల చేరికతో ముడిపడిన ఆరోపణలపై కేంద్ర ఎన్నికల సంఘం నుంచి సమాధానాలు రావాల్సి ఉందని శివసేన (ఉద్ధవ్) నాయకురాలు ప్రియాంకా చతుర్వేది అన్నారు.





# విద్యా, వైద్యం రెండు కళ్ల లాంటివి

- రాబోయే కాలంలో మునుగోడులో కంటి ఆసుపత్రి నిర్మాణం
- నియోజకవర్గంలోని 18 రెసిడెన్షియల్ పాఠశాలల్లో కోమటిరెడ్డి సుశీలమ్మ ఫౌండేషన్ ద్వారా మౌలిక సదుపాయాలు
- ఇది కేవలంసేవా కార్యక్రమం - రాజకీయాలకు అతీతం
- కమిషన్ల కోసం కాళేశ్వరం ప్రాజెక్ట్
- తుమ్మిడిహట్టి వద్ద నీరు లభ్యత ఉన్నా మేడిగడ్డ ఎంపిక
- కాళేశ్వరంలో డిజైన్ లోపం, అశ్రద్ధ, నిర్లక్ష్యం, అవినీతి
- ఉచిత కంటి వైద్య శిబిరం ప్రారంభోత్సవంలో మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజ్ గోపాల్‌రెడ్డి

**చండూరు, ఆగష్టు 3 (జనం సాక్షి) :** విద్యా, వైద్యం రెండు కళ్ళ లాంటివని, రాబోయే కాలంలో మునుగోడు లోనే కంటి ఆసుపత్రి నిర్మించి, శస్త్ర చికిత్సలు నిర్వహిస్తామని మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి అన్నారు. ఆదివారం నల్గొండ జిల్లా చండూరు మండలం బంగారి గడ్డ గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో కోమటిరెడ్డి సుశీలమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఫీనిక్స్ ఫౌండేషన్, శంకర్ కంటి ఆసుపత్రి సౌజన్యంతో నిర్వహించిన 6 వ విడత ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఆయన జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మునుగోడు నియోజకవర్గం లో ఏ ఒక్కరూ కంటి సమస్యలతో బాధపడకుండా ఉండాలని గత ఆరు నెలలుగా ఉచిత కంటి వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నామని, ఈ ఉచిత కంటి వైద్య శిబిరంలో కంటి శస్త్ర చికిత్స అవసరం ఉన్నవారికి హైదరాబాదు పంపించి చేయిస్తున్నామని, ఇప్పటివరకు ఐదు విడతలుగా నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరంలో 853 మందికి కంటి శస్త్ర చికిత్సలు నిర్వహించామని తెలిపారు. అయితే రాబోయే కాలంలో మునుగోడు లోనే కంటి ఆసుపత్రి నిర్మించి ఇక్కడే కంటి సమస్యలతో బాధపడుతున్న వారికి ఉచితంగా కంటి శస్త్ర చికిత్సలు చేయించేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నామని ఆయన వెల్లడించారు. మునుగోడు లో కంటి ఆసుపత్రి నిర్మిస్తే మునుగోడు నియోజకవర్గం తో పాటు నకిరేకల్, నల్గొండ వివిధ నియోజకవర్గాల పేద ప్రజలకు ఉచితంగా వైద్య సేవలు అందించే అవకాశం ఉంటుందని ఆయన చెప్పారు. కాగా కంటి వైద్యం కోసం ఈ ఉచిత కంటి వైద్య శిబిరానికి తరలి వచ్చిన ప్రతి ఒక్కరినీ ఎమ్మెల్యే రాజ్ గోపాల్ రెడ్డి ఆత్మీయంగా పలకరిస్తూ వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అలాగే నాణ్యమైన వైద్య పరీక్షలు నిర్వహించాలని ఆయన డాక్టర్లకు సూచించారు. అంతే కాకుండా. మునుగోడు నియోజకవర్గంలోని 18 రెసిడెన్షియల్ పాఠశాలల్లో కోమటిరెడ్డి సుశీలమ్మ ఫౌండేషన్ ద్వారా కనీస మౌలిక సదుపాయాలు కల్పించనున్నట్లు ఆయన వెల్లడించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. కేవలం కమిషన్ల కోసం మాత్రమే నిర్మించింది కాళేశ్వరం ప్రాజెక్టు అని అన్నారు. తుమ్మిడి హట్టి వద్ద నీటి లభ్యత ఉన్నా కూడా మేడిగడ్డ వద్ద నిర్మించారన్నారు. కాళేశ్వరం లో డిజైన్ లోపంతో పాటు అశ్రద్ధ, నిర్లక్ష్యం, అవినీతి చోటుచేసుకుందని అంటూనే కారకులు ఎంతటి వారైనా ప్రభుత్వం కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసి లక్షల కోట్ల అప్పులు చేసి రాష్ట్రాన్ని అప్పుల పాలు చేసిన వారిపై కఠిన చర్యలకు పూనుకోవాలని, గొర్రెల స్కాము, లిక్కర్ మాఫియా, గ్రానైట్ మాఫియా, ఇసుక మాఫియా, భూ మాఫియా లకు పాల్పడిన వారిని సైతం కఠినంగా శిక్షించాలన్నారు.

చండూరు మండల ప్రజలకు ఈరోజు నిర్వహించిన ఆరో విడత ఉచిత కంటి వైద్య శిబిరంలో 614 మందికి వైద్య పరీక్షలు నిర్వహించగా.. అందులో 245 మంది కంటి శస్త్ర చికిత్సకు ఎంపికయ్యారు. వీరిలో 117 మందిని వెంటనే ఆపరేషన్ కొరకు హైదరాబాదులోని శంకర్ కంటి ఆసుపత్రికి తరలించారు. మిగిలిన 128 మందిని మంగళవారం రోజు తీసుకెళ్ళనున్నారు.

## అల్ఫోర్స్ ఇ-టెక్నో స్కూల్‌లో ఘనంగా
# స్నేహితుల దినోత్సవ వేడుకలు



**కరీంనగర్ జిల్లా బ్యూరో, ఆగస్టు 03 (జనంసాక్షి) :**
స్నేహితుల ద్వారా ఆనందంతో పాటు సమస్యలకు పరిష్కారం దొరుకుతుందని అల్ఫోర్స్ విద్యా సంస్థల అధినేత డా.వి.నరేందర్ రెడ్డి స్థానిక కొత్తపల్లి లోని అల్ఫోర్స్ ఇ-టెక్నో పాఠశాలలో స్నేహితుల దినోత్సవాన్ని పురస్కరించుకొని ఏర్పాటు చేసినటువంటి ప్రత్యేక వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరై ఉపాధ్యాయులతో ముఖాముఖి నిర్వహించి వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఆపదకు ఆపన్న హస్తంగా స్నేహితులు ఉంటారని, అభివృద్ధికి చేయూతనిచ్చేది స్నేహితులను చెప్పడంలో ఎటువంటి సందేహం లేదని వారు తెలుపుతూ ముఖ్యంగా నేటి పోటీ ప్రపంచంలో సమయభావం వలన చాలామంది స్నేహితులకు దూరమవుతున్నారని, వారితో సంప్రదింపులను సైతం ఏ రూపంలో జరపకపోవడం అత్యంత విచారకరగామని తెలుపుతూ ప్రతి ఒక్కరూ సమయాన్ని కేటాయించి స్నేహానికి మద్దతు తెలిపాలని స్నేహాన్ని పరిరక్షించుకోవాలని వారు తెలిపారు. ముఖ్యంగా తరతరాల నుండి వస్తున్నటువంటి స్నేహబంధ వైవిధ్యాన్ని, గొప్పతనాన్ని , విశిష్టతను ప్రతి ఒక్కరు పాటించడమే కాకుండా స్నేహబంధం లో ఉన్నటువంటి నైతిక విలువలను అమలు చేస్తూ ఆదర్శంగా నిలవాలని వారు తెలిపారు. ముఖ్యంగా సమాజంలో ఒకరికొకరు పరస్పరంగా సహకరించుకొని ఒకరి అభివృద్ధి ఒకరు కోరుకోవాలని వారు సూచించారు. స్నేహితులంటేే ఆపదలో ఆదుకునే వారని సుఖసంతోషాలను పంచుకునే వారని పలు కష్టాలకు పరిష్కారం తెలిపేటటువంటి వారిని వారు గుర్తు చేస్తూ స్నేహానికి ఎటువంటి రూపం లేదని రంగు లేదని కుల మతాలకతీతంగా స్నేహబంధాలను పెంపొందించుకొని సమాజ అభివృద్ధి వైపు అడుగులు వేయాలని వారు సూచించారు. వేడుకలలో భాగంగా ఉపాధ్యాయులు నరేందర్ రెడ్డి కి ఫ్రెండ్షిప్ రాఖీలను కట్టి శుభాకాంక్షలు తెలియజేసి వారి సహకారాన్ని అభివృద్ధికి అందించి ఆశీర్వదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఉపాధ్యాయులు ప్రదర్శించినటువంటి పలు సాంస్కృతిక కార్యక్రమాలు అలరింప చేయడమే కాకుండా ఆలోచింపచేసాయి ప్రధానంగా స్నేహితుడా ఓ స్నేహితుడా నృత్య ప్రదర్శన మంత్రముగ్ధులను చేసింది. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, తల్లిదండ్రులు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## కార్మికులకు ఇచ్చిన హామీలు
# అమలు చేయాలి

- లేకుంటే సింగరేణి వ్యాప్తంగా పోరాటాలు
- టీబీజీకేస్ ఇంచార్జ్ కొప్పుల ఈశ్వర్



**గోదావరిఖని, జనంసాక్షి :** సింగరేణిలో 9 నెలల తర్వాత జూలై 30 , 31న జరిగిన మెడికల్ బోర్డు లో పిలిచిన ఉద్యోగులలో 55 మందికి కేవలం ఐదుగురిని మాత్రమే అన్ఫిట్ చేయడం దారుణమని. మైనింగ్ స్టాప్ సోదరులను సూటబుల్ జాబ్ అని చెప్పి జనరల్ అసిస్టెంట్ గా మార్చడం గుర్తింపు ప్రాతినిధ్య సంఘాల వైఫల్యం అని పేర్కొన్నారు. గతంలో కేసీఆర్ 100కు 100% ఉద్యోగాలు ఇవ్వాలని కోరారు. మెడికల్ బోర్డుకి ఇబ్బంది జరుగుతుందని 80 నుండి 90% ఇన్వాల్యుయేషన్ చేశారన్నారు. 19,000 మందికి ఉద్యోగాలు ఇచ్చారన్నారు. ఇప్పటి పరిస్థితి చూస్తే రాబోయే రోజుల్లో కారుణ్య నియామకాలను కనుమరుగు చేసే పరిస్థితి కనబడుతుందని పేర్కొన్నారు. సింగరేణిలో రాజకీయ జోక్యం పెరిగిపోయి మంత్రులు ఎమ్మెల్యేలు ఆధిపత్యం నడుస్తుందని టీబీజీకేస్ లో పనిచేసేనాయకులను ఇబ్బంది పెట్టే కుట్రలు జరుగుతున్నాయని రాజకీయ జోక్యంతో ట్రాన్స్ఫర్ అయినా టీబీజీకేస్ నాయకులు మాదాసు రామ్మూర్తి జావిద్ పాషా కొమురయ్యల ట్రాన్స్ఫర్లను వెంటనే రద్దు చేయాలని యాజమాన్యాన్ని కోరారు. సింగరేణిలో రక్షణ వైఫల్యాలు జరుగుతున్నాయని మందమర్రిలో జరిగిన ప్రమాదంలో ఎస్డిల్ యాక్టింగ్ ఆపరేటర్ రాచపల్లి శ్రావణ్ కుమార్ మరణించడం దురదృష్టకరమని పేర్కొన్నారు రక్షణ కమిటీ సమావేశాలు ఏడైనా లో జరగడం లేదన్నారు యాజమాన్యం రక్షణ పై శ్రద్ధ లేకపోవడం వల్లనే ప్రమాదాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. మెడికల్ బోర్డులు అప్లై చేసుకున్న వారందరిని అన్ఫిట్ 100% చేస్తామని ఎలక్షన్ల ముందు వాగ్దానాలు చేసి ఏఐటీయూసీ , ఐఎన్టియుసి నాయకులు కార్మికుల నోట్లో మట్టి కొట్టారని. 30 31 తారీఖున జరిగిన మెడికల్ బోర్డు ను పున సమీక్షించి కార్మికులకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో టిఆర్ఎస్ నాయకులు కోరుకంటి చందర్. పుట్ట మధు టి బిజి కేస్ అధ్యక్షులు మిర్యాల రాజిరెడ్డి. సురేందర్ రెడ్డి మాదాసు రామ్మూర్తి నూనె కొమరయ్య. వడ్డేపల్లి శంకర్ నాగెల్లి, సాంబయ్య, మేడిపల్లి సంపత్, చెల్పూరి సతీష్, మాకు రమేష్, అన్వేష్ రెడ్డి, పాశం శ్రీనివాస్ రెడ్డి, ముదిరాజ్ పల్లి రాజేశం , ఇందురి సత్యనారాయణ, చిలకలపల్లి శ్రీనివాస్ , చల్లా రవీందర్ రెడ్డి, దూట శేషగిరి, కొండ్ర అంజయ్య, వాసాల్ల జోసెఫ్ , బొడ్డు రమేష్, రొడ్డ సంపత్ , పులిపాక శంకర్, మీస రాజు, మురళి, అధిక సంఖ్యలో టీబీజీకేస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ శ్రేణులతో ఆలూర్‌లో శ్రమదానం

- ప్రభాత్ బేరి నిర్వహించి ప్రతిజ్ఞ,కాంగ్రెస్ పార్టీ జెండా ఆవిష్కరణ
- ఏఐసిసి ఇంచార్జి మీనాక్షి నటరాజన్, పిసిసి అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్

**ఆర్మూర్ ఆగష్టు 3 ( జనంసాక్షి):** జనహిత పాదయాత్రలో భాగంగా ఆలూరు మండల కేంద్రంలో ఏఐసిసి తెలంగాణ వ్యవహారాల ఇంచార్జీ మీనాక్షి నటరాజన్, మంత్రి సీతక్క కాంగ్రెస్ శ్రేణులతో కలిసి శ్రమదానం లో పాల్గొన్నారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గుంతలు తవ్వి మొక్కలను నాటారు. ఆర్మూర్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ వినయ్ రెడ్డి, డిసిసి అధ్యక్షుడు మానాల మోహన్ రెడ్డి, సునీల్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు,యువత కాంగ్రెస్ జెండాను చేత పట్టి ప్రభాత్ బేరి నిర్వహించి ర్యాలీగా సుభాష్ చంద్రబోస్ విగ్రహం వద్ద ప్రతిజ్ఞ చేశా రు. కాంగ్రెస్ పార్టీ ఆర్ గ్యారంటీల అమలులో పథకాలు, అభివృద్ధి పై ప్రజలకు వివరించారు. అనంతరం అంకాపూర్ గ్రామం చేరుకున్న పిసిసి అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్, ఏఐసీసీ ఇన్చార్జ్ మీనాక్షి నటరాజన్ కాంగ్రెస్ పార్టీ జెండాను ఆవిష్కరించారు. పెద్ద ఎత్తున గ్రామస్తులు, గ్రామ కాంగ్రెస్ నాయకులు వారిరువురికి ఘన స్వాగతం పలికారు. గ్రామం నుండి ర్యాలీగా వెళ్లి బయలుదేరి అల్పాహారం తీసుకున్నారు.ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్, మార్క్ ఫెడ్ రాష్ట్ర చైర్మన్ మారా గంగారెడ్డి, ఎస్టీ కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ తిరుపతి నాయక్, టిపిసిసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నరేష్ జాదవ్, బాల్కొండ నియోజకవర్గ ఇన్చార్జి సునీల్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ సాయిబాబా గౌడ్, వైస్ చైర్మన్ జీవన్, పార్టీ మండల అధ్యక్షులు ముక్కెర జీవన్ విజయ్, మంద మహిపాల్, చిన్నారెడ్డి, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ మార చంద్రమోహన్, మాజీ ఎంపీటీసీ సభ్యుడు ఎంసి గంగారెడ్డి,దేగాం శ్రీనివాస్ గౌడ్, మున్సిపల్ వైస్ చైర్మన్లు మున్నుభాయ్,లింగారెడ్డి, సీనియర్ నాయకులు ఖాందేష్ శ్రీనివాస్,చిట్టి రెడ్డి, ఉపేందర్ పాల్గొన్నారు.

# కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేస్తాం





- జిల్లా ఇంచార్జి మంత్రి దనసరి అనసూయ (సీతక్క)
- నియోజకవర్గంలో ఆరు మండలాలు చేసింది పరిపాలనా సౌలభ్యం కోసమే
- రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు, స్థానిక ఎమ్మెల్యే పోచారం


**నిజామాబాద్ జిల్లా బ్యూరో, ఆగస్టు 03 (జనం సాక్షి):** కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేసే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందని జిల్లా ఇంచార్జి మంత్రి, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమం, గ్రామీణ నీటి సరఫరా శాఖ మంత్రి దనసరి అనసూయ (సీతక్క) పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో మహిళల ఆర్థిక సాధికారత కోసం విస్తృత సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు అమలవుతున్నాయని ఆమె తెలిపారు. నిజామాబాద్ జిల్లాలోని మోస్రా, చందూర్ మండల కేంద్రాల్లో నూతనంగా నిర్మించిన సమీకృత మండల కార్యాలయ భవనాలను, మోస్రాలో జనరల్ ఫంక్షన్ హాల్‌ను, చందూర్‌లో గ్రామ పంచాయతీ భవనాన్ని మంత్రి సీతక్క ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా రాష్ట్ర వ్యవసాయ సలహాదారు, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి, జహీరాబాద్ ఎంపీ సురేష్ షెట్కర్, రాష్ట్ర ఆగ్రోస్ ఇండస్ట్రీస్ చైర్మన్ కాసుల బాలరాజు, కలెక్టర్ టి. వినయ్ కృష్ణారెడ్డితో కలిసి లబ్ధిదారులకు రేషన్ కార్డుల మంజూరీ పత్రాలు, స్వయం సహాయక మహిళా సంఘాలకు వడ్డీ లేని బ్యాంకు రుణాలను పంపిణీ చేశారు.

మహిళల శ్రేయస్సు కోసం ప్రభుత్వం అనేక చర్యలు చేపడుతోందని మంత్రి సీతక్క తెలిపారు. అధికారంలోకి వచ్చిన వెంటనే ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించినట్లు గుర్తు చేశారు. ప్రస్తుతం మహిళలను ఆర్టీసీ అద్దె బస్సుల యజమానులుగా మార్చే కార్యక్రమం చేపట్టామని, పెట్రోల్ బంకులు, మహిళా శక్తి క్యాంటీన్లు, ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వహణ, స్కూల్ యూనిఫామ్ స్టిచింగ్, సోలార్ విద్యుత్ ప్లాంట్‌ల ఏర్పాటు వంటి కార్యకలాపాల ద్వారా స్వయం సహాయక సంఘాల ఆర్థిక ప్రగతికి బాటలు వేస్తున్నామని వివరించారు. ఏడాదిన్నర కాలంలో రూ.26 వేల కోట్ల వడ్డీ లేని రుణాలను మహిళా సంఘాలకు అందించామని, ఇందిరమ్మ ఇళ్లను మహిళల పేరిట మంజూరు చేస్తూ భద్రత కల్పిస్తున్నామని తెలిపారు. స్వయం సహాయక సంఘాల సభ్యులకు ప్రమాద బీమా, లోన్ బీమా సౌకర్యాలు కల్పిస్తున్నామని, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, రూ.500కే వంట గ్యాస్ సిలిండర్, మహిళల పేరిట రేషన్ కార్డుల మంజూరీ, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల్లో ప్రాతినిధ్యం వంటి చర్యలు చేపట్టామని పేర్కొన్నారు. సన్న బియ్యం పంపిణీ ద్వారా పేదల కడుపు నిండేలా చేస్తున్నామని, 60 ఏళ్లు దాటిన మహిళలకు కూడా స్వయం సహాయక సంఘాల్లో సభ్యత్వం కల్పిస్తున్నామని సీతక్క స్పష్టం చేశారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి రూ.1 లక్ష వడ్డీ లేని రుణాలు అందిస్తున్నామని, మహిళలు స్వయం సహాయక సంఘాల్లో చేరి ఆర్థిక అభివృద్ధి సాధించాలని పిలుపునిచ్చారు.

రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, బాన్సువాడ నియోజకవర్గంలో పరిపాలనా సౌలభ్యం కోసం నాలుగు మండలాల నుంచి ఆరు కొత్త మండలాలను ఏర్పాటు చేశామని తెలిపారు. బాన్సువాడ మున్సిపాలిటీగా రూపాంతరం చెందిందని, కొత్త మండలాల్లో సమీకృత కార్యాలయ భవనాలతో అధికారులు ప్రజలకు సమర్థవంతంగా సేవలందిస్తారని అన్నారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం, రెండు పడక గదుల ఇండ్లు వంటి సంక్షేమ కార్యక్రమాలు విస్తృతంగా అమలవుతున్నాయని, లబ్ధిదారులకు రూ.5 లక్షల ఆర్థిక సహాయం మాఫీతో అందిస్తున్నామని వివరించారు. పోడు పట్టాలను అర్హులకు పంపిణీ చేశామని, మిగిలిన వారికి కూడా అందించేందుకు చొరవ చూపాలని మంత్రిని కోరగా, సీతక్క సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో, మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్ రెడ్డి, డీసీసీబీ మాజీ చైర్మన్ పోచారం భాస్కర్ రెడ్డి, డీపీఓ శ్రీనివాస్ రావు, పంచాయతీరాజ్ ఈఈ శంకర్, సంబంధిత శాఖల అధికారులు, మార్కెట్ కమిటీలు, సహకార సంఘాల చైర్మన్లు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

*నిరుద్యోగులు ఎలాంటి ధర్నాలు, నిరసనలకు పిలుపునివ్వకపోయినా ఆదివారం చిక్కడపల్లి నగర కేంద్ర గ్రంథాలయం, అశోక్‌నగర్ తదితర ప్రాంతాల్లో పోలీసులు నిర్బంధించారు. పలువురు నిరుద్యోగులను అరెస్టు చేసి చిక్కడపల్లి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. నిరుద్యోగులు రవి రాథోడ్, విశాల్, నితీష్, నవీన్, అమర్‌ను అక్రమంగా అరెస్టు చేశారు.*

## మంత్రి సీతక్క సాక్షిగా..
# భగ్గుమన్న బాన్సువాడ




**నిజామాబాద్ జిల్లా బ్యూరో (జనం సాక్షి) :**
ఉమ్మడి నిజామాబాద్ జిల్లా ఇంచార్జి మంత్రి దనసరి అనసూయ (సీతక్క) సాక్షిగా బాన్సువాడ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ వర్గ విభేదాలు భగ్గుమాన్నాయి. ఆదివారం బాన్సువాడ పర్యటనలో భాగంగా మంత్రి సీతక్క పలు కార్యక్రమాల్లో పాల్గొనడానికి హాజరయ్యారు. అయితే తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహాదారులు, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి వర్గం అదేవిదంగా ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్ రెడ్డి వర్గం మంత్రి ఉండగానే బహాబాహికి దిగారు. అయితే బాన్సువాడ నియోజకవర్గంలోని చందూర్ మండల కేంద్రంలో పంచాయతీ భవనాన్ని ప్రారంభించేందుకు మంత్రి సీతక్క వెళ్తున్న సమయంలో పంచాయతీ భవనంలోకి ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి తీసుకెళ్లగా తాను కూడా మంత్రితోపాటు పంచాయతీ భవనంలోనికి వెళ్తానంటూ మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్ రెడ్డి వెళ్ళబోతుండగా పోచారం వర్గీయులు ఆయనను లోపలికి వెళ్ళనివ్వకుండా అడ్డుకున్నారు. దీంతో ఇరు వర్గాలకు చెందిన నాయకులు, కార్యకర్తల మధ్య తోపులాట జరిగింది. తాను కాంగ్రెస్ పార్టీకి చెందిన వాడిన కాదా మంత్రిగారే సమాధానం చెప్పాలి అంటూ పార్టీకి చెందిన కొందరు నేతలు ఆందోళన చేపట్టారు. దీంతో ఒక దశలో పరిస్థితి ఉద్రిక్తతకు దారి తీసింది. దీంతో మంత్రి సీతక్క ఒక్కసారిగా కంగుతిన్నారు. ఒకపక్క జనహిత పాదయాత్ర నడుస్తుండగా మరోవైపు సొంత పార్టీకి చెందిన నేతలే ఇలా చేయడం మంచిది కాదంటూ సదరు నేతలకు మంత్రి హితవు పలికినట్లు తెలుస్తోంది. ఏదిఏమైనా బాన్సువాడ అసెంబ్లీ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ తరపున మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్ రెడ్డి పోటీ చేసి ఓటమి చెందడంతో ఆయనను అధిష్టానం బాన్సువాడ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జిగా ప్రకటించింది. అనంతరం జరిగిన రాజకీయ పరిణామాల నేపథ్యంలో మాజీ స్పీకర్, ప్రస్తుత బాన్సువాడ శాసనసభ్యులు పోచారం శ్రీనివాస్ రెడ్డి బీఆర్ఎస్ కు స్వస్తి చెప్పి కాంగ్రెస్ పార్టీలోనికి రాష్ట్ర ముఖ్యమంత్రి ఆహ్వానం మేరకు చేరిన విషయం అందరికి తెలిసిందే. ఆయన చేరికతో బాన్సువాడకు కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి ఉండరని టీపీసీసీ చీఫ్ బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ సైతం స్పష్టత ఇవ్వడం సైతం జరిగింది. అయినప్పటికీ బాన్సువాడ నియోజకవర్గంలోని కాంగ్రెస్ లో మాత్రం వర్గ విభేదాలు ఇంకా చల్లారకపోవడంతో ద్వితీయ శ్రేణి నాయకులు మాత్రం ఇబ్బంది పడుతున్నారనే చెప్పాలి. ఈ ప్రభావం ఖచ్చితంగా స్థానిక సంస్థలపై పడుతుందని నాయకులు, కార్యకర్తలు తీవ్ర భయాందోళనలో ఉన్నారు.

## విద్యాధికారుల నిర్లక్ష్యం..
# అనుమతులేని పాఠశాలల జోరు
## ఆర్జెడికి ట్రస్మా ఆధ్వర్యంలో ఫిర్యాదు

**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి ఆగస్టు 3 (జనంసాక్షి) :**
వేములవాడలో అనుమతులు లేని పాఠశాల నడవడానికి కారణం విద్యాశాఖ అధికారులేనని ట్రస్మా నాయకులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.2025- 26 విద్యా సంవత్సరానికి విద్యా సంస్థలకు కావలసిన నిర్వహణ అనుమతులు ప్రభుత్వం నుండి లేకుండా నిర్వహిస్తున్న ఆరు పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని జూన్ విద్యా సంవత్సరం ప్రారంభం నుండి మండల విద్యాధికారిని పలుమార్లు అనుమతి ఉన్న ప్రైవేట్ పాఠశాలల సంఘం ట్రస్మా ఆధ్వర్యంలో ఫిర్యాదు చేశామన్నారు. మండల విద్యాధికారి నిర్లక్ష్యంగా వ్యవహరించి వాటిపైన ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం వలన తిరిగి జిల్లా విద్యాధికారికి అనుమతులు లేని పాఠశాలలపై విద్యాశాఖ పరంగా చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశామన్నారు. జిల్లా విద్యాధికారి నుండి ఎలాంటి స్పందన లేకపోవడం వలన జిల్లా కలెక్టర్ కు ఫిర్యాదు చేయగా ఆట్టి ఫిర్యాదుపై జిల్లా కలెక్టర్ వెంటనే స్పందించి జిల్లా విద్యాధికారికి,మున్సిపల్ కమిషనర్ ఇట్టి పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.జిల్లా విద్యాధికారి అనుమతులు లేని పాఠశాలను పరిశీలించి వాటిపై ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు.
జిల్లా విద్యాధికారి కూడా వీటిపై స్పందించకపోవడంతో వరంగల్‌లోని ఆర్జెడికి ఫిర్యాదు చేయగా అనుమతులు అని పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారన్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశాలు ఆర్జెడి ఆదేశాలు అమలు చేయకపోవడంతో ప్రైవేట్ పాఠశాలల సంఘం సభ్యులందరూ చర్చించి మన నిరసనను సంబంధిత విద్యాధికారులకు తెలియజేస్తే స్పందన వస్తుందనే ఉద్దేశంతో ప్రభుత్వ అనుమతి లేని పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థిని విద్యార్థుల భవిష్యత్తు దృష్ట్యా వీరికి కావలసిన స్టడీ సర్టిఫికెట్లు అపార్ ఐడి యుడైస్ నమోదు కాకపోవడం వల్ల విద్యా సంవత్సరం నష్టపోతారని భావించి వేములవాడ పట్టణంలోని ప్రభుత్వ అనుమతి ఉన్న పాఠశాలలు బందుకు పిలుపు ఇవ్వడం జరిగిందన్నారు.అనుమతులు ఉన్న ప్రైవేటు పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థిని విద్యార్థుల తల్లిదండ్రులు అందరూ పాఠశాలల బందుకు సహకరించగలరని కోరారు.

# కేవికే శాస్త్రవేత్తకు డాక్టర్ ఆఫ్ ఫిలిసాఫీ పురస్కారం
## రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ చేతుల మీదుగా పురస్కారం అందుకున్న వినోద్‌కుమార్



**ముత్తారం ఆగస్టు 03(జనంసాక్షి) :** ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం 55వ స్నాతకోత్సవమును ఆదివారం రోజున హైదరాబాద్ లోని యూనివర్సిటీ ఆడిటోరియంలో ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ విచ్చేశారు ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో భాగంగా పెద్దపల్లి జిల్లాలోని రామగిరి మండలంలోని కృషి విజ్ఞాన కేంద్రంలో వ్యవసాయ శాస్త్రవేత్త విధులు నిర్వహిస్తున్న డా. తాటికొండ వినోద్ కుమార్ కు రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ భారత వ్యవసాయ పరిశోధనా మండలి, న్యూఢిల్లీ, డైరెక్టర్ జనరల్,డాక్టర్ మంజీత్ లాల్ జెట్, ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఉపకులపతి డాక్టర్ ఆల్దస్ జానయ్య చేతుల మీదుగా డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ పట్టా అందజేశారు. ఈ సందర్భంగా వినోద్ కుమార్ మాట్లాడుతూ మార్కెట్ ఆధారిత వ్యవసాయం తోపాటు పంటల సాగు అనే అంశం మీద పరిశోధన నిర్వహించినందుకు గాను రాష్ట్ర గవర్నర్ చేతుల మీదుగా పురస్కారం అందుకోవడం చాలా సంతోషంగా ఉందని అన్నారు.



# 4 విజయానికి వికెట్లు

## వర్షంతో నిలిచిన ఆట

- టీమిండియా 76.2 ఓవర్లు.. నాలుగో రోజు ఆట ముగిసిన ఆట
- ఇంగ్లాండ్ 6 వికెట్ల నష్టానికి 339 పరుగులు
- క్రీజులో జేమీ ఒవర్టన్ (0), జేమీ స్మిత్ (2) ఉన్నారు.
- ఇంగ్లాండ్ విజయానికి ఇంకా 35 పరుగులు అవసరం

లండన్‌లోని ఓవల్ మైదానంలో జరుగుతున్న ఐదో టెస్టు మ్యాచ్‌లో భారత జట్టు విజయానికి నాలుగు వికెట్ల దూరంలో ఉండగా, వర్షం ఆటకు అడ్డంకిగా మారింది. అండర్సన్-టెండూల్కర్ ట్రోఫీలో భాగంగా జరుగుతున్న ఈ నిర్ణయాత్మక మ్యాచ్‌లో ఇంగ్లండ్ జట్టు 37 పరుగుల లక్ష్యంతో బ్యాటింగ్ చేస్తుండగా, వరుణుడు ఆటను నిలిపివేశాడు. నాలుగో రోజు ఆటలో భారత బౌలర్ ప్రసిధ్ కృష్ణ (3-109) అద్భుత ప్రదర్శనతో ఇంగ్లండ్ బ్యాటింగ్‌ను కుదించాడు. టీ బ్రేక్ తర్వాత హ్యారీ బ్రూక్ (111) సెంచరీని ముగించిన అతను, రన్ మెషీన్ జో రూట్ (105)ను కూడా ఔట్ చేసి ఇంగ్లండ్‌ను కష్టాల్లోకి నెట్టాడు. 332 పరుగులతో బలమైన స్థితిలో ఉన్న ఇంగ్లండ్, 15 పరుగుల వ్యవధిలో రెండు కీలక వికెట్లు కోల్పోయింది. ప్రస్తుతం జేమీ స్మిత్ (2 నాటౌట్), జేమీ ఓవర్టన్ (0 నాటౌట్) క్రీజులో ఉన్నారు. టీ బ్రేక్ తర్వాత ఆట తిరిగి ప్రారంభమైన కొద్ది సేపటికే వర్షం జోరుగా కురవడంతో అంపైర్లు ఆటను నిలిపివేశారు. వర్షం తగ్గకపోతే, ఆట స్టంప్‌గా ప్రకటించే అవకాశం ఉంది. అలా జరిగితే, ఐదో రోజు భారత బౌలర్లు కొత్త బంతితో ఇంగ్లండ్ బ్యాటర్లను ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నారు. ఇంగ్లండ్ బ్యాటర్ జో రూట్ ఈ మ్యాచ్‌లో భారత్‌పై తన 13వ టెస్టు సెంచరీని నమోదు చేసి చరిత్ర సృష్టించాడు. ఒకే జట్టుపై అత్యధిక సెంచరీలు సాధించిన ఆటగాళ్ల జాబితాలో డాన్ బ్రాడ్‌మన్ (19), సునీల్ గవాస్కర్ (13) తర్వాత మూడో స్థానంలో నిలిచాడు. ఓవల్‌లో సాధించిన ఈ 39వ టెస్టు సెంచరీతో శ్రీలంక వెటరన్ కుమార సంగక్కర రికార్డును అధిగమించాడు. సచిన్ టెండూల్కర్ (51), జాక్వెస్ కలిస్ (45), రికీ పాంటింగ్ (41)ల తర్వాత అత్యధిక టెస్టు సెంచరీల జాబితాలో రూట్ నాలుగో స్థానంలో కొనసాగుతున్నాడు. ప్రస్తుతం సిరీస్ 2-2తో సమం. ఈ మ్యాచ్ డ్రా అయితే, క్రికెట్ నియమాల ప్రకారం గత సిరీస్‌ను గెలిచిన జట్టు ట్రోఫీని నిలబెట్టుకుంటుంది. ఓవల్ టెస్టులో భారత్ విజయం సాధిస్తే, శుభ్‌మన్ గిల్ కెప్టెన్సీలో చారిత్రాత్మక విజయం నమోదవుతుంది. 1971లో అజిత్ వాడేకర్, 2007లో రాహుల్ ద్రవిడ్ తర్వాత ఓవల్‌లో టెస్టు గెలిచిన మూడో భారత కెప్టెన్‌గా గిల్ చరిత్ర సృష్టిస్తాడు. ఇంకా 35 ఓవర్ల ఆట మిగిలి ఉండగా, వర్షం తగ్గితే మ్యాచ్ ఫలితం ఉత్కంఠగా సాగనుంది. ఇంగ్లండ్‌కు 37 పరుగులు, భారత్‌కు 4 వికెట్లు అవసరం. ఈ రసవత్తర పోరులో ఏ జట్టు విజయం సాధిస్తుందనేది క్రికెట్ అభిమానులను ఆసక్తిలో ముంచెత్తుతోంది.

# 3 కోట్ల 17 లక్షల మంది ప్రజలకు సన్న బియ్యం





- రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి
- కరీంనగర్ జిల్లాలో పలు అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభించిన ముగ్గురు మంత్రులు


**కరీంనగర్ జిల్లా బ్యూరో, ఆగస్టు 03 (జనంసాక్షి) :** 3 కోట్ల 17 లక్షల మంది ప్రజలకు నెలకు 6 కిలోల నాణ్యమైన సన్న బియ్యం సరఫరా చేస్తున్నామని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. ఆదివారం రామడుగు మండలంలో రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తం కుమార్ రెడ్డి, ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఇంచార్జి మంత్రి తుమ్మల నాగేశ్వర రావు, బీసి రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ , చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, కరీంనగర్ జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి ఇతర రాష్ట్ర ఉన్నతాధికారులతో కలిసి పేద కుటుంబాలకు నూతన రేషన్ కార్డులను పంపిణీ చేశారు. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ, నారాయణ పూర్ రిజర్వాయర్ ప్రాజెక్టు నిర్మాణానికి భూ సేకరణ చేసేందుకు అవసరమైన నిధులను ఆగస్టు నెలలో మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. గోదావరి నది జిల్లాలో చొప్పదండి నియోజకవర్గానికి న్యాయం చేసేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. దేశంలో 28 రాష్ట్రాలలో ఎక్కడా లేని విధంగా తెలంగాణలో 84% జనాభా కు ఉచితంగా సన్న బియ్యం రేషన్ ద్వారా సరఫరా చేస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ మాత్రమేనని అన్నారు. కరీంనగర్ జిల్లాలోని చొప్పదండి నియోజకవర్గం పరిధిలో 3 మండలాల్లో అదనంగా 5 వేల కుటుంబాలకు నూతన రేషన్ కార్డులు మంజూరు చేసి అదనంగా 12,133 మంది పేదలకు రేషన్ అందిస్తున్నామని అన్నారు. ప్రస్తుతం దేశంలో ఎక్కడా లేని విధంగా 3 కోట్ల 17 లక్షల మంది నిరుపేదలకు 13 వేల కోట్ల ఖర్చు చేసి నెలకు 6 కిలోల నాణ్యమైన సన్న బియ్యం సరఫరా చేస్తున్నామని అన్నారు. ప్రస్తుతం అర్హులైన అందరికీ రేషన్ కార్డుల పంపిణీ చేస్తున్నామని అన్నారు. 8 లక్షల 64 వేల నూతన రేషన్ కార్డులు రాష్ట్ర వ్యాప్తంగా జారీ చేశామని , ప్రస్తుతం 98 లక్షల 58 వేల రేషన్ కార్డులు ఉన్నాయని తెలిపారు.

జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి మాట్లాడుతూ, పారదర్శకంగా రేషన్ కార్డుల పంపిణీ చేస్తున్నామని అన్నారు. నూతన రేషన్ కార్డుల జారీ, ఉన్న కార్డులలో కొత్త పేర్ల నమోదు, మార్పులు చెర్పులు కలిపి మొత్తం 78 వేల ప్రజలకు కరీంనగర్ జిల్లాలో అదనంగా రేషన్ అందుతుందని అన్నారు. చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం మాట్లాడుతూ రామడుగులో ఉన్న గాయత్రి పంప్ హౌస్ నుంచి నీటి లిఫ్టింగ్ ప్రారంభించి నీరు విడుదల చేస్తున్నందుకు కృతజ్ఞతలు తెలిపారు. నారాయణ పూర్ రిజర్వాయర్ పూర్తి చేయడం ద్వారా చొప్పదండి, వేములవాడ నియోజక వర్గాల్లో వేల ఎకరాల ఆయకట్టు సాగు నీరు అందుతుందని అన్నారు. నారాయణపూర్ రిజర్వాయర్ కుడి కాల్వ, ఎడమ కాల్వ పనులు పూర్తి చేసి చివరి ఆయకట్టు వరకు నీరు అందిస్తామని అన్నారు. గత ప్రభుత్వం ఎప్పుడు పేదల సంక్షేమం కోసం కార్యక్రమాలు చేయలేదని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎం.డి. సివిల్ సప్లై చౌహాన్, సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు , తదితరులు పాల్గొన్నారు.

**మానకొండూరు నియోజకవర్గంలో..**

శంకరపట్నంలో రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ గతంలో రేషన్ కార్డు ద్వారా పంపిణీ చేసిన దొడ్డు బియ్యాన్ని 80 శాతం మంది ప్రజలు తినలేదని, ఆ బియ్యం కోళ్ల ఫారాలు, రైస్ మిల్లులలో రీసైక్లింగ్ వెళ్లేవని అన్నారు. గత సర్కార్ హయంలో రాష్ట్రంలో 89 లక్షల రేషన్ కార్డులు ఉంటే తమ ప్రభుత్వంలో అధికారంలోకి వచ్చాక 8 లక్షల 64 వేల కొత్త రేషన్ కార్డులు ఇచ్చామని, ఇప్పుడు రాష్ట్రంలో రేషన్ కార్డుల సంఖ్య 98 లక్షల 59 వేలుగా ఉందని తెలిపారు. గతంలో మానకొండూరు నియోజకవర్గంలో 55 వేల కార్డులు ఉంటే ఆరు వేల కార్డులను కొత్తగా ఇచ్చామని అన్నారు. కొత్తగా మానకొండూరు నియోజక వర్గం లో 13,220 మందిని అదనంగా కార్డుల్లో చేర్చామని తెలిపారు. మానకొండూరు నియోజకవర్గాన్ని ఇరిగేషన్, ఇతర రంగాలలో ముందుకు తీసుకెళ్తామని, స్థానిక శాసనసభ్యులు డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ సూచన మేరకు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, మంత్రి పొన్నం ప్రభాకర్ సహకారంతో అన్ని విధాలా ఈ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తామని అన్నారు. ఈ అసెంబ్లీ కాలంలోనే మానకొండూరు ముఖచిత్రాన్ని మారుస్తామని వెల్లడించారు.







పుట్టిన బిడ్డకు తొలి ఆహారం తల్లిపాలు. నూరు శాతం పోషక విలువలున్న తల్లిపాలు శిశువు ఆరోగ్యంగా ఎదగటంలో,ఆయుష్షును పెంచటంలో కీలక పాత్ర వహిస్తాయి. అమ్మపాలు బిడ్డకు అమృతాహారం. ప్రపంచంలో నేటి వరకు తల్లిపాలకు ప్రత్యామ్నాయం ఏదీలేదు. ఇదే విషయాన్ని వైద్యులు కూడా ధ్రువీకరిస్తున్నారు. శిశుమరణాల నియం త్రణకు ప్రపంచ ఆరోగ్య సంస్థ విస్తృత ప్రచారం చేపట్టింది. అందులోభాగంగా ఏటా ప్రపంచ వ్యాప్తంగా ఆగస్టు మొదటి వారాన్ని తల్లిపాల వారోత్సవంగా ఐక్య రాజ్యసమితి నిర్దేశించి అమలు చేసింది. తల్లిపాల ఆవశ్యకత గురించి బ్రెస్ట్ ఫీడింగ్ ప్రమోషన్ నెట్వర్క్ ఆఫ్ ఇండియా అనే సంస్థ దేశ వ్యాప్తంగా ప్రచారం చేస్తుంది.ఆగస్టు 1 నుండి 7వ తేదీ వరకు తల్లిపాల వారోత్సవాల సందర్భంగా 'జనంసాక్షి' అందిస్తున్న ప్రత్యేక కథనం

: సంగారెడ్డి ప్రతినిధి, ఆగస్టు 3 (జనంసాక్షి)

# అమృత తుల్యం అమ్మ పాలు

**తల్లిపాలతో ప్రయోజనాలెన్నో.. :**

- మొదటి ఆరు నెలలు ఎటువంటి డబ్బాపాలు పట్టించకుండా, తల్లిపాలు మాత్రమే ఇవ్వాలి.
- సాధారణ ప్రసవం అయితే పుట్టిన అరగంటలోపు తల్లిపాలు పట్టించాలి. సిజేరియన్ అయితే నాలుగు గంటల లోపు ఇవ్వాలి.
- తల్లి పాలలో అన్ని పోషక పదార్థాలూ సమపాళ్లలో ఉంటాయి. వ్యాధి నిరోధక శక్తిని కూడా పెంపొంది స్తాయి. తల్లిపాలు తాగిన శిశువుల్లో యాండీబాడిస్ వృద్ధి చెంది ఇన్ఫెక్షన్స్, నిమోనియా, డయేరియా వంటి వ్యాధులు సోకకుండా నివారిస్తాయి.
- తల్లిపాలు మెదడు ఎదుగుదలకు దోహదం చేయ డంతో జ్ఞాపకశక్తి పెంపొందుతోంది. తల్లిపాలు తాగినపిల్లల్లో తెలివితేటలు ఎక్కువగా ఉంటాయి.
- పసిబిడ్డకు ప్రధాన శత్రువు చలి. బిడ్డను ఒడిలో ఉంచుకొని పాలివ్వడం ద్వారా తల్లి శరీరం నుంచి శిశువుకు అవసరమైన వేడి అందుతుంది. పాలు ఇవ్వడం వలన తల్లీబిడ్డ మధ్య ఆప్యాయత, అనుబంధం కూడా పెరు గుతుందని వైద్య నిపుణులు చెబుతున్నారు.
- బిడ్డకు పాలిచ్చే మహిళల్లో బ్రెస్ట్ క్యాన్సర్, అండా శయ క్యాన్సర్, రక్తహీనత, ఎముకల బలహీనత వంటి జబ్బుల నుంచి రక్షణ పొందే అవకాశం ఉంది.
- ముర్రుపాలలో వ్యాధి నిరోధక శక్తి పెంచడంతో పాటు, శిశువు జీర్ణాశయ అభివృద్ధికి దోహదపడే పదార్థాలు విటమిన్-ఎ అధిక మోతాదులో ఉంటాయి.
- శిశువు మొట్టమొదటిగా విసర్జించే నల్లటి మెకోనియం అనే మలంతో పాటు, పచ్చకామెర్లు కలిగించే బెలూరుబిన్ అనే పదార్థం కూడా త్వరగా విసర్జించేలా ముర్రుపాలు దోహదపడతాయి. దీంతో బిడ్డకు మొదటి వారంలో కలిగే పచ్చకామెర్లను నివారించవచ్చు.

## ముర్రుపాలతో బిడ్డకు సంపూర్ణ ఆరోగ్యం

## పుట్టిన గంటలో బిడ్డకు పాలు అందిస్తే ఎంతో మేలు

- శక్తి రోగనిరోధక పెంచడంలో తల్లి పాలు కీలకం
- జిల్లా వ్యాప్తంగా తల్లిపాల వారోత్సవాలు

**తల్లి పాలు బిడ్డకు అమృతంతో సమానం :**

శిశువు సంపూర్ణ ఆరోగ్యంగా ఉండేందుకు దోహదం చేయడంతో పాటు రోగనిరోధక శక్తిని పెంచుతాయి. అందుకే తల్లి పాలను బిడ్డ పుట్టిన వెంటనే పట్టిస్తారు. పాలు పట్టడంతో అటు తల్లికీ అనేక లాభాలున్నాయి. రోగనిరోధక శక్తిని పెంపొందించి ఎన్నో రకాల వ్యాధు లు రాకుండా ఉంటాయి. తల్లిపాలకు ఇంతటి విశిష్టత ఉండబట్టే వైద్యులు, ప్రభుత్వం మహిళలల్లో చైతన్యం కల గజేస్తోంది.

**ఏమి చేయాలి..:**

బిడ్డలకు తల్లిపాలను అందించేందుకు సంబంధిత ప్రభుత్వశాఖలలో అవగాహన కల్పించి వాటి మధ్య ఈ ప్రణాళిక అమలుకు సమన్వయం తీసుకురావాలి. పాలపొడరు, శిశు ఆహారం, పాలసీసాల పరిశ్రమల వారి పద్ధతులను సమీక్షిస్తూ ఐఎంఎస్ చట్టం అమలు కావడానికి కృషిచేయాలి. కుటుంబ సభ్యులను చైతన్యపరచి మొదటి గంటలో తల్లిపాలు ఇవ్వడం, 6నెలల వరకు కేవలం తల్లిపాలు మాత్రమే ఇప్పించడం, అటుపిమ్మట అదనపు ఆహారం ప్రారంభించి తల్లిపాలు కొనసాగించడం తదితర విష యాలపై అవగాహన తీసుకురావాలి. ప్రభుత్వ, ప్రయివేట్ సంస్థల యాజమాన్యంతో చర్చించి ఉద్యోగం చేయుచున్న తల్లులకు సహకారం అందేటట్లు చూడాలి. తల్లిపాల ప్రాధాన్యతను తెలియ జేస్తూ మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ, సమగ్ర శిశు అభివృద్ధి సేవా పథకం (ఐసీడీ ఎస్)ల ఆధ్వ ర్యంలో ఈ వారం రోజుల పాటు గ్రామాల్లో అవగాహన సదస్సులు, ర్యాలీలు నిర్వహించనున్నారు.

**గంటలోగా అందిస్తే..:**

బిడ్డపుట్టిన గంటలోగా తల్లిపాల (ముర్రుపా లు)ను అందించడం వల్ల ఆరోగ్యంగా ఉండే దుకు అవకాశం ఉంటుందని నిఫణులు చెయి తున్నారు. ప్రధానంగా ప్రసవించిన గంట తర్వాత వచ్చే తల్లిపాలలో కెలెస్ట్రామ్ విడుద లవుతుంది. ఇది చిన్నారుల్లో వచ్చే కొన్నిరకాల వ్యాధులను నియంత్రించేందుకు ఎంతగానోనే దోహదపడుతుంది. అదేవిధంగా కొలెస్ట్రామ్ చిన్నారిలో వ్యాధి నిరోధక శక్తిని పెంచడం లో క్రియాశీలక పాత్రను పోషిస్తుందని నిపుణులు చెబుతున్నారు. అందువల్ల తల్లిపాలు అందించడం మంచిదంటున్నారు.

**తల్లి పౌష్టికాహారం తీసుకోవాలి..:**

మహిళలు గర్భం దాల్చగానే బిడ్డ ఎదుగుదల కోసం, ఆరోగ్యవంతమైన సంతానం పుట్టేందుకు పోషక విలువలు ఉన్న ఆహారాన్ని తీసుకోవాలి. కాన్పు అయిన వెంటనే చీము పడుతుందనే అపోహతో చాలా మంది కాఫీ, టీలు ఇస్తారు. కారం అన్నం పెడతారు. ఇది మంచి పద్ధతి కాదు. వాటిని పక్కనపెట్టి ముందు తల్లికి పాలు ఇవ్వాలి. ప్రతిరోజూ అరలీటరుకు పైగా బిడ్డకు పాలిచ్చే తల్లులు పాలు తాగాలి. పాలతోపా టుగా గుడ్డు, మాంసపు కృత్తులు ఉన్న ఆహారం తీసుకోవాలి. టీబీ, హెచ్ఐవీ లాంటి జబ్బులు ఉన్న వారు పాలు ఇవ్వకూడదు. తల్లి బిడ్డకు ఎంతపాలు ఇస్తే తనకు అంతమంచిది. ఒకరొమ్మునుంచే కాకుండా రెండు రొమ్ముల నుంచి సమానంగా పాలు ఇవ్వడం మంచిదని డాక్టర్లు చెబుతున్నారు.

**శిశువుల ప్రాణాల మీదికి..:**

బిడ్డ పుట్టిన రెండు నుంచి 24 గంటల మధ్య చిన్నారులకు తల్లిపాలను అందిం చాలి ఇలా చేయక పోవడం వల్ల మొదటి 28 రోజుల్లోనే మరణిస్తున్న చిన్నారుల సంఖ్య 40 శాతంగా ఉందని యూనిసెఫ్ నివేదికలో వెల్లడైంది. 24 గంటలు దాటిన తర్వాత కూడా తల్లిపాలను అంధించని చిన్నారుల్లో ప్రాణహాని 80 శాతంగా ఉన్నట్లు యూనిసెఫ్ హెచ్చరిస్తోంది. చిన్నారుల రక్షణలోనుబీ వ్యాధుల నియంత్రణలోను తల్లిపాలకు మించి మరొకటి లేదని చెబుతున్నారు.





**జిల్లావ్యాప్తంగా నిర్వహిస్తున్నాం..:**

**జిల్లా శిశు సంక్షేమ అధికారిని లలితా కుమారి..:**

ఈనెల 1 నుంచి 7 వరకు వారం రోజుల పాటు తల్లిపాల వారోత్సవాలను జిల్లా వ్యాప్తంగా నిర్వహిస్తున్నాం. అన్ని అంగన్వాడీ కేంద్రాల్లో నిర్వహించాలని కార్య కర్తలను ఆదేశాలు ఇచ్చాం. తల్లిపాలపై గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పిస్తాం. వంద శాతం పూర్తి చేయాలన్నదే మా లక్ష్యం. ఆ దిశగా అందరూ సమిష్టిగా పని చేయాలి. ముఖ్యంగా తల్లులు తల్లిపాలపై అవగాహన కలిగి ఉండాలి. బిడ్డల క్షేమాన్ని చూడాలి.

# స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ సత్తా చాటాలి

## ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు



**మంథని, (జనంసాక్షి) :** రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ క్లీన్ స్వీప్ చేయడమే లక్ష్యంగా ముందుకు సాగాలని రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు పార్టీ శ్రేణులకు సూచించారు. ఇటీవల నూతనంగా కమాన్ పూర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులుగా సయ్యద్ అన్వర్ నియామకం కాగా ఏర్పాటు చేసిన కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని మంత్రి శ్రీధర్ బాబు రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. కొత్త, పాత, సీనియర్ జూనియర్ అని తేడా లేకుండా అందర్నీ కలుపుకుపోయి కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయాలని మండల అధ్యక్షునికి మంత్రి శ్రీధర్ బాబు సూచించారు. అనంతరం మండల పార్టీ అధ్యక్షులు సయ్యద్ అన్వర్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు మంత్రి శ్రీధర్ బాబును గజమాల శాలువాలతో సన్మానించారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ శ్రేణులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. అంతకన్నా ముందు డబ్బు చప్పుల మధ్య పెద్దపల్లి మంథని ప్రధాన రహదారి కమాన్ పూర్ పొలిమేర వద్ద కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు సయ్యద్ అన్వర్ ఆధ్వర్యంలో మంత్రి శ్రీధర్ బాబుకు కాంగ్రెస్ పార్టీ నాయకులు ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో మంథని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు తొట్ల తిరుపతి యాదవ్ తో పాటు మండలంలోని అన్ని గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



# ఇల్లు నిర్మించుకోమన్నారు.. బిల్లులు ఇవ్వమంటున్నారు!

**సదాశివనగర్ ఆగస్టు 3 (జనంసాక్షి) :** కామారెడ్డి జిల్లా సదాశివనగర్ మండలం వజ్జా పల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి ముగ్గుపోసి పనులు ప్రారంభించి నిర్మించిన ఇండ్లకు బిల్లులు ఇవ్వమని అధికారం చేతులెత్తడం ఎంతవరకు సమంజసమని ఉమ్మడి మండల మాజీ జెడ్పిటిసి పడిగెలరాజేశ్వరరావు ప్రశ్నించారు. ఒకపక్క ప్రజా పాలన గూడు లేని నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్ల పేరిట పెద్ద ఎత్తున ఇల్లు నిర్మిస్తున్నామని ప్రచారం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం ఆచరణలో మాత్రం నిరుపేదల బిల్లులు ఇవ్వకుండా ఇబ్బందుల పాలు చేస్తున్నారన్నారు. ఆయన ఆదివారం సదాశివనగర్ మండలం వజ్జా పల్లి గ్రామంలో పలువురు లబ్ధిదారులను కలవగా పలుఆసక్తికరమైన విషయాలు బయటకు వచ్చాయి. మండలంలోని గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా ఎంపిక చేసి 100కు పైగా ఇల్లు మంజూరు చేశారు .అందులో 20 మంది లబ్ధిదారులు ఇండ్ల నిర్మాణానికి నాలుగు నెలల క్రితం క్రితం అధికారులు పోసిన ముగ్గు ప్రకారం ఇల్లు నిర్మించుకుంటున్నారు. ఆ తర్వాత ఇంటి పనులు నడుస్తుండగాఅధికారులు వచ్చి10 ఫీట్లు ఎక్కువైందని ఈ ఇండ్లను రద్దు చేస్తామని ప్రకటించడంతో లబ్ధిదారు లబోదిబోమని కన్నీళ్లు పెడుతున్నారని ఆయన ఆరోపించారు. ఈ గ్రామానికి చెందిన వికలాంగుడైన మాణిక్యరావు ఇల్లు నిర్మాణం చేపట్టి బేస్మెంట్ గోడలు పూర్తిచేసిన బిల్లులు ఇవ్వకుండా అధికారులు సతాయిస్తున్నారని బాధితుడు మాజీ జెడ్పిటిసి ముందు గొల్లుమని కన్నీళ్లు పెట్టుకున్నాడు. తనకు బిల్లు ఇప్పించవలసిందిగా స్వయానా రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని కలిసిన ఫలితం దక్కలేదని ఆవేదన వ్యక్తం చేశారు .ఇదే గ్రామంలో ప్యారం లతా అనే బాధితురాలకు ముగ్గు పోసి అధికారులు ఇల్లు నిర్మాణం ప్రారంభించుకోవాలని సూచించారు ఆ బాధితురాలు నిర్మాణం చేసిన తర్వాత అదే అధికారులు తమకు ముందుగా మ్యాపు రాలేదని ఇప్పుడు మీరు నిర్మించుకున్న ఇల్లు ప్రభుత్వం నిబంధనాల కన్నా ఎక్కువ ఉందని బిల్లులు చెల్లించడం సాధ్యం కాదని సమాధానం చెబుతున్నారని మాజీ జెడ్పిటిసి కి బాధితురాలు వివరించారు ప్రభుత్వం మాటలు తప్ప క్షేత్రస్థాయిలో బాధితులకు న్యాయం చేయకపోగా ఇక ఈ ప్రభుత్వం తమను మోసం చేయడానికి మంజూరు చేశారని బాధితులు అర్థం చేసుకుని ఇల్లు నిర్మించుకోవడానికి ముందుకు రావడంలేదని ఆయన ఆరోపించారు. ఇప్పటికైనా జిల్లా యంత్రాంగం క్షేత్రస్థాయిలో పరిశీలించి నిరుపేదలైన లబ్ధిదారులకు న్యాయం చేయాలని ఆయన డిమాండ్ చేశారు ఆయన వెంట ఉత్తనూర్ పాల కేంద్రం అధ్యక్షుడు దొడ్ల రవి, కామారెడ్డి మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ అంజనేయులు, రామారావు, మాజీ ఉపసర్పంచ్ ప్రభాకర్ రావు, గ్రామ టిఆర్ఎస్ అధ్యక్షుడు శ్రీనివాస్, ఉద్యమకారులు గొల్ల మల్లయ్య, లక్ష్మయ్య, మైపాల్ రావు ,రాజు తదితరులు పాల్గొన్నారు

# పంపుడ్ స్టోరేజ్‌ను పెద్ద ఎత్తున వినియోగంలోకి తీసుకురావాలి

- రాబోయే 20 ఏళ్లకు సరిపడా విద్యుత్ ఉత్పత్తికి ప్రణాళికలు
- ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క



హైదరాబాద్ (జనంసాక్షి) : హైడల్ పవర్‌తోబాటు పంపడ్ స్టోరేజ్‌తో పెద్ద ఎత్తున విద్యుత్ ఉత్పత్తి చేసి వినియోగంలోకి తీసుకుని రావాలి.. అందుకోసం రాష్ట్రంలో ఇరవై మూడు పాయింట్స్ ను గుర్తించి వాటి మీద సమగ్రమైన రిపోర్ట్ ఇవ్వాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు విద్యుత్ అధికారులను ఆదేశించారు. ఆదివారం ఉదయం ఆయన జెన్ కో, ట్రాన్స్ కో అధికారులతో కొల్లాపూర్ నియోజకవర్గం లోని సోమశిల వద్ద సమీక్ష సమావేశం నిర్వహించారు. జూరాల నుంచి పులిచింతల వరకు కృష్ణా మీద ఉన్న హైడల్ పవర్ ప్రాజెక్ట్ లను సమీక్ష చేసి అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. అవసరం అయితే ప్రపంచ పేరుగాంచిన కన్సల్టెంట్ ల సేవలను ఉపయోగించు కోవాలని ఆదేశించారు. సోలార్ ద్వారా పగలు జరిగే ఉత్పత్తినీ స్టోరేజ్ చేసి రాత్రివేళ ఉపయోగానికి అవసరమైన సాంకేతిక ను దానికి. అవసరమైన స్టోరేజ్ వ్యవస్థను రూపొందించి కోవాలి అని అన్నారు.

ముందుచూపుతో అత్యాధునికమైన సాంకేతికత ను పరిచయం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం 1978 లోనే ఆనాటి పాలకులు, ఇంజనీర్లు లోతుగా అధ్యయనం చేసి రివర్స్ పంపింగ్ కోసం ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన జపాన్ కు చెందిన తొషిబా, మిస్టుబుషి లాంటి దిగ్గజ సంస్థల సాంకేతికతను ఉపయోగించిన ఆ నాటి పాలకుల ముందు చూపును వారి సేవలను డిప్యూటీ సీఎం కొనియాడారు. రాబోయే తరాల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని పర్యావరణ హితమైన పవర్ ను ఉత్పత్తి చేసి అందించాలి అని అధికారులకు సూచించారు. రాష్ట్రంలో ఏటేటా పెరుగుతున్న విద్యుత్తు డిమాండ్ ను దృష్టిలో పెట్టుకుని రాబోయే ఇరవై ఏళ్లకు సరిపడా విద్యుత్తు డిమాండ్ కు అవసరమైన ఉత్పత్తి నీ అందుకోవడానికి అవసరమైన ప్రణాళికలు రూపొందించాలి, అందుకు అవసరమైన ప్రణాళికలు సిద్ధం చేసుకోవాల్సిందిగా జెన్ కో అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

జెన్ కో అధికారులు, డైరెక్టర్స్ థర్మల్ పవర్ ప్రాజెక్ట్ లో రాష్ట్రంలో పెరుగుతున్న డిమాండ్ ను దృష్టిలో పెట్టుకుని రాబోయే పది, ఇరవై ఏళ్ల అవసరాలకు సరిపడ విద్యుత్తు ఉత్పత్తిని అందించడానికి అవసరమైన ప్రణాళికలు సిద్ధం చేసుకోవాల్సింది గా అధికారులను ఆదేశించారు. సమావేశంలో ఈ సంవత్సరం నిరంతరాయంగా డిమాండ్ కు అనుగుణంగా విద్యుత్తు ను అందించిన సిబ్బందిని అభినందించారు. సీఎండీ నుండి కింది సిబ్బంది దాకా వాళ్ళకి అవసరమైన సాంకేతికత ను పెంపొందించు కోవడానికి అవసరమైన సాంకేతికతను పెంపొందించు కోవడానికి అవసరమైన సిలబస్ రూపొందించి మూడు రోజుల ట్రైనింగ్ కోసం అవసరమైన సిలబస్ రూపకల్పన తోబాటు అవసరమైన నిపుణుల పర్యవేక్షణ లో ట్రైనింగ్ కార్యక్రమాలను నిర్వహించాలని ఆదేశం దానికి అవసరమైన టెక్ ఎక్స్పోజర్ ఉన్న నిపుణుల ఆధ్వర్యంలో సిలబస్ ట్రైనింగ్ మాడ్యూల్ తాయారు చెయ్యాలి అని చెప్పారు. గ్రీన్ హైడ్రోజన్ , ఫ్లోటింగ్ సోలార్, రూఫ్ సోలార్ థర్మల్ పవర్ , పవన విద్యుత్తు,అణువిద్యుత్తు బ్యాటరీ స్టోరేజ్ లాంటి ప్రత్యామ్నాయ విద్యుత్తు కోసం వినియోగాన్ని ఎక్కువ మొత్తం లో అభివృద్ధి చేసుకోవాలి అని అన్నారు.

# కాంగ్రెస్ గ్రామాలను కుంటుపరుస్తోంది

- గ్రామీణ వికాసం, గ్రామ సౌభాగ్యం బిజెపితోనే సాధ్యం
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు




హైదరాబాద్ (జనంసాక్షి) : కాంగ్రెస్ గ్రామాలను కుంటుపరుస్తోందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు అన్నారు. మొయినాబాద్ మండలం శ్రీరాంనగర్ గ్రామంలో నిర్వహించిన ఘర్ ఘర్ బిజెపి కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం స్థానిక సంస్థలను నిర్వీర్యం చేసేందని, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ గ్రామాభివృద్ధే దేశాభివృద్ధి అని నమ్మి, గ్రామాలు స్వయం సమృద్ధి సాధించేందుకు అనేక చర్యలు చేపట్టారు. గ్రామీణ పేదల కోసం ఉచిత బియ్యం, ఇండ్లతో పాటు మరుగుదొడ్లు, గ్యాస్ కనెక్షన్లు, రూ.5 లక్షల ఉచిత వైద్యం, పొదుపు సంఘాల మహిళలకు బ్యాంకు రుణాలు, యువతకు స్వయం ఉపాధి రుణాల వంటి అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని, గ్రామాలలో రోడ్లు, మరుగుదొడ్లు, వీధి దీపాలు, స్మశాన వాటికలు, రైతు వేదికలు, హరితహారం కింద మొక్కలు నాటడం వంటి అనేక కార్యక్రమాలు కేంద్ర ప్రభుత్వ సహకారంతోనే అమలవుతున్నాయని తెలిపారు. ప్రధానమంత్రి సడక్ యోజన కింద ప్రతి గ్రామానికి పక్కా రోడ్ల నిర్మాణం కోసం నిధులు కేటాయించిందని, రైతులను ఆర్థికంగా ఆదుకునేందుకు కిసాన్ సమ్మాన్ నిధి పేరుతో ప్రతి సంవత్సరం భూవిస్తీర్ణంతో సంబంధం లేకుండా ప్రతి రైతు కుటుంబానికి రూ.6000 ఇస్తున్నారని తెలిపారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలను గ్రామ గ్రామాన ప్రజల్లోకి తీసుకెళ్ళేందుకు ఘర్ ఘర్ బిజెపి కార్యక్రమం ద్వారా గ్రామ గ్రామాన ప్రతి ఇంటికి బిజెపి నాయకులు, కార్యకర్తలు వెళ్లారని, ప్రధాని నరేంద్ర మోదీ పాలనలో సాధించిన ప్రగతిని, చేపట్టిన అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని, తెలంగాణ ప్రజల బతుకులు మారాలంటే రాష్ట్రంలో బిజెపి ప్రభుత్వం రావాలని, రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బిజెపి అభ్యర్థులను గెలిపించి నరేంద్ర మోడీ నాయకత్వాన్ని మరింత బలపరచాలని కోరారు. రంగారెడ్డి, వికారాబాద్ జిల్లాల్లో జిల్లా పరిషత్ లను బిజెపి కైవసం చేసుకునేలాగా ప్రతి ఒక్కరు కృషి చేయాలని కోరారు.

# తెలంగాణ సచివాలయ ఎంట్రీకి క్యూఆర్ కోడ్

### అమల్లోకి ఈ-పాస్ విధానం




హైదరాబాద్ (జనంసాక్షి) : తెలంగాణ ప్రభుత్వం సచివాలయంలోకి వచ్చే సందర్శకుల ప్రవేశాన్ని మరింత ప్రమాణబద్ధంగా, సురక్షితంగా నిర్వహించేందుకు కొత్త ఈ-పాస్ విధానంను త్వరలో అమల్లోకి తీసుకురానుంది. రాష్ట్ర ఐటీ శాఖ ఆధ్వర్యంలో అభివృద్ధి చేసిన ఈ వ్యవస్థ ద్వారా సందర్శకుల వివరాలను ముందుగా నమోదు చేసి క్యూఆర్ కోడ్ ఆధారిత పాస్ ద్వారా వారికి ప్రవేశం కల్పిస్తారు. ఈ కొత్త విధానం అమలుతో సచివాలయ భద్రతను మరింత బలోపేతం చేయడం, అనవసర సందర్శకుల రాకపోకలను నియంత్రించడం ప్రభుత్వ లక్ష్యం. ఇప్పటివరకు అనుసరిస్తున్న సాధారణ విజిటింగ్ అవర్స్ యథావిధిగా కొనసాగుతాయని అధికారులు స్పష్టం చేశారు.

### ఈ-పాస్ వ్యవస్థ ఎలా పనిచేస్తుంది?

సందర్శకులను లోనికి అనుమతించడానికి, ప్రతి మంత్రి, కార్యదర్శి పేషీకి ఈ పోర్టల్‌కు సంబంధించిన యూజర్ ఐడీ, పాస్‌వర్డ్‌ను కేటాయిస్తారు. వారి పేషీకి వచ్చే సందర్శకుడి పేరు, చిరునామా, ఆధార్ కార్డు నంబర్, ఫోన్ నంబర్ వంటి వివరాలను ఈ పోర్టల్‌లో నమోదు చేయగానే ఆ సందర్శకుడి స్మార్ట్‌ఫోన్‌కు ఒక క్యూఆర్ కోడ్ పంపబడుతుంది. సచివాలయం ఎంట్రీ గేట్ వద్ద సందర్శకులు ఈ క్యూఆర్ కోడ్‌ను చూపించాల్సి ఉంటుంది. అక్కడ విధిలో ఉన్న భద్రతా సిబ్బందికి ఈ కోడ్‌ను స్కాన్ చేసేందుకు ప్రత్యేకమైన యాప్‌ను రూపొందించారు. యాప్‌లో కోడ్‌ను స్కాన్ చేయగానే సందర్శకుడి వివరాలు డిస్‌ప్లే అవుతాయి. వాటిని సరిచూసుకున్న తర్వాతే సందర్శకులను లోనికి అనుమతిస్తారు.

### సందర్శకుల వేళలు

ప్రస్తుతం సచివాలయంలో సందర్శకుల వేళలు సాయంత్రం 3 గంటల నుంచి 5 గంటల వరకు ఉన్నప్పటికీ, ఉదయం 10 గంటల నుంచే చాలా మంది మంత్రులు, కార్యదర్శుల పేషీల నుంచి ఫోన్ చేసి తమకు సంబంధించిన వ్యక్తులను లోనికి పిలుచుకుంటున్నారు. దీంతో రోజుకు ఎంత మంది సందర్శకులు లోనికి వెళ్తున్నారో, వారి వివరాలు ఏమిటో లెక్కలు ఉండటం లేదు. ఈ కొత్త ఈ-పాస్ విధానం అమల్లోకి రావడంతో, ఏ పేషీ నుంచి విజిటర్‌కు క్యూఆర్ కోడ్ వెళ్లింది, ఒక పేషీ నుంచి రోజుకు ఎంత మందికి పాస్‌లు జారీ అయ్యాయి, సచివాలయంలోకి ప్రతి రోజు ఎంత మంది వస్తున్నారు అనే పూర్తి వివరాలు గ్యాడ్ అధికారుల వద్ద నమోదు అవుతాయి. ఇది భద్రతను పెంపొందించడమే కాకుండా, సందర్శకుల రాకపోకలపై పూర్తి జవాబుదారీతనాన్ని నిర్ధారిస్తుంది.

### తెలంగాణ సచివాలయంలో కొత్తగా ప్రవేశపెట్టిన ఈ-పాస్ వ్యవస్థ అంటే ఏమిటి?

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సచివాలయంలోకి వచ్చే సందర్శకులను నియంత్రించేందుకు ఈ-పాస్ వ్యవస్థను ప్రవేశపెట్టింది. ఇది క్యూఆర్ కోడ్ ఆధారిత డిజిటల్ పాస్ సిస్టమ్.

### ఈ-పాస్ ఎవరి కోసం?

ఈ-పాస్ వ్యవస్థ విజిటర్లు, అంటే మంత్రి పేషీలకు లేదా కార్యదర్శుల వద్దకు వస్తున్న వ్యక్తుల కోసం. వారు సచివాలయంలోకి ప్రవేశించాలంటే తప్పనిసరిగా ఈ-పాస్ ఉండాలి.

# ప్రజలను తప్పదోవ పట్టించేందుకు బీజేపీ, బీఆర్‌ఎస్‌లు ధర్నా నాటకాలు

- స్టేషన్ ఘన్పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి
- అందరం కలిసి పార్టీని బలోపేతం చేసుకుందాం



స్టేషన్ ఘన్పూర్, ఆగస్టు 03 (జనంసాక్షి) : ప్రజల నుండి కాంగ్రెస్ ప్రభుత్వంపై సానుకూల స్పందన వస్తుందని,ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు బీజేపీ, బిఆర్ఎస్ లు ధర్నానాటకాలు ఆడుతున్నాయని, ఎవ రూ ఎప్పుడు వచ్చారన్నది కాదు ఎవరు ఎంత పని చేస్తున్నారనేది ముఖ్యమని మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. స్టేషన్ ఘనపూర్ పట్టణ కేంద్రంలోని ఎస్ కన్వెన్షన్ నందు స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గ పరిధిలోని 7మండలాలు, ఘనపూర్ మున్సిపాలిటీకి సంబందిం చిన సమన్వయ కమిటీ సభ్యులు, ముఖ్య నాయకుల సమావేశానికి ఎమ్మెల్యే కడియం శ్రీహరి గారు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సీఎంఆర్ చెక్కులు ఎమ్మెల్యే పంపిణీ చేశారు. అనంతరం ఎమ్మెల్యేమాట్లాడుతూ బీజేపీ, బిఆరఎస్ పార్టీలు బిసి రిజర్వేషన్ల విషయంలో ప్రజలను తప్పుదోవ పట్టించేం దుకు వీధినాటకాలు ఆడుతున్నాయని ఆరోపించారు. ఒకరు ఇందిరా పార్క్ దగ్గర, మరొకరు కరీంనగర్ లో ధర్నాలు చేస్తున్నారని, అసలు బీజేపీ, బిఆర్ఎస్ లు ఎందుకు ధర్నా చేస్తున్నాయో చెప్పాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం శాసన సభలో తీర్మానం చేసి కేంద్రానికి పంపితే దానికి చట్టభద్దత కల్పించకుం డా ప్రజలను మభ్యపెట్టడానికి ధర్నాలు చేస్తున్నారని ఆరోపించారు. బిసిలకు 42శాతం రిజర్వేషన్లు కల్పించ డం బీజేపీకి ఇష్టంలేదని అందుకే ఇలాంటి దివాళాకోర్ రాజకీయాలు చేస్తుందని విమర్శించారు. తెలంగాణ బీజేపీ నాయకులకు, బిఆర్ఎస్ పార్టీకి బిసలపైన ప్రేమ ఉంటే వెంటనే కేంద్రంపై ఒత్తిడి తెచ్చి బిసి రిజర్వేషన్ బిల్లుకు చట్టభద్దత కల్పించాలని డిమాండ్ చేశారు. అంతేకాని ప్రజలను తప్పుదోవ పట్టించే చిల్లర రాజకీయాలు మానుకోవాలని హితవు పలికారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తెలంగాణకు అడుగు అడుగునా అన్యాయం చేస్తుందని, తెలంగాణ పైన చిన్న చూపు చూస్తుందని అన్నారు. తెలంగాణ బీజేపీ మంత్రులు, ఎంపీలు ఎందుకు నిధులు తీసుకురాలేక పోతున్నారని మండిపడ్డారు. ప్రతీ ఒక్క కాంగ్రెస్ పార్టీ కార్యకర్త పార్టీ బలోపేతానికి కృషి చేయాలనీ, పార్టీ పటిష్టంగా ఉంటేనే అందరికి అవకాశాలు వస్తాయని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ పథకాల ద్వారా ప్రజలలో కాంగ్రెస్ ప్రభుత్వం పై సానుకూల స్పందన వస్తుందని అన్నారు. స్థానిక సంస్థలఎన్నికలలో నియోజకవర్గంలోని ప్రతీ గ్రామంలో కాంగ్రెస్ జెండాఎగరాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్ర మంలో మార్కెట్ చైర్ పర్సన్ జూలుకుంట్ల లావణ్య శిరీష్ రెడ్డి, జిల్లా గ్రంథాలయ చైర్మన్ మారు జోడు రాంబాబు, చిల్పూర్ దేవస్థాన చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్ రావు, కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు జూలుకుంట్ల శిరీష్ రెడ్డి, నాయకులు చింతకుంట్ల నరేందర్ రెడ్డి, బెలిదే వెంకన్న,జగదీష్ చంద్ర రెడ్డి, గుడి వంశీధర్ రెడ్డి, నియోజకవర్గ ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్త లు తదితరులు పాల్గొన్నారు.

# నేటి నుంచి తెలంగాణలో వర్షాలు!

హైదరాబాద్ (జనంసాక్షి) : తెలంగాణ రాష్ట్రంలో నేటి నుంచి వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలంగాణ వెదర్‌మ్యాన్ అంచనా వేశారు. ముఖ్యంగా దక్షిణ, పశ్చిమ, సెంట్రల్ తెలంగాణ జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తాయని ఆయన పేర్కొన్నారు. అయితే, పగటిపూట ఉష్ణోగ్రతలు ఎక్కువగా ఉన్నప్పటికీ, ఉదయం మరియు సాయంత్రం వేళల్లో ఆకస్మిక వర్షాలు కురుస్తాయని తెలిపారు. రైతులు, ప్రజలు ఆగస్టులో కురిసే వర్షాలకు సిద్ధంగా ఉండాలని సూచించారు.


**హైదరాబాద్‌లోనూ వానలు**

రాష్ట్ర రాజధాని హైదరాబాద్ నగరంలో కూడా వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలంగాణ వెదర్‌మ్యాన్ వెల్లడించారు. నగరవాసులు వర్షాలకు తగిన ఏర్పాట్లు చేసుకోవాలని హెచ్చరించారు. ముఖ్యంగా ఉదయం మరియు సాయంత్రం వేళల్లో అకస్మాత్తుగా కురిసే వర్షాల వల్ల ట్రాఫిక్ సమస్యలు తలెత్తే అవకాశం ఉన్నందున, ప్రయాణాలు చేసేవారు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

**ఆగస్టు వర్షాలకు సిద్ధంగా ఉండండి**

మొత్తంగా, ఆగస్టు నెలలో తెలంగాణ అంతటా మంచి వర్షాలు కురుస్తాయని అంచనా వేస్తున్నారు. ఈ వర్షాలు రైతులకు సాగు పనులకు అనుకూలంగా ఉంటాయని భావిస్తున్నారు. అదే సమయంలో, పట్టణ ప్రాంతాల ప్రజలు కూడా వర్షాలకు సిద్ధంగా ఉండాలి, ఎందుకంటే అకస్మాత్తుగా కురిసే వర్షాల వల్ల లోతట్టు ప్రాంతాలు జలమయం కావడం, విద్యుత్ అంతరాయాలు వంటివి సంభవించే అవకాశం ఉంది. ఈ వాతావరణ మార్పులను దృష్టిలో ఉంచుకొని ప్రజలు తమ ప్రణాళికలను రూపొందించుకోవాలని సూచించబడింది.

# విమాన సిబ్బందిపై ఆర్మీ అధికారి దాడి




శ్రీనగర్ (జనంసాక్షి) : జమ్మూ కశ్మీర్‌లోని శ్రీనగర్ విమానాశ్రయంలో క్యాబిన్ లగేజీ విషయంలో తలెత్తిన వివాదం ఘర్షణకు దారితీసింది. ఈ ఘటన ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతూ విమానాశ్రయ భద్రతా వ్యవస్థ, ప్రయాణికుల క్రమశిక్షణపై చర్చకు దారితీస్తోంది. వివరాల్లోకి వెళితే, శ్రీనగర్ విమానాశ్రయం లోని ఒక ఎయిర్‌లైన్స్ విమానానికి బోర్డింగ్ ప్రక్రియ జరుగుతుండగా, ఆర్మీ అధికారి క్యాబిన్‌లో పరిమితికి మించిన లగేజీని తీసుకువెళ్లేందుకు ప్రయత్నించారు. విమానాశ్రయ నియమావళి ప్రకారం నిర్దిష్ట పరిమితి వరకు మాత్రమే క్యాబిన్ లగేజీ అనుమతించబడుతుంది. ఆర్మీ అధికారి వద్ద ఉన్న లగేజీ బరువు, పరిమాణం రెండూ అనుమతించిన పరిమితిని మించడంతో ఎయిర్‌లైన్స్ సిబ్బంది అదనపు ఛార్జీలు చెల్లించాలని కోరారు.

దీంతో సిబ్బందిపై దాడిచేసి ముష్ఠిఘాతాలు కురిపించారు. ఈ తతంగం మొత్తం అక్కడ సీసీటీవీ కెమెరాల్లో రికార్డయ్యింది. జమ్మూ కశ్మీర్‌లోని శ్రీనగర్ విమానాశ్రయంలో జరిగిన ఈ ఘటనకు సంబంధించిన వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. దాడిలో నలుగురు ఎయిర్‌లైన్స్ సిబ్బందికి గాయాలయ్యాయి. శ్రీనగర్ నుంచి న్యూఢిల్లీకి వెళ్లే స్పైస్‌జెట్ ఎయిర్‌లైన్స్ విమానంలో ఆర్మీ అధికారి టిక్కెట్ బుక్ చేసుకున్నారు. శ్రీనగర్ ఎయిర్‌పోర్ట్‌లో విమానం ఎక్కేందుకు వచ్చిన ఆయన 16 కిలోల హ్యాండ్ బ్యాగేజీ (క్యాబిన్ లగేజ్) తీసుకొచ్చారు. నిబంధనల ప్రకారం, క్యాబినెట్ లగేజి పరిమితి 7 కిలోలు. దీనికి రెండింతలు ఎక్కువే ఆయన తీసుకురావడం సమస్య ఉత్పన్నమైంది. లగేజీకి అదనపు ఛార్జీలు చెల్లించాల్సి ఉంటుందని బోర్డింగ్ సమయంలో సిబ్బంది చెప్పినా ఆయన నిరాకరించారు.

# అగ్గిపెట్టెలో పట్టే ఆపరేషన్ సింధూర్ శాలువా

### తయారు చేసిన సిరిసిల్ల నేతన్న



సిరిసిల్ల (జనంసాక్షి) : సిరిసిల్లకు చెందిన నేత కళాకారుడు నల్ల విజయ్ తన సృజనాత్మకతతో మరో అద్భుతాన్ని ఆవిష్కరించారు. ఇటీవల భారత్ నిర్వహించిన "ఆపరేషన్ సిందూర్" విజయానికి గుర్తుగా ఆయన ఒక ప్రత్యేక బంగారు శాలువాను తయారు చేశారు. ఈ శాలువాను అత్యంత సూక్ష్మంగా తయారు చేసి, అగ్గిపెట్టెలో పెట్టేలా రూపొందించడం విశేషం. ఈ కళాత్మక శాలువా తయారీకి విజయ్ కుమార్ మూడు రోజులు సమయాన్ని కేటాయించాడు. మొత్తం బరువు 100 గ్రాములు కాగా, అందులో 2 గ్రాముల బంగారాన్ని వినియోగించారు. శాలువా పొడవు రెండు మీటర్లు కాగా, వెడల్పు 38 ఇంచులు. అత్యంత క్లిష్టమైన శ్రద్ధతో దీనిని తయారు చేయడం ద్వారా తన నైపుణ్యాన్ని చాటారు. చేనేత దినోత్సవ కానుకగా ప్రధానికి ఈ బంగారు శాలువాను ఈ నెల 7వ తేదీన జరగనున్న చేనేత దినోత్సవం సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీకి బహుమతిగా పంపించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈ శాలువా ద్వారా, ఉగ్రవాద దాడికి భారత ప్రభుత్వం ప్రతిచర్యగా చేపట్టిన ఆపరేషన్ సిందూర్ విజయాన్ని గుర్తుచేస్తారు. ఈ సందర్భంగా విజయ్ కుమార్ మాట్లాడుతూ, పహల్గాం ప్రాంతంలో జరిగిన ఉగ్రదాడి దేశానికి తలవంచే ఘటనగా నిలిచిందన్నారు. అయితే, త్రివిధ దళాల ప్రతిస్పందన భారతదేశానికి గర్వకారణమైందన్నారు. దేశం మొత్తం ఒకే స్వరంతో ముష్కర చర్యలను ఖండించడం గొప్ప సంగతిగా అభిప్రాయపడ్డారు. విజయ్ కుమార్ అభిప్రాయపడుతూ, "ఆపరేషన్ సిందూర్ విజయానికి గుర్తుగా ఈ బంగారు శాలువాను తయారు చేశాను. ఇది కేవలం ఒక వస్త్రం కాదు, ఇది భారత త్రివిధ దళాల శక్తి, సామర్థ్యం, దేశం కోసం వారి త్యాగానికి నేను అర్పించిన కళా నివాళి" అని వివరించారు.

**సిరిసిల్ల చేనేతకు మరో గౌరవం**

ఈ శాలువా తయారీ ద్వారా సిరిసిల్ల చేనేతకు ఒక కొత్త గుర్తింపు వచ్చింది. నేతన్న విజయ్ తన కళా ప్రతిభను దేశ గౌరవానికి అంకితం చేయడం స్ఫూర్తిదాయకం. అగ్గిపెట్టెలో పట్టేలా శాలువాను రూపొందించడం, అది దేశ ప్రధానికి బహుమతిగా ఇవ్వడం చేనేత రంగానికి మైలురాయిగా నిలుస్తుంది.

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at #119&120, 1st Floor, Down Town Mall, Lakdikapul, Hyderabad, Telangana-500004. Editor : M.M.RAHMAN RNINo. APTEL/2013/50370